www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
V3 NEWS
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
27-12-2024
సంపుటి : 01 | సంచిక : 235 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా|| కాచం సత్యనారాయణ CMD

## వందేళ్లకు వందనం
నేడు ఉనికే ప్రశ్నార్థకం

3

ప్రజలపక్షాన నిలబడే శక్తిగా కమ్యూనిస్టులంటే సమాజంలో ఎనలేనిగౌరవం. వెనుదీయని వారి పోరాటలపై సమాజంలో అపార నమ్మకం. స్వార్థం, సంకుచితత్వం, సంపదలపై వ్యామోహం, పదవుల కలహాలు, కులమత రాజకీయాలకు దూరంగా దేశంకోసం, ప్రజల శ్రేయస్సుకోసం ఉన్నత ఆశయాలే ఆయుధాలుగా కమ్యూనిస్టుల ప్రస్థానం ప్రత్యేకమైనది. కమ్యూనిస్టులు సామ్యవాద భావజాలానికి, లౌకిక ప్రజాస్వామ్య విలువలకు అంకితమై వాటిని కాపాడేందుకు అహర్నిశలు పాటుపడ్డారు. పేద, బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం పోరాటాలు చేశారు. సెక్యులరిజాన్ని కాపాడడంలో, వివిధ రంగాల్లో ఆధిపత్య శక్తులను నియంత్రించడంలో, ప్రజలను చైతన్యం చేయడంలో కమ్యూనిస్టుల పాత్ర గణనీయంగా ఉందన్నది వాస్తవం. ముఖ్యంగా వెట్టిచాకిరీ నిర్మూలన, భూసంస్కరణలు కామ్రేడ్ల విజయాలకు చారిత్రక నిదర్శనాలు. అయితే ఒకనాడు దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కమ్యూనిస్టులు మనుగడ చీలికలు, సైద్ధాంతిక విభేదాలతో విడిపోయి నానాటికీ వారి వైభవం మసకబారుతూ వచ్చింది. ప్రస్తుతమైతే కమ్యూనిస్టుల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కమ్యూనిస్టు పార్టీలు కనుమరగయ్యే పరిస్థితి దాపురించింది.భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి శతవసంతంలోకి అడుగుపెట్టిన వేళ విశ్వంభర ప్రత్యేక కథనం..



భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) ఇక లేరు. తీవ్ర అనారోగ్యంతో ఎయిమ్స్ లో చేరిన ఆయన గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. మృదు స్వభావి అయిన మన్మోహన్ సింగ్.. ఉన్నత విద్యావంతుడు, ప్రఖ్యాత ఆర్థికవేత్త. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని గట్టెక్కించి అభివృద్ధిపథంలో పరుగులు పెట్టేలా చేసి ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా ప్రసిద్ధిగాంచారు. పార్లమెంటు సభ్యుడిగా దాదాపు 33 ఏళ్ల పాటు కొనసాగారు. ఆరోగ్యం సహకరించని పరిస్థితుల్లోనూ కీలక సమయాల్లో ఓపిగ్గా సభకు వచ్చి అందరిలోనూ స్ఫూర్తి నింపారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి, ప్రజా జీవితం నుంచి నిశ్శబ్దంగానే వైదొలగినప్పటికీ దేశ ఆర్థిక రంగానికి వేసిన బలమైన పునాదులు ఆయనను ఎన్నటికీ గుర్తు చేస్తూనే ఉంటాయి. ఆర్థిక మంత్రిగా ఎల్‌పీజీ సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది.

# నవ భారత రూపశిల్పి ఇకలేరు



## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూత



అవిశ్రాంత యోధుడు..
ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలందించిన సారథి

- దేశాన్ని సుదీర్ఘకాలంపాటు పాలించిన ప్రధానుల్లో ఒకరు
- ప్రధాని పీఠాన్ని అధిష్ఠించిన తొలి హిందూయేతర వ్యక్తిగా మన్మోహన్ రికార్డు
- యూపీఏ ప్రభుత్వ సారథిగా ఆధార్ కార్డు, ఆర్టీఐ చట్టం, ఉపాధిహామీ చట్టం, ఆహారభద్రతా చట్టం తెచ్చిన మేధావి

2



సినీ పరిశ్రమ సామాజిక బాధ్యతతో
## వ్యవహరించాలి
ఇండస్ట్రీని ప్రోత్సహించడమే మాముఖ్య ఉద్దేశ్యం

- సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం..
- పరిశ్రమ కూడా కమిటీని ఏర్పాటు చేసుకోవాలి
- మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన, మహిళా భద్రతపై ప్రచారంలో సినీ ప్రముఖులు చొరవ చూపాలి
- సినీ ప్రముఖులతో సీఎం భేటీ..

4



## ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు, బెయిల్ మంజూరు
పోలీసుల విధులను అడ్డుకున్నారని కేసు నమోదు
విచారణకు హాజరుకాని శ్రీనివాస్
అదుపులోకి తీసుకుని, నాంపల్లి కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
వాదనలు విన్న కోర్టు.. షరతులతో కూడిన బెయిల్ మంజూరు
విచారణకు సహకరించాలని ఆదేశాలు

2



2

## ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది
- 'ఈసీ' నిష్పాక్షికతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి
- రాజ్యంగపరమైన సంస్థలను తమ గుప్పిట్లో ఉంచుకునేందుకు బీజేపీ విశ్వ ప్రయత్నాలు
- ఎన్నికల నియమావళిలో మార్పుల ద్వారా కేంద్రం ఏం చేయాలనుకుంటోంది..?
- బెళగావిలో నవ సత్యాగ్రహ బైఠక్‌లో ఖర్గేవ్యాఖ్యలు



## బీసీలంటే లెక్క లేదా?
- బీసీ కులగణనపై బీజేపీ వైఖరి చెప్పాలి.. ఎమ్మెల్సీ కవిత డిమాండ్
- స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల కాంగ్రెస్ ప్రభుత్వ హామీపై ఎందుకు స్పందించడం లేదు
- వారు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు అవ్వడం బీజేపీకి ఇష్టం లేదా అని ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులను కుదేలు చేస్తోందని మండిపాటు

**విశ్వంభర, హైదరాబాద్:** బీసీ కులగణనపై తమ వైఖరి ఏంటో బీజేపీ పార్టీ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలు, కామారెడ్డి డిక్లరేషన్ అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. బీసీలంటే బీజేపీకి లెక్కలేదా అని అడిగారు. గురువారం నాడు కుమ్మరి సంఘం నేతలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తన నివాసంలో కలిశారు. బీసీలు, ముఖ్యంగా కులవృత్తుల వారు ఎదుర్కొంటున్న సమస్యలను వారు ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా

మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం
స్కాన్ చేయండి



2

శివదీప నాట్యోత్సవంలో చుక్కల హేమశృతికి నంది బహుమతి ప్రధానం చేస్తున్న విత్రీ న్యూస్ చానల్, విశ్వంభర దిన పత్రిక ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ

## అలరించిన శివదీప నాట్యోత్సవం
- ఘనంగా కేసీఆర్ చిత్ర యూనిట్ అభినందన సభ
- నాట్యోత్సవంలో పాల్గొన్న చిన్నారులకు ప్రశంసాపత్రాలు, నటరాజ నంది బహుమతులు అందజేసిన డా.కాచం

### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 103 | ₹ 125 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 179 | ₹ 205 |



## అరేబియాలో మునిగిన నౌక
- తొమ్మిది మందిని భారతీయ సిబ్బందిని కాపాడిన కోస్ట్ గార్డ్

2

చెప్పులు లేకుండా 20కిలోమీటర్లు నడిచిన
## గురుకుల విద్యార్థులు
- తమను వేధిస్తున్న ప్రిన్సిపల్ ను తక్షణమే సస్పెండ్ చేయాలంటూ సుదీర్ఘ నిరసన ర్యాలీ
- కలెక్టర్‌కు ఫిర్యాదు..

2



# నవ భారత రూపశిల్పి ఇకలేరు



**విశ్వంభర, నేషనల్ బ్యూరో**

ఆర్థిక సంస్కరణల సూత్రధారి,నవ భారత రూపశిల్పి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92)గురువారం రాత్రి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత కారణాలతో ఆయన్ని కుటుంబీకులు ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో చేర్చగా.. చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. భారతదేశానికి 14వ ప్రధానమంత్రిగా పని చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్.. దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా గుర్తింపు పొందారు.అక్టోబర్ 1991లో తొలిసారి రాజ్యసభలో అడుగుపెట్టారు. 1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు కేబినెట్ లో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ పని చేశారు. ఆ సమయంలో దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేయడంలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారు. ఇక 2004లో నాటి యూపీఏ ప్రభుత్వ హయాంలో మన్మోహన్ సింగ్ దేశ ప్రధానిగా బాధ్యతలు చేట్టారు. దాదాపు దశాబ్దం పాటు ఆయన ఆ పదవిలో కొనసాగారు. మే 22, 2004న ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సింగ్.. మే 26, 2014 వరకు వరుసగా రెండు పర్యాయాలు ఆ పదవిలో బాధ్యతలు చేపట్టారు. దేశాన్ని సుదీర్ఘకాలంపాటు పాలించిన ప్రధానుల్లో ఒకరిగా నిలిచారు. మొత్తం 3,656రోజుల పాటు కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ ప్రభుత్వానికి నాయకత్వం వహించి, అత్యధిక కాలం పనిచేసిన మూడో ప్రధానిగా నిలిచారు.

**మన్మోహన్ ప్రస్థానం..**

సెప్టెంబర్ 26, 1932న పశ్చిమ పంజాబ్‌లోని గాహ్ గ్రామంలో(ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది) జన్మించిన మన్మోహన్ సింగ్.. ఆర్థికశాస్త్రంలో 1952లో బ్యాచిలర్ డిగ్రీ, 1954లో ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చండీగఢ్ విశ్వవిద్యాలయం నుంచి పొందారు. 1957లో కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్స్, 1962లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. సింగ్ ప్రభుత్వ సేవలో సుదీర్ఘమైన అనుభవం కలిగి ఉన్నారు. రాజకీయాల్లోకి రాకముందు పంజాబ్ యూనివర్సిటీలో, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అధ్యాపకుడిగా విద్యార్థులకు ఆర్థిక పాఠాలు బోధించారు. ఇందిరా గాంధీ హయాంలో 1971లో కేంద్ర వాణిజ్యశాఖకు ఆర్థిక సలహాదారుగా నియమితులై అనతి కాలంలోనే 1972లో ఆర్థిక మంత్రిత్వ శాఖకు ప్రధాన సలహాదారు అయ్యారు. 1976 వరకు ఆ పదవిలో ఉన్నారు.1976 1980 మధ్య మన్మోహన్ సింగ్ అనేక కీలక పదవులు చేపట్టారు. వీటిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డైరెక్టర్‌గా, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ డైరెక్టర్‌గా, మనీలాలోని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌లో భారతదేశానికి ప్రత్యామ్నాయ గవర్నర్, ఆల్టర్నేట్‌గా ఉన్నారు. ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌లో భారతదేశానికి గవర్నర్‌గా.. అలాగే ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగా.. అటామిక్ ఎనర్జీ కమిషన్, స్పేస్ కమిషన్ రెండింటిలోనూ సభ్యుడు(ఫైనాన్స్) గా కూడా పదవులు చేపట్టారు మన్మోహన్ సింగ్.ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గానూ బాధ్యతలు నిర్వహించారు.1982 సెప్టెంబర్ 151985 జనవరి 15 వరకు ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారు.ప్రధాన మంత్రికి సలహాదారుగా, యూజీసీ ఛైర్మన్‌గా బహుముఖమైన సేవలందించారు.1991లో దేశ ఆర్థిక మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 2019 వరకూ అసోం నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు.అస్సాం నుంచి ఎగువ సభలో ఐదు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించారు. 2019 నుంచి 2024 వరకూ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు.2024 సంవత్సరం ప్రారంభంలో రాజ్యసభ నుంచి పదవీ విరమణ చేశారు. 33 సంవత్సరాల తర్వాత ఎగువ సభలో తన రాజకీయ ప్రస్థానాన్ని ముగించారు.








**సంస్కరణల సారథి..**
**ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలందించిన నేత..**

యావత్ దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకున్న వేళ.. 1991లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అప్పటి ప్రధాని పీవీ నర్సింహరావు, తన క్యాబినెట్‌లో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ ను తీసుకున్నారు. విపక్షాల నుంచి, కాంగ్రెస్ పార్టీలోని నేతల నుంచి విమర్శలు వచ్చినా ఆర్థిక సంస్కరణలను విజయవంతంగా అమలు చేశారు. సరళీకృత ఆర్థిక విధానాల అమలుతో దేశ రూపురేఖలే మారిపోయాయి. ఆర్థిక సంస్కరణల అమలుతో 1996 లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. 1996 98 మధ్య యునైటెడ్ ఫ్రంట్, 19982004 మధ్య బీజేపీ నేత వాజపేయి సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో కొనసాగింది.ఆసమయంలో రాజ్యసభ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. తిరిగి 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సోనియాగాంధీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలను గెలుచుకున్నది. మిత్రపక్షాల మద్దతుతో ఏర్పాటైన యూపీఏ కూటమి తొలి విడుత ప్రభుత్వానికి మన్మోహన్ సింగ్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ తర్వాత ఐదేండ్లు పదవీ కాలం పూర్తి చేసుకున్న తర్వాత రెండోసారి ప్రధానిగా నియమితులైన కాంగ్రెస్ నేత మన్మోహన్ సింగ్. 2009లో యూపీఏ కూటమి మరింత మెజారిటీ సాధించింది. దీంతో రెండోసారి ప్రధానిగా మన్మోహన్ సింగ్ 2009లో పదవీ బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి 2014 వరకూ ప్రధానిగా పదేండ్ల పాటు కొనసాగారు.ప్రధాని పీఠాన్ని అధిష్టించిన తొలి హిందూయేతర వ్యక్తిగా మన్మోహన్ రికార్డు సృష్టించారు. 2005లో సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చారు.2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. యూపీఏ ప్రభుత్వ సారథిగా మన్మోహన్ సింగ్ హయాంలో జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, పౌరులందరికీ గుర్తింపు కార్డు ఆధార్ జారీ చేసేందుకు భారత విశిష్ట ప్రాధికార సంస్థను తీసుకొచ్చారు. యూపీఏ ప్రభుత్వానికి బయటి నుంచి లెఫ్ట్ పార్టీలు మద్దతు ఉపసంహరించినా 2008లో అమెరికాతో చారిత్రక పౌర అణు ఒప్పందం కుదుర్చుకున్నారు. మన్మోహన్ సింగ్ హయాంలో అత్యధిక జీడీపీ (10.2శాతం) వృద్ధిరేటు నమోదైంది. మన్మోహన్ హయాంలోనే వెనుకబడిన వర్గాలకు 27శాతం సీట్ల కేటాయింపు జరిగింది. ప్రధానిగా మన్మోహన్ సింగ్ రోజూ 18గంటల పాటు అవిశ్రాంతంగా పనిచేసేవారు. మన్మోహన్ హయాంలోనే వెనుకబడిన వర్గాలకు 27శాతం సీట్లు కేటాయించారు.భారత విత్త వ్యవస్థను అత్యంత శక్తిమంతగా తీర్చిదిద్దారు. దశాబ్ద పాలనలో చిరస్మరణీయ విజయాలను అందుకున్నారు.మోదీ హాయంలో పార్లమెంటులో పెద్ద నోట్ల రద్దును మన్మోహన్ సింగ్ వ్యతిరేకించారు. దీన్ని "వ్యవస్థీకృత దోపిడీ మరియు చట్టబద్ధమైన దోపిడీ"గా మన్మోహన్ అభివర్ణించారు.

**ఆయన సేవలకు అనేక అవార్డులు..**

ఆయన దేశానికి చేసిన సేవలకు గాను 1987లో మన్మోహన్‌కు పద్మవిభూషణ్ ప్రదానం చేశారు. 1993, 94లో ఉత్తమ ఆర్థిక మంత్రిగా యూరో మనీ అవార్డు అందుకున్నారు.2010లో వరల్డ్ స్టేట్స్ మెన్ అవార్డు వరించింది.2017లో ఇందిరాగాంధీ శాంతి బహుమతి అందుకున్నారు.ఫోర్బ్స్ అత్యంత శక్తిమంతుల జాబితాలోనూ మన్మోహన్‌కు చోటు దక్కింది. భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్ (Manmohan Singh) కన్నుమూశారు. గురువారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను ఢిల్లీలోని ఎయిమ్స్ అత్యవసరం విభాగంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. దేశం గొప్పనేతను కోల్పోయిందని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**దేశం ఓ విశిష్ట వ్యక్తిని కోల్పోయింది..**
**రాష్ట్రపతి, ప్రధాని సహా ప్రముఖుల సంతాపం...**

భరతమాత ముద్దు బిడ్డను కోల్పోయింది: రాష్ట్రపతి ముర్ము

"విద్య, పరిపాలనను సమానంగా విస్తరింపజేసిన అరుదైన రాజకీయ నాయకుల్లో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఒకరు. భారత ఆర్థిక వ్యవస్థను సంస్కరించడంలో కీలకపాత్ర పోషించారు. దేశానికి ఆయన చేసిన సేవ, ఆయన రాజకీయం జీవితం, వినయంతో కూడిన నడవడిక ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆయన మృతి దేశానికి తీరనిలోటు. భరతమాత ముద్దుబిడ్డల్లో ఒకరైన మన్మోహన్‌కు మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు సానుభూతి తెలియజేస్తున్నా"



**దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చారు: ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్**

"మన్మోహన్ సింగ్ ఇక లేరన్న విషయం చాలా బాధకు గురిచేసింది. ఆయన భారత దేశ ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చారు. ఆర్థిక సరళీకరణ రూప శిల్పిగా పేరు గడించారు. ఎంతో ధైర్యం ప్రదర్శించి కఠిన నిర్ణయాలతో దేశం ముందుకు సాగేలా చేశారు. దేశ అభివృద్ధికి ఎన్నో ద్వారాలు తెరిచారు. ఉప రాష్ట్రపతిగా ఆయనతో ఎన్నో సంభాషణలు జరిపాను. ఆర్థిక విధానం పట్ల ఆయనకున్న ప్రగాఢ విశ్వాసం, దేశ పురోగతి పట్ల అచంచల నిబద్ధత ఎప్పటికీ గుర్తుండిపోతాయి. భారత దేశం మహోన్నతమైన వ్యక్తిని కోల్పోయింది. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

**భారత్ విశిష్ట వ్యక్తిని కోల్పోయింది: ప్రధాని మోదీ**

"భారత దేశం విశిష్టమైన వ్యక్తుల్లో ఒకరైన మన్మోహన్ సింగ్‌ను కోల్పోయింది. ఎంతో నిరాడంబరంగా ఉండే ఆయన ఆర్థికవేత్తగా ఎదిగారు. ప్రధానిగానే కాకుండా ఆర్థిక మంత్రితో పాటు ఎన్నో ప్రభుత్వ విభాగాల్లో పని చేశారు. దేశ ఆర్థిక విధానంపై ఎన్నో ఏళ్లుగా బలమైన ముద్రవేశారు. పార్లమెంట్‌లో ఆయన ప్రసంగాలు గొప్పగా ఉండేవి. ప్రధానిగా దేశ ప్రజల జీవితాలు మెరుగుపరిచేందుకు ఎంతో కృషి చేశారు. మన్మోహన్ ప్రధానిగా, నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తరుచూ మాట్లాడుకునేవాళ్లం. పాలనకు సంబంధించిన పలు అంశాలపై చర్చించేవాళ్లం. ఆయన జ్ఞానం, వినయం ఎల్లప్పుడూ ప్రస్ఫుటించేవి. ఈ సమయంలో నా ఆలోచనలన్నీ ఆయన కుటుంబం చుట్టూ తిరుగుతున్నాయి" అని మోదీ పేర్కొన్నారు.

**దేశపాలనలో మన్మోహన్ సింగ్ పాత్ర కీలకం: అమిత్ షా**

"మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఇక లేరన్న వార్త చాలా బాధ కలిగించింది. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ నుంచి ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశ పాలనలో కీలక పాత్ర పోషించారు ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని భగవంతుణ్ని వేడుకుంటున్నా".

**మార్గదర్శిని కోల్పోయాను: రాహుల్ గాంధీ**

"గురువు, మార్గదర్శిని కోల్పోయాను. అపార జ్ఞానం, సమగ్రతతో మన్మోహన్ సింగ్ దేశాన్ని నడిపించారు. ఆర్థికశాస్త్రంలో ఆయన లోతైన అవగాహన దేశానికి స్ఫూర్తి. మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు: సీఎం చంద్రబాబు**

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. "ఆయన మృతి దేశానికి తీరని లోటు. మన్మోహన్‌సింగ్ కుటుంబానికి, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి. కేంద్ర ఆర్థిక మంత్రిగా దేశంలో అనేక ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారు. కేంద్రమంత్రిగా, ప్రధానిగా దేశానికి నిర్విరామంగా సేవలందించారు".

**నవభారత నిర్మాత మన్మోహన్‌సింగ్ : సీఎం రేవంత్‌రెడ్డి**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. "మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థికవేత్త, రాజకీయ నాయకుడు, మానవతావాది. ఆయన తీసుకున్న అసామాన్య నిర్ణయాల్లో మానవతా దృక్పథం కూడా ఒకటి. మన్మోహన్‌సింగ్.. అసలైన నవభారత నిర్మాత. భరతమాత ఓ గొప్ప కుమారుడిని కోల్పోయింది".

**మన్మోహన్ చిరస్మరణీయులు: పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

"ఆర్థికవేత్తగా, రిజర్వు బ్యాంక్ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా దేశంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలకు దిశానిర్దేశం చేసిన మన్మోహన్ సింగ్ చిరస్మరణీయులు. వ్యక్తిగతంగా నాకు ఎంతో ఆత్మీయులు. వారి నిబద్ధత, క్రమశిక్షణ, నిరాడంబరత ఆదర్శమైనవి. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి".

**మన్మోహన్ ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయి: ఖర్గే**

మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంతాపం తెలిపారు. "దేశం దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిని కోల్పోయింది. మన్మోహన్ ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయి. మన్మోహన్‌ను దేశం ఎప్పుడూ కృతజ్ఞతతో గుర్తుపెట్టుకుంటుంది"



## అలరించిన శివదీప నాట్యోత్సవం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ సారస్వత పరిషత్ లో కళా నిలయం, విశ్వంభర దినపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్ర యూనిట్ అభినందన సభను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో నాట్య కళాభారతి వారు 50 మంది చిన్నారులతో శివ దీప నాట్యోత్సవం గురువు జాహ్నవి రెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విత్రీ న్యూస్ ఛానల్ , విశ్వంభర దిన పత్రికల చైర్మన్ డా. కాచం సత్యనారాయణ సభాధ్యక్షతన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిధులుగా బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ , మాజీ డిసిపి సుంకర సత్యనారాయణ , అలాగే కళానిలయం అధినేత, నిర్వాహకులు పుష్పలత సురేందర్ పాల్గొని మాట్లాడారు. కెసిఆర్ చిత్ర యూనిట్ అభినందనలు తెలిపారు. అలాగే శివ దీప నాట్యోత్సవం ద్వారా 50 మంది చిన్నారులు చేసిన నృత్యాలు ఎంతోగానో అలరించాయి. అనంతరం చిన్నారులకు ప్రశంసా పాత్రలతో పాటు నటరాజ నంది బహుమతులను ముఖ్య అతిధుల చేతుల మీదుగా అందజేశారు.

## అరేబియాలో మునిగిన నౌక..

**ముంద్రా:** అరేబియా సముద్రంలో కల్లోల వాతావరణ పరిస్థితుల కారణంగా ఓ నౌక మునిగి పోగా.. అందులోని తొమ్మిది మంది భారతీయ సిబ్బందిని కోస్ట్ గార్డ్ సురక్షితంగా కాపాడింది. పాకిస్థాన్ సహకారంతో రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు వెల్లడించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌లోని ముంద్రా నుంచి యెమెన్‌లోని సొకొత్రా ద్వీపానికి ఓ నౌక (ఎంఎస్‌వి తాజ్‌ధారే హరామ్) బయల్దేరింది.

మార్గమధ్యంలో పశ్చిమ అరేబియా సముద్రంలో భీకర అలల తాకిడికి నౌక ప్రమాదానికి గురైంది. గుజరాత్‌లోని పోరుబందర్‌కు సుమారు 311 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తమను కాపాడాలంటూ అందులోని తొమ్మిది మంది సిబ్బంది అత్యవసర సందేశం పంపారు. రోజువారీ నిఘా కార్యకలాపాల్లో భాగంగా చక్కర్లు కొడుతున్న 'ఐసీజీ డోర్నియర్' దీన్ని గుర్తించి.. గాంధీనగర్‌లోని ఐసీజీ ప్రాంతీయ ప్రధాన కార్యాలయం(నార్త్ వెస్ట్), ముంబయిలోని 'ఎంఆర్‌సీసీ'లను అప్రమత్తం చేసింది.ఈ క్రమంలోనే ఘటనాస్థలానికి సమీపంలో పెట్రోలింగ్‌లో ఉన్న ఐసీజీ నౌక 'శూర్' వెంటనే రంగంలోకి దిగి.. విపత్కర వాతావరణ పరిస్థితుల నడుమ ఆ సిబ్బందిని సురక్షితంగా కాపాడింది. రెస్క్యూ ఆపరేషన్‌లో పాకిస్థాన్ అధికారులతో సమన్వయం చేసుకున్నట్లు కోస్ట్‌గార్డ్ వెల్లడించింది. సిబ్బందికి వైద్య సాయం అందించామని, వారిని పోరుబందర్‌కు తరలిస్తున్నట్లు తెలిపింది.

## చెప్పులు లేకుండా 20కిలోమీటర్లు నడిచిన గురుకుల విద్యార్థులు..

**విశ్వంభర, గద్వాల్:** జోగులాంబ గద్వాల్ జిల్లా బీచుపల్లి బాలుర గురుకుల పాఠశాల విద్యార్థుల ఆందోళన సంచలనంగా మారింది. తమను వేధిస్తున్న ప్రిన్సిపల్ ను తక్షణమే సస్పెండ్ చేయాలంటూ సుదీర్ఘ నిరసన ర్యాలీ చేపట్టారు. బిచుపల్లిలోని గురుకులం నుంచి గద్వాల్ జిల్లా కలెక్టరేట్ కు వరకు ఏకంగా 20కిలోమీటర్లు నడిచి వెళ్ళారు. జిల్లా కలెక్టర్ సంతోష్‌ను కలిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ వేధింపులకు గురి చేస్తున్నాడని... మాకు ఈ ప్రిన్సిపల్ వద్దని విజ్ఞప్తి చేశారు. ఉద్దేశ్యపూర్వకంగానే తమని వేధిస్తున్నాడని విన్నవించారు.బీచుపల్లి బాలుర గురుకుల పాఠశాలలో ఆరవ తరగతి నుంచి ఇంటర్ మీడియట్ వరకు విద్యార్థులు ఉన్నారు. సుమారు 620మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్ కు ప్రిన్సిపల్ పై ఫిర్యాదు చేశారు. హాస్టల్లో భోజనం సరిగా లేదని ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్తే టార్గెట్ చేసి కొడుతున్నాడని ఆరోపించారు. విద్యార్థులను చూడటానికి వచ్చిన తల్లిదండ్రులపై సైతం అకారణంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడని చెబుతున్నారు. ఎదురుతిరిగి విద్యార్థులను సస్పెండ్ చేసి ఆ సీట్లను కొత్తవారికి అమ్మేస్తున్నడని విద్యార్థులు ఆరోపించారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదు స్వీకరించిన జిల్లా కలెక్టర్ వారికి భరోసా కల్పించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.అయితే విద్యార్థులు హాస్టల్ కి వెళ్లేందుకు మాత్రం నిరాకరించారు. ప్రస్తుత ప్రిన్సిపల్ విధుల్లో ఉంటే తమపై ఇంకా ఎక్కువ వేధింపులకు గురిచేస్తాడని కలక్టరేట్ ముందు ఆందోళన నిర్వహించారు. దీంతో ప్రిన్సిపల్ విధుల్లో ఉండదని హామీ ఇవ్వడంతో పాఠశాలకు తిరుగు ప్రయాణం అయ్యారు. ఇక ప్రిన్సిపల్ వ్యవహారాన్ని అటు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు విద్యార్థులు. వెంటనే అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే విద్యార్థులను ప్రత్యేక వాహనాల్లో గురుకులం వద్దకు పంపించారు.

## ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు, బెయిల్ మంజూరు

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. పోలీసుల విధులను అడ్డుకున్నారని శ్రీనివాస్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇప్పటికే నాంపల్లి పోలీసులు ఆయన్ను 3 సార్లు విచారణకు పిలిచారు. విచారణకు రాకపోవడంతో గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. వాదనలు విన్న కోర్టు.. శ్రీనివాస్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.5వేల పూచీకత్తుతో పాటు ఇద్దరు ష్యూరిటీలు సమర్పించాలని, పోలీసుల విచారణకు సహకరించాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. అంతకు ముందు బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, వివేక్, ఎర్రబెల్లి దయాకర్‌రావు మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్‌లో ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కలిసి పరామర్శించారు. శ్రీనివాస్‌ను కోర్టుకు తరలించే క్రమంలో పోలీసు వాహనాన్ని బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు.

## ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా చెరుకుమల్లి శ్రీనివాస్

**తొలిసారిగా తెలుగు వ్యక్తి నియామకం..**



**విశ్వంభర, హైదరాబాద్ :** భారత వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్(ఐఏఆర్ఐ) గా డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు నియామకం అయ్యారు. ఐఏఆర్ఐ అధిపతిగా ఎంపికైన తొలి తెలుగు శాస్త్రవేత్త చెరుకుమల్లి శ్రీనివాసరావు కావడం గమనార్హం. ప్రస్తుతం నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీనివాసరావు.. ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.1965 అక్టోబర్ 4వ తేదీన కృష్ణా జిల్లా అనిగండ్లపాడులో శ్రీనివాసరావు జన్మించారు. 1975 80 వరకు అనిగండ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యను అభ్యసించారు. బాపట్ల వ్యవసాయ కాలేజీలో అగ్రికల్చరల్ బీఎస్సీ పట్టా అందుకున్నారు. ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇజ్రాయెల్ టెల్ - అవివ్ యూనివర్సిటీలో పోస్ట్ - డాక్టోరల్ చేసిన శ్రీనివాసరావు.. భారత్‌లోని పలు పరిశోధన సంస్థల్లో వివిధ హోదాల్లో సేవలందించారు.

## అంతవరకు చెప్పులు వేసుకోను..

**అన్నామలై భీష్మ ప్రతిజ్ఞ**

**కోయంబత్తూర్:** తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నాయూనివర్సిటీలో ఓ విద్యార్థినిపై అత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పిపోయాయని, దీనికి అధికార డీఎంకే ప్రభుత్వమే కారణమని భాజపా విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై భీష్మ ప్రతిజ్ఞ చేశారు. డీఎంకే అధికారం కోల్పోయేంత వరకు తాను పాదరక్షలు ధరించబోనని ప్రతినబూనారు. గురువారం కోయంబత్తూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు." డీఎంకే ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు నేను పాదరక్షలు ధరించను. చెప్పులు లేకుండానే నడుస్తా. ఎన్నికల్లో విజయం సాధించడానికి ఎప్పటిలాగే డబ్బులు ఎరగా చూపం. రూపాయి కూడా పంచకుండా ఎన్నికలకు వెళ్తాం. ఎన్నికల్లో విజయం సాధించేంత వరకు చెప్పులు ధరించను" అని అన్నామలై అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో చెడు అంతమైపోవాలని కోరుతూ కోయంబత్తూరులోని తన నివాసంలో ఆరు కొరడా దెబ్బలు భరించి... మురుగన్‌కు మొక్కు చెల్లించుకుంటానని అన్నారు. రాష్ట్రంలోని ఆరు మురుగన్ క్షేత్రాలను దర్శించుకునేందుకు 48 గంటలపాటు ఉపవాస దీక్ష చేపడతానన్నారు.మరోవైపు అన్నా యూనివర్సిటీకి చెందిన బాధిత విద్యార్థిని ఫిర్యాదుకు సంబంధించిన 'ఎఫ్ఐఆర్'ను లీక్ చేయడంపై అన్నామలై మండిపడ్డారు. ఆమె వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లేలా పోలీసు అధికారుల తీరు ఉందని విమర్శించారు. లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు జ్ఞానశేఖరన్‌పై రౌడీషీట్ తెరవలేదని, డీఎంకేతో అతడికున్న సంబంధాలే అందుకు కారణమని ఆరోపించారు. పక్కా ప్రణాళిక ప్రకారం కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

## ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది

**బెంగళూరు:** బీజేపీపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగపరమైన సంస్థలను తమ గుప్పిట్లో ఉంచుకునేందుకు ఆ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. కర్ణాటకలోని బెళగావిలో నవ సత్యాగ్రహ బైఠక్' (సీడబ్ల్యూసీ సమావేశం)లో పాల్గొన్న ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. "జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీ సిద్ధాంతాలు, బీఆర్ అంబేడ్కర్ గౌరవం కోసం చివరి శ్వాస వరకు మేమంతా పోరాడుతాం. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగపరమైన సంస్థలను భాజపా తన గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం క్రమంగా సన్నగిల్లుతోంది. ఈసీ నిష్పాక్షికతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల నియమావళిలో మార్పుల ద్వారా కేంద్రం ఏం చేయాలనుకుంటోంది..?" అని ఖర్గే ప్రశ్నించారు. వచ్చే ఏడాదిలో పార్టీలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేస్తామని మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఎన్నికల్లో నెగ్గేందుకు అవసరమైన నైపుణ్యాలతో పార్టీని మరింత బలంగా సన్నద్ధం చేస్తాం. కేవలం శ్రమిస్తే మాత్రమే సరిపోదు. సమయానుకూలంగా వ్యూహాలు ఉండాలి. ఒక నిర్దిష్ట మార్గం అవసరం. కొత్త నాయకత్వానికి అవకాశం ఇవ్వాలి" అని పేర్కొన్నారు. కాగా.. బెళగావిలో 'నవ సత్యాగ్రహ బైఠక్' (సీడబ్ల్యూసీ సమావేశం) ప్రారంభమైంది. జెండా ఎగురవేసి కార్యక్రమాన్ని ఖర్గే ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నేతలు రాహుల్ గాంధీ, జైరాం రమేశ్, సిద్ధరామయ్య, డీకే శివకుమార్, భూపిందర్ హుడా, రాజీవ్ శుక్లా తదితరులు హాజరయ్యారు.

## బీసీలంటే లెక్క లేదా..?

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని స్పష్టం చేశారు. కేసీఆర్ కుల వృత్తులకు అన్ని విధాలా మద్ధతిచ్చారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కులవృత్తులను కుదేలు చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా బీసీల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నా... బీజేపీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. బీసీలు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్ లు అవ్వడం బీజేపీ పార్టీకి ఇష్టం లేదా అని ప్రశ్నించారు. బీసీ కులగణన విషయంలో ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదని సూచించారు. దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టం తీసుకొస్తే అన్ని రాష్ట్రాల్లో కులగణన జరుగుతుందని, కానీ కేంద్రం ఆ దిశగా అడుగులు వేయకపోవడం అంటే బీసీలపై ప్రేమ లేనట్లే మనం అర్థం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో యునైటెడ్ పులే ఫ్రంట్ నాయకులు బొల్ల శివ శంకర్, తెలంగాణ రాష్ట్ర శాలివాన సంఘ నాయకులు దుగుంట్ల నరేష్, నిమ్మలూరి శ్రీనివాస్, రేపాక రాంబాబు, రావుల కోల్ ఎన్, తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక సంఘం నాయకులు హకీంకారి సురేందర్, జికె జహంగీర్, జీకే పరమేశ్వర్, ఏ వెంకటేశ్వర్, జికె అఖిల బాయి పాల్గొన్నారు.



# 100 ఏళ్లకు వందనం
# నేడు ఉనికే ప్రశ్నార్థకం

**చీలికలు.. సైద్ధాంతిక విభేదాలతో తిరోగమనం వైపు కమ్యూనిస్టులు**

**విధానాల కంటే అవసరాలు, స్వప్రయోజనాల కోసమే పాకులాడుతున్న కామ్రేడ్లు**

**ఒకటీ అరా సీట్ల కోసం ఇతర పార్టీలతో పొత్తుకు వెంపర్లాడే దుస్థితి**

**నాడు ఏ సమస్య తలెత్తినా ఎర్రజెండాలతో ఉద్యమించే కామ్రేడ్లు.. ఇప్పుడు కరువయ్యారు**

**సీపీఐ పార్టీ వందేళ్ల ప్రస్థానంపై విశ్వంభర కథనం..**

ఎరుపులోనే మెరుపుంది..పోరాడే శక్తుంది..శ్రమజీవుల హక్కులకై ఎలుగెత్తే బలముంది! అంటూ 'ప్రపంచ కార్మికులారా ఏకమవ్వండి'..అంటూ కీలక నినాదంతో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ శతవసంతంలోకి అడుగుపెట్టింది. మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆరంభం నుంచే ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొంటూ విస్తృత ప్రజా బాహుళ్యానికి చేరువైంది. స్వతంత్ర భారత దేశ తొలి సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన జాతీయ పార్టీ కాంగ్రెస్‌కు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం అనేంతగా ప్రాచుర్యం పొందింది. వాస్తవానికి మట్టిని, మనిషిని, చెమటను, చెట్టును ప్రేమించే సహజ లక్షణం కమ్యూనిస్టు సిద్ధాంతాలది. స్వేచ్ఛను, మార్పును, క్రాంతిని ఆకాంక్షించే భావజాలం వారిది. పోరాటాలకు ప్రతిరూపం.. కార్మిక, కర్షక, అణగారిన వర్గాల గొంతుక. ఎర్రజెండా వర్గరహిత స్వర్గం, మానవతకు నిలయం అన్నది కామ్రేడ్ల బలమైన నినాదం. ఇదంతా ఇప్పుడు గత చరిత్ర. మాది దీర్ఘకాలిక పోరాటం.. భవిష్యత్‌లో బలపడతాం అని ఆత్మవిశ్వాసం వ్యక్తంచేసిన కమ్యూనిస్టు పార్టీలు వర్తమానంలో ఉనికిపాట్లు పడుతున్నాయి. ఊహాతీతమైన వేగంతో మార్పు చెందుతున్న సమాజంతో పరుగులు తీయలేక సొమ్మసిల్లాయి. భవిష్యత్ కోసం కాలగర్భంలోని వందేళ్ల నాటి పునాదుల్ని వెతుక్కుంటున్నాయి. మనదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్నా కార్మిక రాజ్య స్థాపన మాటేమో గాని... వారు మాత్రం వివిధ పార్టీలుగా, గ్రూపులుగా విడిపోయారు. శతవసంతంలోకి అడుగుపెట్టిన కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంపై విశ్వంభర ప్రత్యేక కథనం..

## ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా..

జాతీయోద్యమంలో, ఆ తర్వాతా కమ్యూనిస్టు ఉద్యమం క్లిష్టమైన మార్గంలో పయనించింది. తీవ్ర నిర్బంధం సహా అనేక ఆటుపోట్లకు గురైంది. పలు విజయాలతో పాటు కొన్ని విధానపరమైన పొరపాట్లను సొంతం చేసుకుంది. భారత కమ్యూనిస్టులకు అప్పటి సోవియట్ రష్యా ప్రధాన స్ఫూర్తి. బ్రిటిష్ పాలకుల నుంచి దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత తీర్మానించడమే కాకుండా ఆ దిశగా కాంగ్రెస్ పార్టీపైనా ఒత్తిడి తెచ్చారు. ఆర్థిక, రాజకీయ అంశాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ భారత కమ్యూనిస్టు పార్టీ 1936 నుంచి 1945 వరకు స్వాతంత్ర్య ఉద్యమంలో కాంగ్రెస్‌లో భాగంగానే కొనసాగింది. 1942-45 మధ్య కాలంలో రైతులు, కార్మికులు, విద్యార్థులు, మేధావుల్లో కమ్యూనిస్టుల ప్రాబల్యం గణనీయంగా పెరిగింది. 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికల్లో 61 లోక్‌సభ స్థానాల్లో పోటీచేసిన ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ 23 స్థానాల్లో గెలుపొంది ప్రధాన ప్రతిపక్ష పార్టీగా అవతరించింది. కాంగ్రెస్ పార్టీకి రాజకీయ ప్రత్యామ్నాయం కాగలదనే అభిప్రాయం కల్పించింది.1957 సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభలో భారత కమ్యూనిస్టుల బలం 27కు చేరింది. అదే సమయంలో కేరళలో విజయం సాధించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వంగా నిలిచింది.నంబూద్రిపాద్ అధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నికల మార్గంలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రావడం అప్పటికి ప్రపంచంలోనే అరుదైన ఘటన. ఈ విజయంతో ఎన్నికల మార్గంలో అ ధి కా రం లో కి రావచ్చనే భావన కమ్యూనిస్టుల్లో బలపడిరది.1962 సార్వత్రిక ఎన్నికల అనంతరం లోక్‌సభలో కమ్యూనిస్టు పార్టీ ఎంపీల సంఖ్య 29కు పెరిగింది. ఈ కాలంలోనే కేరళ, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్‌లలో బలమైన రాజకీయ శక్తిగా ఎదిగింది.

ప్రజలపక్షాన నిలబడే శక్తిగా కమ్యూనిస్టులంటే సమాజంలో ఎనలేనిగౌరవం. వెనుదీయని వారి పోరాటలపై సమాజంలో అపార నమ్మకం. స్వార్థం, సంకుచితత్వం, సంపదలపై వ్యామోహం, పదవుల కలహాలు, కులమత రాజకీయాలకు దూరంగా దేశంకోసం, ప్రజల శ్రేయస్సుకోసం ఉన్నత ఆశయాలే ఆయుధాలుగాకమ్యూనిస్టుల ప్రస్థానం ప్రత్యేకమైనది. గ్రామస్థాయిలో వారు రగిల్చిన అరుణారుణ చైతన్య స్ఫూర్తి కిరణాలు అభ్యుదయ సమాజానికి బాటలు వేశాయి. దేశంలో చాలా పార్టీలు రకరకాల అవినీతి ఆరోపణల్లో కూరుకు పోయాయి. అనేక విధాల అవకాశవాదాలతో రంగులు మార్చుకున్నాయి. కానీ వందేళ్ల చరిత్రలో కమ్యూనిస్టులు సామ్యవాద భావజాలానికి, లౌకిక ప్రజాస్వామ్య విలువలకు అంకితమై వాటిని కాపాడేందుకు అహర్నిశలు పాటుపడ్డారు. సెక్యులరిజాన్ని కాపాడడంలో, వివిధ రంగాల్లో ఆధిపత్య శక్తులను నియంత్రించడంలో, ప్రజలను చైతన్యం చేయడంలో కమ్యూనిస్టుల పాత్ర గణనీయంగా ఉందన్నది వాస్తవం. ముఖ్యంగా వెట్టిచాకిరీ నిర్మూలన, భూసంస్కరణలు

## కమ్యూనిస్టులకు సమాజంలో ఎనలేని గౌరవం..

కామ్రేడ్ల విజయాలకు చారిత్రక నిదర్శనాలు. ఇప్పటి పాలకుల గొప్పలన్నీ నాటి కమ్యూనిస్టు పోరాట విజయాలపై ఎగురుతున్న రంగుల జెండాలే. యూపీఏ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకానికీ కమ్యూనిస్టు ఉద్యమాలు, చొరవే కారణమన్నది జగద్విదితం.

## కమ్యూనిస్టులు సాధించిన విజయాలు..

కేంద్రంలో, అత్యధిక రాష్ట్రాల్లోనూ అధికార పగ్గాలు చేపట్టలేకపోయినా, సైద్ధాంతిక విభేదాలు ఎన్ని ఉన్నా....భారత కమ్యూనిస్టులు సాధించిన విజయాలు, వారి త్యాగాలు విస్మరించలేనివి. తెలంగాణ సాయుధ పోరాటంలో సుమారు 4 వేల మంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేశారు. 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారు. నక్సల్స్ ఉద్యమాల్లో మరణాల సంఖ్య కూడా తక్కువేమీ కాదు. సమ సమాజ భావజాలంతో దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య రంగాలపై కమ్యూనిస్టులు ప్రగాఢమైన ముద్ర వేశారు. రైతులు, కూలీలు, కార్మికులు, విద్యార్థులు, యువత...ఇలా అన్ని వర్గాల ప్రజలను ప్రభావితం చేశారు. దేశంలో భూ సంస్కరణలు, కార్మికుల అనుకూలమైన చట్టాల రూపకల్పన, అటవీ భూములపై గిరిజన హక్కులను గుర్తిస్తూ 1/70 వంటి శాసనాల వెనుక తమ ఉద్యమాల ప్రభావం ఉందని కమ్యూనిస్టులు గుర్తు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎందరో కమ్యూనిస్టులు జాతీయ స్థాయి నేతలుగా ఖ్యాతి పొందారు.

## మసకబారిన వైభవం

కమ్యూనిస్టు రాజకీయాల్లోకి యువతరం మొగ్గు చూపకపోవడం, కాలంచెల్లిన సిద్ధాంతాలతో రాన్రాను వైభవం మసకబారుతూ వచ్చింది. చివరకు ఎన్నికల్లో సొంతంగా పోటీచేయడానికి కూడా సాహసించలేని దుస్థితి ఏర్పడిరది. ఒకటీ అరా సీట్లకోసం ఇతర పార్టీలతో పొత్తుకు వెంపర్లాడాడే దుర్గతి దాపురించింది.ప్రజల పక్షాన పోరాడేవారేరీ?సమకాలీన రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. సిద్ధాంతాలు.. విధానాల కంటే అవసరాలు, స్వప్రయోజనాలే ఆయా పార్టీలకు ప్రధానమయ్యాయి. ఎవరు ఎప్పుడు ఎవరితో కలిసివుంటారో.. ఎప్పుడు విభేదించుకుంటారో తెలీని పరిస్థితి. జాతీయ రాజకీయాల్లోనే కాదు.. తెలుగు రాష్ట్రాల్లోనూ కమ్యూనిస్టుల పరిస్థితి రోజుకు రోజుకీ దిగజారిపోతుంది.. అభివద్ధి.. సంక్షేమం.. జీవనప్రమాణాల గురించి ఆయా ప్రభుత్వాలు.. పార్టీలు ఎవరెన్ని చెప్పినా.. కమ్యూనిస్టుల పోరాటాలకు మూలమైన ఆనాటి సమస్యలు నేటికీ ఉన్నాయి. విద్య, ఉపాధి, శాంతిభద్రతల నుంచి హక్కుల వరకూ సామాన్యులు, పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. వ్యక్తులుగా వ్యవస్థలతో పోరాడలేక వేదన చెందుతున్నారు. గతంలో ఏ చిన్న సమస్య తలెత్తినా ఎర్రజెండాలతో ఉద్యమించే కామ్రేడ్లు.. ఇప్పుడు కరువయ్యారు. ఇళ్లు కూల్చివేస్తున్నా.. నిరుద్యోగులు లాఠీదెబ్బలు తింటున్నా వారితరఫున నిజాయతీగా ముందు నిలిచేవారే లేరు. ప్రతిపక్షాలు రాజకీయాల కోసం హంగామా చేసినా, బాధితులకు పూర్తిభరోసా లభించడం లేదు. ఒకనాడు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను శాసించిన కమ్యూనిస్టులు దుస్థితి నేడు వారి ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో కమ్యూనిస్టుల ప్రధాన నేతలు ఏ ఎండకు ఆగొడుగు పడుతూ కమ్యూనిస్టుల సిద్ధాంతాన్ని మసకబారుస్తున్నారు. పార్టీ ప్రయోజనం కంటే కూడా తమ స్వప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రధాన పార్టీల వెంటనడిచేందుకు వారిచ్చే తాయిలాలకు కక్కుర్తి పడుతున్నారన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా ఈ పార్టీలలోని ప్రధాన నేతలు ప్రజా ప్రతినిధులుగా గెలిచే పరిస్థితులు ప్రస్తుతం లేకపోవడంతో పార్టీ పదవులను అంటిపెట్టుకుంటున్నారు. ప్రజాసమస్యల కోసం అలుపెరగని పోరాటాలు చేయాల్సిన కమ్యూనిస్టులు తమ సిద్ధాంతాలను మరిచి రాజకీయ ప్రయోజనాలకోసమే పనిచేస్తున్నారు.

## కమ్యూనిస్టుల్లో చీలిక

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన 1947 తరువాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో తలెత్తిన అంతర్గత వివాదాలు క్రమంగా విస్తరిస్తూ భారీ సంక్షోభానికి దారి తీశాయి. స్వతంత్ర భారత దేశాన్ని, వైరుధ్యాలను అంచనా వేసే విషయంలో, దేశ తొలి ప్రధాని నెహ్రూ విధానాలను సమర్థించే విషయంలో తీవ్ర గందరగోళానికి గురైంది. నెహ్రూ ప్రభుత్వ సైనిక చర్య తర్వాత... హైదరాబాద్ నిజాం వ్యతిరేక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం విషయంలోనూ తీవ్ర విభేదాలు పొడచూపాయి. స్టాలిన్ అనంతర సోవియట్ రష్యాను అంచనా వేయడంలోనూ ఇవి కొనసాగాయి. భిన్న వర్గాల మధ్య రాజీ యత్నాలు ఫలించలేదు. 1964లో పార్టీ చీలిపోయింది. సీపీఎం ఆవిర్భవించింది. ఆ తర్వాత... ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, ఇతర భావసారూప్య పార్టీలతో కలిసి పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపురలలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసినప్పటికీ, పార్లమెంటులో ఉనికిని కాపాడుకోగలిగినప్పటికీ కాలక్రమంలో స్తబ్ధతకు గురయ్యాయి. దీర్ఘ కాలం అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్, త్రిపురలలోనూ వామపక్షాలకు వరుస ఓటములు ఎదురయ్యాయి. పార్లమెంటరీ రాజకీయాలు, సాయుధ పోరాట కార్యాచరణ అంశాలతో కమ్యూనిస్టుల్లో మళ్లీ విభేదాలు పొడసూపాయి. 1967లో సీపీఐ(ఎం) నుంచి కొందరు బయటికి వచ్చారు. నక్సలైట్ ఉద్యమ పంథాను ఎంచుకున్నారు. ఫోకస్ గ్రామాల నుంచి అడవులకు మళ్లింది. సీపీఐ చీలిపోయి సీపీఎం ఏర్పడానికి చాలాకాలమే పట్టింది కానీ తర్వాత సీపీఎం నుంచి సీపీఐ ఎంఎల్ శ్రేణుల వేరు కుంపట్లకు ఎక్కువ కాలమేమీ పట్టలేదు. నక్సల్బరీ ఉద్యమం ప్రాతిపదికగా ఉనికిలోకి వచ్చిన సీపీఐ(ఎం-ఎల్) ఎంతో కాలం ఐక్యంగా కొనసాగలేకపోయింది. అనేక చీలికలకు గురైంది. మొత్తంగా కమ్యూనిస్టు ఉద్యమం గతంలో ఎన్నడూ లేనంతగా ఒడుదుడుకుల్ని ఎదుర్కొంది.

## కమ్యూనిస్టులలో అగ్రవర్ణాలదే ఆదిపత్యం..

బడుగు, బలహీన, అణగారిన వర్గాలకోసం పోరాడే పార్టీలుగా గుర్తింపు కమ్యూనిస్టు పార్టీలలో ఆదిపత్యం మాత్రం అగ్రవర్ణాలదే. సీపీఐ, సీపీఎం పార్టీలను చూసుకుంటే కేంద్ర, రాష్ట్రాలలో పార్టీ ప్రదాన పదవుల్లో కొన్నేళ్లుగా అగ్రవర్ణాల ఆధిపత్యమే కొనసాగుతోంది. దేశ, రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఇతర ముఖ్య పదవుల్లో అగ్రవర్ణాల వారే అధికం. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం రావాలనే పోరాడే కమ్యూనిస్టులు వారి పార్టీల పదవుల్లో బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యమివ్వరు. అంతేకాకుండా పేదల పార్టీగా చెప్పుకునే కమ్యూనిస్టుల్లో ప్రధాన నేతల్లో చాలా మంది శ్రీమంతులే. ఎంఎల్ఏలు, ఎంపిలుగా చేసిన చాలా మంది కోటీశ్వరులుగా ఉన్నారన్నది మాత్రం వాస్తవం. ఎవరో ఒకరిద్దరూ కమ్యూనిస్టు భావజాలం నరానరాన నింపుకొన్న చందులాల్, గుమ్మడి నర్సయ్య, హరిబండి లక్ష్మీనారాయణ లాంటి కొందరు మూడునాలుగు పర్యాయాలు ఎంఎల్ఏలు, ఎంపీలుగా చేసినా తమ కొచ్చిన జీతాన్ని సైతం పార్టీ అభివృద్ధికోసమిచ్చేవారు. అవకాశమున్నా తాము నమ్మిన సిద్ధాంత కోసం కట్టుబడి ఉన్నారు. కానీ, నేటి నేతల్లో చాలామంది శ్రీమంతులే ఉన్నారు. వీరు కూడా ఎంతసేపటికి పార్టీ ప్రధాన పదవులను అంటిపెట్టుకుని అధికార పార్టీలకు కొమ్ముకాస్తూ స్వార్థ ప్రయోజనాలే చూసుకుంటున్నారు.

## ఒక్కశాతానికి పడిపోయిన కమ్యూనిస్టుల ఉనికి

కమ్యూనిస్టుల వందేళ్ల సుదీర్ఘ కాలంలో సైద్ధాంతిక విభేదాలతో దీనిలో ఎన్నో చీలికలు వచ్చాయి. వీటిలో ఉనికి కోల్పోయినవి, మరో దాంట్లో విలీనమైనవే ఎక్కువ. ప్రస్తుతం సీపీఐ, సీపీఎం దేశవ్యాప్తంగా కనీస పట్టుగల పార్టీలుగా కనబడుతున్నాయి. రాజకీయపరంగా వీటిని చూసుకుంటే 1952 లో జరిగిన తొలి పార్లమెంట్ ఎన్నికల సమయంలో దేశంలోని ఓటర్ల సంఖ్య 17.3 కోట్లు. ఆ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీకి 16 , సోషలిస్టు పార్టీకి 12 సీట్లు వచ్చాయి. వాటికి 3 .3 శాతం ఓట్లు దక్కాయి. ప్రస్తుతం దేశంలోని 91.2 కోట్ల ఓట్లలో అవి ఒకశాతం లోపే ఉన్నాయి. దీన్ని బట్టే మన దేశంలో రాజకీయ క్షేత్రంలో కమ్యూనిజం ఎలా కానరాకుండా పోతుందో ఈ లెక్కలు చెబుతున్నాయి.

## ఒక్కతాటిపైకి రావాలి...

**అణగారిన వర్గాలకు కమ్యూనిస్టులతోనే సరైన న్యాయం లభిస్తుందని, వారుమాత్రమే తమకోసం నిజాయతీగా పోరాడుతారని ఇప్పటికీ ప్రజల్లో ఉంది. కమ్యూనిస్టు పార్టీల్లో ఉన్న నేతలు ఇప్పటికైనా తమ స్వార్థ ప్రయోజనాలు, రాజకీయాల కోసం కాకుండా , ప్రజా సమస్యల పరిష్కారం కోసం, అణగారిన వర్గాల కోసం, బాధితులకు న్యాయం చేకూర్చేందుకు పనిచేయాల్సిన అవసరం ఉంది. అంతేగాకుండా సైద్ధాంతిక విబేధాలతో విడిపోయిన కమ్యూనిస్టు పార్టీలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి ప్రజలకోసం పోరాడాల్సిన అవసరం ఉంది.**





- డాక్టర్ కాచం సత్యనారాయణ
వీ3 న్యూస్, విశ్వంభర తెలుగు దిన పత్రిక
ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్

## శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు షురూ..!



**విశ్వంభర, శ్రీశైలం:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19 నుంచి మార్చి ఒకటో తేదీ వరకూ జరుగుతాయి. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల కోసం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నది. ఉత్సవ ఏర్పాట్లలో భాగంగా భక్తులు సేద తీరడానికి పలు చోట్ల చలువ పందిళ్లు వేస్తున్నారు. సంప్రదాయ బద్ధంగా పూజాధికాలు జరిపి గురువారం ఈ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ఎం శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం నర్సింహారెడ్డి, పలువురు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఆలయ మాడ వీధులు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, ఉద్యానవనాలు, దేవస్థాన సత్ర ప్రాంగణాలు, ఆరు బయలు ప్రదేశాలు మొదలైన చోట్ల ఈ చలువ పందిళ్లు వేస్తున్నారు .ఈ సందర్భంగా ఈఓ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో వీలైనన్ని ఎక్కువ ప్రదేశాల్లో చలువ పందిళ్లు వేయాలని సూచించారు. అన్ని చోట్ల కూడా తగినంత విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మంచినీటి వసతి కూడా ఉండాలని చెప్పారు. బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19న ప్రారంభం అవుతున్నా భక్తులు ముందస్తుగానే క్షేత్రానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. కనుక బ్రహ్మోత్సవ ఏర్పాట్లన్నీ ఫిబ్రవరి మొదటి వారంలోపే పూర్తి కావాలని, తదనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## ట్రూ అప్ ఛార్జీల కర్త.. కర్మ.. క్రియ.. అంతా జగనే: అచ్చెన్నాయుడు




**విశ్వంభర, అమరావతి:** మాజీ సీఎం జగన్ చేసిన పాపాలు.. నేడు రాష్ట్రానికి శాపాలుగా మారాయని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. గత ప్రభుత్వ పాలనలో విద్యుత్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెరుగుదలకు జగనే కారణమన్నారు. ట్రూ అప్ ఛార్జీల కర్త.. కర్మ.. క్రియ.. అంతా జగనే అని అన్నారు. ప్రజలపై భారం మోపి.. ధర్నాలు, ర్యాలీలు చేయడం సిగ్గుచేటన్నారు. యూనిట్ విద్యుత్ ధర రూ.5కే వస్తున్నా జగన్ కొనలేదన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి యూనిట్ విద్యుత్ రూ.8కి కొనుగోలు చేశారని ఆరోపించారు.

## చెడు ప్రచారం వద్దు.. రాజధాని ప్రాంతంలో చర్చనీయాంశమైన ఫ్లెక్సీలు




**విశ్వంభర, అమరావతి:** సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత పోస్టులను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించగా.. ప్రజల నుంచి కూడా స్పందన కనిపిస్తోంది. వ్యక్తిగత దూషణలకు, మహిళలను అవమానించడానికి సోషల్ మీడియాను ఉపయోగిస్తున్న వారిపై ఇటీవల పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. కేసులు పెట్టి కొందరిని జైలుకు పంపించారు. ఈ క్రమంలో రాజధాని ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చర్చకు దారి తీశాయి.సోషల్ మీడియాలో చెడు ప్రచారం వద్దంటూ... మూడు కోతుల బొమ్మలతో రాజధాని అమరావతితో పాటు గుంటూరు, విజయవాడ నగరాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అసత్య ప్రచారాలకు, దూషణలకు చెక్ పెడదామని నినాదాలను ప్రచారంలోకి తెస్తున్నారు. 'చెడు విషయాలు పోస్ట్ చేయొద్దు.. నైతికంగా పతనం కావొద్దు' అని ప్రతిజ్ఞ చేద్దామని పిలుపునిస్తున్నారు. అందరికీ అర్థమయ్యేలా ఆంగ్లం, తెలుగు భాషల్లో వీటిని ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాను మంచి కోసం వాడుదాం అంటూ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల ద్వారా చైతన్యం తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. అయితే వీటిని ఎవరు ఏర్పాటు చేశారనేదానిపై మాత్రం స్పష్టత రాలేదు. సోషల్ మీడియా పోస్టులపై ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురావడానికి ముందే ప్రజల్లో అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి ఉంటాయని భావిస్తున్నారు.

## కాంగ్రెస్‌లో భారీగా సంస్థాగత సంస్కరణలు: కేసీ వేణుగోపాల్



**బెళగావి:** కాంగ్రెస్‌లో సంస్థాగతంగా భారీ సంస్కరణలు తీసుకురాబోతున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. వెంటనే ఈ ప్రక్రియ మొదలవుతుందన్నారు. కర్ణాటకలోని బెళగావిలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అనంతరం వేణుగోపాల్ మీడియాతో మాట్లాడారు. సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులతో పాటు పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించినట్లు చెప్పారు. 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పేరిట డిసెంబర్ 2024 నుంచి జనవరి 2026 వరకు ప్రజా సమస్యలపై ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. 2025వ సంవత్సరం పార్టీలోని ప్రతిస్థాయిలో సంస్థాగత పునరుద్ధరణ ఏడాదిగా నిలుస్తుందని చెప్పారు. పల్లెలు, పట్టణాల నుంచి 'సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర' పేరిట దేశవ్యాప్త ప్రజా ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.తూర్పు లద్దాఖ్‌లోని కీలక ప్రాంతాల నుంచి భారత్, చైనా బలగాల ఉపసంహరణపై సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది. ఏప్రిల్ 2020 నాటి స్థితిని పునరుద్ధరించాలనే భారత్ లక్ష్యం నెరవేరలేదని తెలిపింది. ఇది భారత్‌కు అతిపెద్ద ఎదురుదెబ్బగా అభివర్ణించింది. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం కలగజేసుకొని వారి భద్రత, శ్రేయస్సుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకొని దేశంలో పలుచోట్ల దాడులు జరగడంపైనా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సామాజిక ఆర్థిక సర్వేను వీలైనంత త్వరగా చేపట్టాలని తీర్మానించింది. దేశవ్యాప్తంగా నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని, పేదలకు ఆర్థిక మద్దతు, మధ్యతరగతి ప్రజలకు పన్ను రాయితీలు ఇవ్వాలని సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానం చేశారు.

# ఐదేళ్లలో 5లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

**- చంద్రశేఖరన్**



**ముంబయి:** రాబోయే ఐదేళ్లలో టాటా గ్రూప్ సంస్థల ద్వారా 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు 2024 సంవత్సరాన్ని అనూహ్య సంవత్సరంగా మార్చేశాయని పేర్కొన్నారు. కొత్త ఏడాదిలోకి అడుగు పెడుతున్న వేళ ఇయర్ ఎండ్ నోట్‌ను విడుదల చేశారు.

2024 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా భౌగోళికంగా, రాజకీయంగా అస్థిర పరిస్థితులు నెలకొన్నాయని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇవి ప్రపంచ స్థూల ఆర్థిక ముఖచిత్రాన్నే మార్చి వేశాయన్నారు. ఉక్రెయిన్, గాజా, సూడన్‌లో నెలకొన్న యుద్ధ వాతావరణం, బంగ్లాదేశ్, దక్షిణ కొరియాలో ప్రజా ఆందోళనలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. భవిష్యత్‌లోనూ ఇమ్మిగ్రేషన్, టెక్నాలజీ, ప్రపంచ వాణిజ్యం వంటి అంశాల్లో సవాళ్లు ఎదురుకానున్నాయని పరోక్షంగా ట్రంప్ పాలన గురించి ప్రస్తావించారు.వయో భారంతో అక్టోబర్ 9న దూరమైన రతన్ టాటా గురించీ తన లేఖలో ప్రస్తావించారు. తనదైన వ్యక్తిత్వం, దూరదృష్టి, వ్యూహాలతో టాటా గ్రూప్ వ్యాపార నమూనాను సమూలంగా మార్చివేసిన రతన్ టాటా ఈ ఏడాదే దూరం కావడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయనలేని లోటు పూడ్చలేనిదన్నారు. వ్యక్తిగతంగా తాను ఓ మార్గదర్శకుడిని కోల్పోయానంటూ ఆవేదన వ్యక్తంచేశారు.

అదే విధంగా 2024లో గ్రూప్ సాధించిన ఘనతలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశంలోనే తొలి సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ ప్లాంట్, సీ295 ఎయిర్‌క్రాఫ్ట్ ఫైనల్ అసెంబ్లీ ప్లాంట్ సహా ఏడు తయారీ యూనిట్లను ఈ ఏడాదే ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఎయిర్ ఇండియా, విస్తారా సంస్థలు ఇదే ఏడాది విలీనం అయ్యాయని గుర్తు చేశారు. ఎలాంటి సవాళ్లు ఎదురైనా కస్టమర్ల సంతృప్తి, సాంకేతికత, భద్రత వంటి అంశాల్లో ప్రపంచస్థాయి పనితీరును గ్రూప్ కనబరచాలని ఆకాంక్షించారు. తయారీ రంగంలో త్వరలో భారత్‌లో స్వర్ణయుగం రాబోతోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాల కల్పన తమ లక్ష్యమని పేర్కొన్నారు. బ్యాటరీలు, సెమీ కండక్టర్లు, విద్యుత్ వాహనాలు, సోలార్ వంటి రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు.

# జనగణనలో కులగణన చేయాలి

- నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ముందడుగు వేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన
- ఏకగ్రీవంగా సీడబ్ల్యూసీ ఆమోదం



**బెలగావి:** కర్ణాటకలోని బెలగావిలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. జనగణనలో కులగణన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రతిపాదనకు సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు. "దేశంలో త్వరలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశాలు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన జరిగితే దక్షిణాది రాష్ట్రాలలో సీట్ల పెంపు తక్కువగా ఉండి నష్టపోయే పరిస్థితి ఉంటుంది. దీనిపై ఏఐసీసీ వ్యూహాత్మకంగా ఆలోచించాలి. నియోజకవర్గాల సంఖ్య పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా అత్యంత జాగ్రత్తగా ముందడుగు వేయాలి. చట్ట సభల్లో మహిళా బిల్లును కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే ప్రవేశ పెట్టి ఒక కొలిక్కి తెచ్చాం. ఈ నేపథ్యంలో ఆ బిల్లుపై మనం ఎక్కువగా ప్రచారం చేయాలి. బీజేపీ.. మహిళా బిల్లుతో వారికి అనుకూలంగా రిజర్వేషన్లు చేసుకునే అవకాశాలు ఉంటాయి. ఆ విషయంలో కాంగ్రెస్ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. తెలంగాణలో కులగణన దేశంలోనే మార్గదర్శిగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది చేయబోతున్న జనగణనలో దేశ వ్యాప్తంగా కులగణన కూడా చేపట్టాలని కాంగ్రెస్ డిమాండ్ చేసి పోరాటం చేయాలి. ఈ విషయంలో సీడబ్ల్యూసీ ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

# శబరిమల ప్రత్యేక రైళ్లు రద్దు..

## దక్షిణ మధ్య రైల్వే కీలక ప్రకటన



**విశ్వంభర, హైదరాబాద్ :** శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రత్యేక రైళ్లల్లో కొన్నింటిని రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. కొన్ని సర్వీసులకు ఇప్పటి వరకు ఎలాంటి బుకింగ్స్ చేసుకోలేదని, రద్దీ లేకపోవడం కారణంగానే కొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

**రద్దు అయిన ప్రత్యేక రైళ్లు ఇవే..**

జనవరి 24న వెళ్లాల్సిన మౌలాలి - కొట్టాయం(07167), జనవరి 25న కొట్టాయం - మౌలాలి(07168), మౌలాలి - కొల్లాం(07171), జనవరి 27న కొల్లాం - మౌలాలి(07172), జనవరి 26న కాచిగూడ - కొట్టాయం(07169), జనవరి 27న కొట్టాయం - కాచిగూడ(07170), నర్సాపూర్ - కొల్లాం(07157), జనవరి 29న కొల్లాం - నర్సాపూర్(07158), జనవరి 28న హైదరాబాద్ - కొట్టాయం(07065) ప్రత్యేక రైళ్లను రద్దు చేశారు. వీటితో ఇతర శబరిమల ప్రత్యేక రైళ్లు.. జనవరి 29న కొట్టాయం - సికింద్రాబాద్(07066), జనవరి 31న మౌలాలి - కొట్టాయం(07167), ఫిబ్రవరి 1న కొట్టాయం - మౌలాలి(07168), జనవరి 24న సిర్పూర్ కాగజ్‌నగర్(07161), జనవరి 26న కొల్లాం - సిర్పూర్ కాగజ్‌నగర్(07162) రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు.

# సినీ పరిశ్రమ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి



**విశ్వంభర, హైదరాబాద్:** సినీ పరిశ్రమను ప్రోత్సహించడమే తమ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ) అన్నారు. ఇండస్ట్రీ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. సినీ ప్రముఖులతో సీఎం భేటీ గురువారం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధిలో సినీ పరిశ్రమ సామాజిక బాధ్యతతో ఉండాలని ముఖ్యమంత్రి సినీ పెద్దలకు సూచించారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో సుమారు 50 మంది సీఎంతో సమావేశమయ్యారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీజీపీ జితేందర్ తదితరులు హాజరయ్యారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట, అల్లు అర్జున్ అరెస్ట్ అనంతర పరిణామాల నేపథ్యంలో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. సమావేశం ప్రారంభంలో సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన వీడియోను సినీ ప్రముఖుల ఎదుట సీఎం ప్రదర్శించారు. అనంతరం పలువురు సినీ పెద్దలు తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రితో పంచుకున్నారు. ప్రభుత్వం వైఖరిని సీఎం వారికి వివరించారు.

### బౌన్సర్లపై సీరియస్‌గా ఉంటాం: సీఎం

"ప్రభుత్వం ఇండస్ట్రీతోనే ఉంది. శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. అభిమానుల్ని కంట్రోల్ చేసుకోవాల్సిన బాధ్యత సెలబ్రిటీలదే. తెలంగాణ అభివృద్ధిలో పరిశ్రమ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన, మహిళా భద్రతపై ప్రచారంలో సినీ ప్రముఖులు చొరవ చూపాలి. ఆలయ పర్యటకం, ఎకోటూరిజంను ప్రచారం చేయాలి. ఇన్వెస్ట్‌మెంట్ల విషయంలోనూ ఇండస్ట్రీ సహకరించాలి. ఇకపై బౌన్సర్ల విషయంలో సీరియస్‌గా ఉంటాం" అని ముఖ్యమంత్రి రేవంత్ తేల్చి చెప్పారు.

### 'పుష్ప'కు పోలీసు గ్రౌండ్ ఇచ్చాం..

"సినీ పరిశ్రమ సమస్యలను ప్రముఖులు మా దృష్టికి తెచ్చారు. అనుమానాలు, అపోహలు, ఆలోచనలు పంచుకున్నారు. మా ప్రభుత్వం ఇండస్ట్రీకి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. సినీ పరిశ్రమను ప్రోత్సహించడమే మా ముఖ్య ఉద్దేశం. 8 సినిమాలకు మా ప్రభుత్వం స్పెషల్ జీవోలు ఇచ్చింది. పుష్ప సినిమాకు పోలీసు గ్రౌండ్ ఇచ్చాం. తెలుగు ఇండస్ట్రీకి ఒక బ్రాండ్ సృష్టించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఐటీ, ఫార్మాతో పాటు మాకు ఈ రంగం కూడా ముఖ్యమే. తెలంగాణలో అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి గద్దర్ అవార్డును తీసుకొచ్చాం. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్యవర్తిగా ఉండాలని దిల్ రాజును ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించాం.

### సినీ పరిశ్రమ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం..

సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. పరిశ్రమ కూడా కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. హాలీవుడ్, బాలీవుడ్ హైదరాబాద్ వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో పెద్ద సదస్సులు నిర్వహించి ఇతర సినీ పరిశ్రమలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నాం. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి నైపుణ్యాలను పెంచి ఉద్యోగాలు కల్పిస్తున్నాం. ఇండస్ట్రీకి ఏం చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలే చేశాయి. ఆ వారసత్వాన్ని మేమూ కొనసాగిస్తాం. తెలుగు పరిశ్రమ తెలుగుకే పరిమితం కాకుండా అంతా కలిసి అభివృద్ధి చేద్దాం" అని సీఎం వివరించారు. సినీ పరిశ్రమ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వ సహకారం ఉంటుందని.. ఆ మేరకు సినీ ప్రముఖులకు భరోసా ఇచ్చినట్లు ఆ తర్వాత ముఖ్యమంత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

### ప్రభుత్వం సహకరిస్తేనే..: నాగార్జున

ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. "ప్రభుత్వం మూలధన పెట్టుబడులు కల్పిస్తేనే మన సినీ పరిశ్రమ ప్రపంచ స్థాయికి ఎదుగుతుంది. హైదరాబాద్ ప్రపంచ సినిమా రాజధాని కావాలనేదే మా కోరిక. యూనివర్సల్ లెవల్‌లో స్టూడియో సెటప్‌లు ఉండాలి" అని తెలిపారు. మర్రి చెన్నారెడ్డి, అక్కినేని వల్లే పరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చిందని దర్శకుడు త్రివిక్రమ్ చెప్పారు.

### సీఎంతో సమావేశంలో పలువురు ప్రముఖులు తెలిపిన అభిప్రాయాలు ఇలా..

"తెలంగాణలో అద్భుతమైన పర్యటన ప్రదేశాలున్నాయి. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను హైదరాబాద్‌లో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అందరు సీఎంలూ పరిశ్రమను బాగానే చూసుకున్నారు. ఈ ప్రభుత్వం కూడా మాకు ప్రోత్సాహం అందిస్తోంది. దిల్‌రాజును ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించడం హర్షణీయం" దర్శకుడు రాఘవేంద్రరావు

"నేను చిన్నప్పటి నుంచి పరిశ్రమను చూస్తున్నా. హైదరాబాద్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాలి. చిన్న చిన్న విషయాలను పట్టించుకోవద్దు" నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి

"సంధ్య థియేటర్ ఘటన మమల్నీ ఎంతగానో బాధించింది. ఎన్నికల ఫలితాల మాదిరిగానే సినిమా రిలీజ్ ఫస్ట్‌డే ఉంటుంది. సినిమా రిలీజ్‌లో పోటీ వల్లే ప్రమోషన్ కీలకంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా సినిమాలు విడుదలవుతున్నందున విస్తృతంగా ప్రమోషన్లు చేస్తున్నాం" మురళీ మోహన్

"ప్రభుత్వంపై మాకు పూర్తి నమ్మకం ఉంది. ప్రభుత్వం సాయంతోనే ఆ రోజుల్లో సినీ పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చింది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ సహా అన్ని ఏజెన్సీలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా ఉండాలి. నగరాన్ని ఇంటర్నేషనల్ ఫిల్మ్ డెస్టినేషన్‌గా చేయాలనేది మా కల" నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు


## హైకోర్టు నిర్ణయంతో నిరాశ చెందొద్దు..

**- గ్రూప్-1 అభ్యర్థులకు ఏనుగుల రాకేశ్ రెడ్డి విజ్ఞప్తి**



**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రూప్ 1 పరీక్షపై దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. హైకోర్టు నిర్ణయంపై బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి స్పందించారు. హైకోర్టు నిర్ణయంతో నిరాశ చెందొద్దని గ్రూప్ 1 అభ్యర్థులకు విజ్ఞప్తి చేస్తున్నానని రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు. జీవో 29పై దాఖలైన పిటిషన్‌ను కొట్టేయడం చాలా దురదృష్టకరం అని చెప్పారు. జీవో 29కు వ్యతిరేకంగా గ్రూప్ 1 అభ్యర్థులు కొట్లాడడం సమర్థనీయమని అన్నారు. సామాజిక న్యాయం కోసం ప్రభుత్వాలు పాటుపడాలి.. అది ప్రభుత్వం బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం సాధించడానికి అదొక్కటే ప్రధాన సాధనం అని చెప్పారు. హైకోర్టు నిర్ణయంతో ఇది ఇక్కడే ఆగిపోతోందని నేను అనుకోను. గ్రూప్ 1 అభ్యర్థులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. మీ కోసం పోరాడుతూనే ఉంటామని ఏనుగుల రాకేశ్ రెడ్డి స్పష్టం చేశారు.

## నిమ్స్‌లో మాజీ ఎంపీ మందా జగన్నాథంను పరామర్శించిన హరీశ్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథంను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం జగన్నాథం ఆరోగ్య పరిస్థితి వివరాలను వైద్యులను అడిగి హరీశ్‌రావు తెలుసుకున్నారు.మందా జగన్నాథంను పరామర్శించిన వారిలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, మాజీ మంత్రులు దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి కూడా ఉన్నారు.రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురైన జగన్నాథంను ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించిన సంగతి తెలిసిందే.

## నాపై అక్రమ కేసులు పెట్టిన ప్రభుత్వంపై ధర్మం గెలిచింది : ఎర్రోళ్ల శ్రీనివాస్



**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కోర్టు బయట ఎర్రోళ్ల శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు.నాపై అక్రమ కేసులు పెట్టిన ప్రభుత్వంపై ధర్మం గెలిచింది. అధర్మం ఓడింది. కోర్టు నిబంధనలు తప్పకుండా పాటిస్తాను. నాకు అండగా నిలిచిన కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు గులాబీ పార్టీ శ్రేణులందరికీ కృతజ్ఞతలు. క్షణం, క్షణం ఈ కేసు వ్యవహారాలను పరిశీలిస్తూ, బెయిల్ కోసం కృషి చేసిన బీఆర్ఎస్ లీగల్ టీమ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు అని ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు.ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను గురువారం మధ్యాహ్నం నాంపల్లి కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. ఇరువైపులా వాదనలు విన్న అనంతరం శ్రీనివాస్‌కు షరతులతో కూడిన బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. రూ. 5 వేల పూచీకత్తు, ఇద్దరి ష్యూరిటీలతో బెయిల్ మంజూరు చేసింది. విచారణకు సహకరించాలని ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## ఆధారాల్లేకుండా ఈవీఎంలను నిందించలేం: సుప్రియా సూలే



**పుణె:** ఈవీఎంల వ్యవహారంపై ఎన్సీపీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే కీలక వ్యాఖ్యలు చేశారు. ఆధారాల్లేకుండా ఈవీఎంలను నిందించలేమన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో అవకతవకలపై కొందరు ఆరోపణలు చేస్తున్నారని.. ఇందులో వాస్తవాలను బయటకు తీసుకొచ్చేలా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బారామతి నుంచి పరాజయం పాలైన తమ పార్టీ అభ్యర్థి యోగేంద్ర పవార్ రీకౌంటింగ్ కోరడం సరికాదని సుప్రియ అభిప్రాయపడ్డారు. ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని సూచించగా.. అతడు వెనక్కి తీసుకున్నాడని మీడియాకు వెల్లడించారు.ఈవీఎంల ద్వారా జరిగిన ఎన్నికల్లోనే తాను నాలుగు సార్లు ఎంపీగా ఎన్నికైనప్పుడు.. అందులో స్కామ్ ఉందని ఎలా చెప్పగలనన్నారు. కాకపోతే, ఓటర్ల జాబితాపై అనేకమంది ప్రశ్నలు లేవనెత్తుతున్నారని.. అందువల్ల ఈవీఎంలు అయినా, బ్యాలెట్ అయినా పారదర్శకంగా జరిగితే ఎలాంటి సమస్య ఉండదని, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు.. ప్రజలు బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు జరగాలని కోరుకుంటే అలాగే చేయాలని, అందుకు ఇబ్బందేంటని సుప్రియా సూలే ప్రశ్నించారు.

# కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి

- సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి
- హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో భారీ ధర్నా
- కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు



**విశ్వంభర, హైదరాబాద్:** వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 20 సంవత్సరాల కాలం నుండి విద్యారంగానికి సేవలు అందిస్తున్నారు.కాంట్రాక్టు పద్ధతిలో వెట్టి చాకిరీ చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న సుప్రీం కోర్టు తీర్పు కూడా అమలు చేయడం లేదు. ప్రభుత్వాలు మారిన వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అందుచేత గత కొంత కాలంగా వివిధ రూపాల్లో నిరసనను ప్రభుత్వంకు తెలియజేశారు. కానీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదు అని వక్తలు ధర్నాలో మాట్లాడారు. రాష్ట్రంలో సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎ స్ఏ)లో పనిచేస్తున్న కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు, గిరిజన సంక్షేమ శాఖ లోని ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీ) తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 10వ తేదీ నుండి సమ్మె బాటపట్టారు. అయిన ప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. విద్యారంగంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల,గిరిజన సంక్షేమ శాఖ లోని ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల (సీఆర్టీ) న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వారి సమ్మెకు మద్దతుగా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టిపిటిఎఫ్ తేదీ 26న ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ ధర్నా శిబిరానికి టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ సమ్మె చేస్తున్న ఎస్ ఎస్ ఏ ఉద్యోగులను చర్చలకు పిలిచి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు ప్రొఫెసర్ కె. లక్ష్మి నారాయణ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ, ప్రొఫెసర్ వెంకటరాజయ్య, విమలక్క, యస్. ఎల్ పద్మ, ఎస్. ఎస్.ఎ. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం, పాశం యాదగిరి, తదితరులు సందేశాలు ఇస్తూ సమ్మెకు మద్దతు తెలియజేశారు, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## క్రీడాకారులకు అభినందనలు



**విశ్వంభర, వరంగల్ :** ఖమ్మంలో ఈ నెల 27, 28, 29. సీఎం కప్ రాష్ట్ర స్థాయిలో జరుగు వాలీబాల్ క్రీడా పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి విజేతలైన వారు పాల్గొనే జట్టుకు టిబిఏ అధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు మార్క్కాల యాదిరెడ్డి, గడ్డం కేశవమూర్తి విజయకుమార్, కొత్తగట్టు సుధాకర్,పీసు రాజిరెడ్డి, తదితరుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బ్యాడ్మెంటన్ సంఘం అధ్యక్షులు, ఏఐసిసి సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మన వరంగల్ జిల్లా వాలీబాల్ క్రీడాకారులు జాతీయ,అంతర్‌జాతీయ స్థాయిలో ఆడి మంచి ప్రతిభను కనబరచి విజేతలుగా నిలచి పేరు తీసుకకొచ్చారని, మీరు కూడా సియం కప్ క్రీడలో కూడా మ్నొదటి స్థానంలో విజేతలై రావాలని కోరారు. అంతర్ జాతీయ క్రీడాకారులు మార్క్కాల యాదిరెడ్డి పర్యవేక్షణ లో మంచి తర్ఫీదు పొందారని మీరు ఖమ్మంలో జరుగు వాలీబాల్ రాష్ట్ర సియం కప్ విజేతలు గా రావాలని వారిని అభినంచారు.

## సేవాలాల్ సేన ప్రజా రాగ్ జోల్ యాత్ర



**విశ్వంభర, ఆదిలాబాద్:** జిల్లాలో సేవాలాల్ సేన ప్రజా రాగ్ జోల్ యాత్ర లో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్ , సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి కడ్తాల్ కాంగ్రెస్ నాయకులు జర్పుల లక్పతి నాయక్ , రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వాంకుడోత్ నరేష్ నాయక్ ముఖ్య అతిథులుగా గురువారం పాల్గొని పాదయాత్ర చేశారు. 19 వ రోజు కొనసాగుతున్న ప్రజా రాగ్ జోల్ యాత్రలో గిరిజనులు పడుకునే ముందు పెద్ద ఎత్తున పాల్గొని యాత్రక విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు మున్యా నాయక్, రాజు నాయక్, రఘు, రూప్ల, శ్రీను, గిరిజన నాయకులు, యువకులు, పాల్గొన్నారు.

## యువకుడి మిస్సింగ్



**విశ్వంభర, మాడ్గుల:** మాడుగుల మండలం దొడ్ల పహాడ్ గ్రామానికి చెందిన ఏదుల పెంటయ్య, తండ్రి వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. అతనికి ఒక కొడుకు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. అతని కొడుకు అయిన ఏదుల వెంకటేష్, వృత్తి టైల్స్ వర్క్ చేస్తుండేవాడు. ఇంట్లో తండ్రి తో గొడవపడి గత నెల 11న ఇంటి నుండి వెళ్లిపోయాడు. ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అతని వయస్సు 26 వివరాలు ఎత్తు: 5.6 అడుగులు, రంగు : చామన చాయ, ముఖం:కోల ముఖం . ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు అతను ఆకుపచ్చ రంగు టీ షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించాడు. అని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తప్పిపోయిన ఏదుల వెంకటేష్ దర్యాప్తు గురించి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జగదీష్ తెలిపారు.

## సీపీఐ వందేళ్ల సంబరాలు



**విశ్వంభర, హైదరాబాద్:** భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల సందర్భంగా దేశ వ్యాప్తంగా సీపీఐ 100 సంవత్చురాల సంబరాలు ఘనంగా జరిగాయి. హైదరాబాద్ అంబర్పేట్ నియోజకవర్గం గోల్నాక వద్ద ఏ ఐ టీ యూ సి రాష్ట కార్యదర్శి సీపీఐ అంబర్పేట్ నియోజకవర్గం ఇంచార్జ బీ.వెంకటేశం ఆధ్వర్యంలో సీపీఐ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బిక్షపతి యాదవ్, జంగయ్య, అశోక్, తిరుమలేశగౌడ్ , శ్యాంనాయక్, ఉమారఖాన్, లతీఫ్, శ్రీను, కృష్ణమూర్తి ఇతర నాయకులు పాల్గొన్నారు. దేశంలో పేద ప్రజల కోసం కార్మిక కర్షక సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న పార్టీ సీపీఐ మాత్రమే అని వెంకటేశం మాట్లాడుతూ అన్నాడు. పేద ప్రజల కోసం హైదరాబాద్ నగరములో పలు చోట్ల సీపీఐ 100 సంవతరాల వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ నెల 30 తేదీన నల్లగొండ పట్టణంలో భారీ బహిరంగ సభ జరగనుంది. భారీగా తరలి రావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## అయ్యప్ప పూజలో పాల్గొన్న భువనగిరి ఎంపీ



**విశ్వంభర, పోచారం:** మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ అయ్యప్ప స్వామి దేవస్థానంలో గురువారం పంబరట్టు కార్యక్రమం అయ్యప్ప స్వాములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప స్వామి ఆలయ ధర్మకర్త, మాజీ టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, తెలంగాణ గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగౌని వెంకటేష్ గౌడ్ పిలుపుమేరకు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇక్కడి అయ్యప్ప స్వామి ఎంతో మహత్యమని పార్లమెంట్ ఎన్నికల ముందు వచ్చి స్వామివారిని దర్శించుకొని నేనొక కోరిక కోరుకున్నానని అయ్యప్ప స్వామి దయతో నేను ఎంపీగా గెలుపొందానని అని అన్నారు.

## అన్వర్ మృతి తీరని లోటు



**విశ్వంభర, కడ్తాల్:** అన్వర్ మృతి పట్ల లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి కడ్తాల్ ప్రజలకు తీరని లోటు అని అన్నారు. అన్వర్‌తో తనకున్న స్నేహ సంబంధాన్ని గుర్తు చేశారు.అన్వర్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. అనంతరం అన్వర్ మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. తదుపరి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సేవ్య నాయక్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, పాండు మాజీ ఉపసర్పంచ్ శారదా పాండు, మంగళపల్లి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ వందేళ్ల జెండా ఆవిష్కరణ



**విశ్వంభర, నెల్లికుదురు:** భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం పాటుపడిన సిపిఐ 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని గురువారం సెంచరీ లోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆవిర్భావ ఉత్సవ జండా పార్టీ మండల కార్యదర్శి బైసా స్వామి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలకు తెగించి పోరాడిన పార్టీ సీపీఐ అన్నారు. లక్షలాది ఎకరాలు భూస్వాముల నుంచి విడిపించి పేదలకు పంచిందని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు కార్మిక కర్షక ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చీకటి సోమయ్య చిర్రా వెంకటేశ్వర్లు టి వెంకట్ రెడ్డి సత్యనారాయణ గంట నాగన్న ఎస్ కే రఫీ శ్యామల్ సలీం బి రాజేష్ ఇస్తారి జి పద్మ టి సుధాకర్ రెడ్డి శ్రీరామ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ముత్తంగి క్రీడా ప్రాంగణం అభివృద్ధికి చర్యలు: ఎమ్మెల్యే గూడెం



**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్ చేరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామంలో గల క్రీడా ప్రాంగణం అభివృద్ధికి నిధులు కేటాయించబోతున్నట్లు పటాన్ చేరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా విస్తరిస్తున్న ముత్తంగి గ్రామ పరిధిలో క్రీడా ప్రాంగణం ఎంతో ప్రాధాన్యతమైనదిగా పేర్కొన్నారు. పచ్చి దానితోపాటు వివిధ రకాల క్రీడా కోర్టులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మాజీ సర్పంచ్ ఉపేందర్, గడీల శ్రీకాంత్ గౌడ్, సిల్వరి శ్రీనివాస్, మేరాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి పరిశ్రమల సహకారం అభినందనీయం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రుద్రారంలో కోటి 68 లక్షల రూపాయల అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



**విశ్వంభర, పటాన్ చేరు :** గ్రామాల అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వాములు కావడం అభినందనీయమని పటాన్ చేరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్ చేరు మండలం రుద్రారం గ్రామ పరిధిలో తోషిబా పరిశ్రమ సహకారంతో కోటి 8 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన పల్లె దవఖాన భవనం, మూడు ఆరో ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. అనంతరం 60 లక్షల రూపాయల గ్రామపంచాయతీ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రతి పల్లె దవాఖానాలో వైద్యుడు తో పాటు ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రుద్రారం గ్రామ అభివృద్ధికి తోషిబా సంస్థ సహకారం అందించడం అభినందనీయమన్నారు.

## ప్రజాస్వామ్య విలువలకు నిలువెత్తు రూపం వాజపేయి

బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్




**విశ్వంభర, వరంగల్:** వరంగల్ జిల్లా ధర్మారం పార్టీ కార్యాలయం లో ఘనంగా భారతరత్న మాన్యశ్రీ అటల్ బిహారి వాజపేయి శత జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ త్యాగమూర్తి మాన్య అటల్ బిహారీ వాజ్‌పేయి దేశం కోసమే పుట్టిన మహానుభావులు ఎందరో అటువంటి వారిలో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి ని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. ఒక్కసారి ఎమ్మెల్యేగా ఎన్నికైతేనే వందలు వేలకోట్ల ఆస్తులను సంపాదించే రాజకీయ నాయకులు ఉన్న ఈ రోజులలో మూడుసార్లు ఈ దేశానికి ప్రధానమంత్రిగా పని చేసినప్పటికీ చరమాంకంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతి గృహంలోనే తనువు చాలించిన శ్రీ వాజ్‌పేయి గారు గురించి ఏమని చెప్పాలి. అందుకేనేమో ఆయన భారతరత్నగా మనందరి గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయారు. విద్యార్థి దశలోనే స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని చవిచూసిన వాజ్‌పేయి దేశమే జీవితం అనుకొని బ్రహ్మచారిగానే మిగిలిపోయారు.

## ఘనంగా నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, నెల్లికుదురు:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డి మన ప్రాంత అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిస్తున్నారని ఎమ్మెల్యే డా.భూక్య మురళీ నాయక్ అన్నారు. మండల కేంద్రం విశ్రాంతిభవనంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు ఎదెల్ల యాదవ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వేం నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించార. దీనికి మురళి నాయక్ హాజరై యాదవ రెడ్డి తదితరులతో కలిసి కేక్ కట్ చేశారు. 600 మందికి ఏర్పాటు చేసిన మహాన్నదాన వితరణ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నరేందర్ రెడ్డి కలకాలం ఆరోగ్యంగా ఉంటూ మరింత ఉన్నత స్థితి కి చేరుకోవాలని ఆకాంక్షించారు. యాదవ రెడ్డి తో పాటు కాంగ్రెస్ శ్రేణులు వేం నిండు నూరేళ్లు జీవించి వెయ్యేళ్లు వర్ధిల్లాలనిఅభిలషించారు.కార్యక్రమంలో కేసముద్రం ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి,పార్టీ మండల అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, హెచ్ వెంకటేశ్వర్లు, మద్దెల సమ్మయ్య, బెల్లి నరసయ్య, రత్నపురం యాకయ్య,సైదులు, నాగరాజు, సుందర్, కిషన్ నాయక్, గొల్లెపెల్లి సతీష్, మరద హరికృష్ణ, ఆకుల కొమురెల్లి వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా వేం నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, మహబూబాబాద్:** కేసముద్రం మండలం కల్వల గ్రామంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి 62 వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కలవల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ముఖ్య సలహాధారుడు వేం నరేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా గ్రామంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు సంబరాలు జరిపారు. అంతే కాకుండా గండి శ్రీనివాస్ మాట్లాడుతూ నరేందర్ రెడ్డి ఇంకా మును ముందు భవిష్యత్తులో అనేక పదవులు పొంది నిండు నూరేళ్లు వర్ధిల్లాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు పాల్గొన్నారు.

**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య సలహాదారులు మహబూబాబాద్ మాజీ శాసనసభ్యులు వేం నరేందర్ రెడ్డి పుట్టినరోజు సందర్బంగా ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



# పేదల అభ్యున్నతి కోసం పోరాడిన పార్టీ 'సిపిఐ'

**విశ్వంభర, రామన్నపేట:** సిపిఐ పార్టీని ఏర్పాటు చేసి 99 సంవత్సరాలు పూర్తి చేసుకొని 100 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ్మా సిపిఐ జెండా ఆవిష్కరణ చేసి, మాట్లాడుతూ సిపిఐ పార్టీ 1925వ సంవత్సరంలో కాన్పూర్ లో ఏర్పాటు చేయబడిందని, 9 మంది కార్యవర్గ సభ్యులతో ఏర్పడిన పార్టీ నేడు దేశవ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిందని అన్నారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని ఎందరో యువ కమ్యూనిస్టులు ప్రాణాలను సైతం త్యాగం చేసారని, ఎందరో మహానుభావులు వారి జీవితకాలాన్ని పార్టీ కోసం, పేదప్రజల అభ్యున్నతి కోసం త్యాగం చేసారని అన్నారు.



సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సిపిఐ మండల కార్యదర్శి సోమ నాగరాజు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



### కడదాక కమ్యూనిస్టుగా బతికిన నిబద్దత గల వ్యక్తి పొట్లచెర్వు రాములు

**విశ్వంభర, రామన్నపేట:** ప్రజల పక్షాన పోరాటమై నిలిచిన నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు కార్యకర్త పొట్లచెరువు రాములు అని సిపిఎం యాదాద్రి జిల్లా కార్యవర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కొమ్మాయిగూడెం గ్రామంలో సిపిఎం మాజీ మండల కమిటి సభ్యుడు పొట్లచెరువు రాములు నాలుగో వర్ధంతి సందర్భంగా స్మారక స్థూపానికి జోహార్లు అర్పించి, పూలమాల వేసి, అనంతరం మాట్లాడుతూ, రాములు సిపిఎం కార్యకర్తగా అనుబంధ ప్రజా సంఘాలైన ప్రజా నాట్య మండలి, వృత్తి సంఘాల ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని కడవరకు నిబద్ధతగా పనిచేశాడని అన్నారు. ప్రభుత్వం అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు నడిపించాడని అన్నారు. రాములు మృతి పార్టీ ఉద్యమానికి, ప్రజా పోరాటాలకు తీరని లోటని, వారి ఆశయాల కోసం పార్టీ కార్యకర్తల కృషి చేయాలని అన్నారు.

### ఘనంగా సిపిఐ ఉత్సవాలు

**విశ్వంభర, ఎల్బీనగర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు .సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి హాజరై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మాట్లాడుతూ భారతదేశంలోనే మొదటిసారిగా సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి దాదాపు 4500 మంది తెలంగాణ గడ్డ కొరకు అమరులై హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులది అని అన్నారు.దేశ స్వాతంత్రం, కార్మికుల హక్కుల కొరకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కొరకు ఎంతో పోరాటం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు భాతరాజు నరసింహ , వంశి వర్ధన్ రెడ్డి, కందుల సుధాకర్, రాములు , శ్రీదేవి, అరుణ్, శోభన్, రామావత్ , కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### సిపిఐ జెండా ఆవిష్కరణ

**విశ్వంభర, తంగళ్ళపల్లి :** రాళ్ల పేట గ్రామంలో సిపిఐ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా డిసెంబర్ 26 నాటికి సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా రాళ్లపేట గ్రామంలో సీనియర్ నాయకులు సోము ఎల్లన్న ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ జెండా ఆవిష్కరణ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో





## విజయ పాడి రైతులను ఆదుకోవాలి

డిసిసిబి డైరెక్టర్



**విశ్వంభర, కడ్తాల్:** విజయ డైరీ పాడి రైతులకు పెండింగ్ లో ఉన్న పాల బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరుతూ గురువారం తెలంగాణ రాష్ట్ర విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ని వివిధ పార్టీల నాయకులతో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్, కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా కడ్తాల పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోగల విజయ డైరీ పాడి రైతులకు బిల్లులు చెల్లించడం లేదని వెంటనే పెండింగ్లో ఉన్న బిల్లులు చెల్లించి పాడి రైతులను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పరంగా సబ్సిడీపై పాడి రైతులకు అందుతున్న ఫీడ్ (దాన) అందే విధంగా చూడాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వపరంగా పాడి రైతులకు అందే ప్రోత్సాహకాలు అన్నిటిని వారికి అందే విధంగా చూడాలన్నారు. కడ్తాల్ పాలసీతిలీకరణ కు సంబంధించిన మిషనరీలు ( యంత్రాలు) పాతబడ్డాయని ప్రస్తుతం నూతనంగా అత్యాధునిక యంత్రాలను సమకూర్చి ఇక్కడి రైతులకు మేలు చేయాలని కోరారు. అదేవిధంగా పాల బిల్లులను పెంచాలని కోరినట్లు తెలిపారు.

## జక్కిడి శివ చరణ్ రెడ్డి గారికి ఘన స్వాగతం



**విశ్వంభర, హైదరాబాద్ :** యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో 2 లక్షల 16 వేల 115 ఓట్ల మెజారిటితో ఘన విజయం సాధించి రాష్ట్ర అధ్యక్షుడు గా ఎన్నికై, ఢిల్లీ నుండి హైదరాబాద్ కి విచ్చేసినటువంటి జక్కిడి శివ చరణ్ రెడ్డికి శంషాబాద్ రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. వందలాది కార్లతో శంషాబాద్ రాజీవ్ గాంధీ విమానాశ్రయం నుండి ఎల్బీనగర్ జక్కిడి శివ చరణ్ రెడ్డి కి నివాసం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఘన స్వాగతం పలికిన యువజన కాంగ్రెస్ , కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొంపముంచిన ఒక్క ఓటు

మళ్లీ రికౌంటింగ్ చేయాలని అభ్యర్థి ఆందోళన



**విశ్వంభర, పోచారం :** మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ లో ఉన్న సంస్కృతి టౌన్షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు రసవత్తంగా మారాయి. ప్రెసిడెంట్ గా పోటీ చేసిన అభ్యర్థి భరత్ పై హరిప్రసాద్ అనే అభ్యర్థి ఒక్క ఓటు తేడాతో గెలుపొందడంతో తన ప్రత్యర్థి భరత్ గెలుపొందిన అభ్యర్థి ప్రకటన చెల్లదని ఓట్ల లెక్కింపులలో అవకతవకలు జరిగాయని ఎలక్షన్ కమిషనర్ కు ఫిర్యాదు చేసినట్టు అదేవిధంగా లిఖిత పూర్వకంగా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలుపుతూ ఓట్ల లెక్కింపులో భరత్కు పోలైన ఓట్లు ఆరు ఓట్లు అధికారకంగా చెల్లుబాటయే ఓట్లను ఆ ఆరు ఓట్లు చెల్లు బాటుకు రావని, మరల తిరిగి ఓట్లు లెక్కింపు జరపాలని ఎలక్షన్ కమిషనర్ కు దరఖాస్తు ఇవ్వడంతో మరల ఓట్లు లెక్కింపు జరగడంతో హరిప్రసాద్ కు ఒక్క ఓటుతో విజయం సాధించినట్లు ప్రకటన చేసారు. ఆ ప్రకటన చెల్లదు మరల ఓట్ల లెక్కింపు జరిపించాలని 24 డిసెంబర్ 2024న ఎలక్షన్ కమిషనర్ నోటీసు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయినా ఎవరి మాట వినకుండా 26 డిసెంబర్ 2024న కమిషనర్లుగా ముగ్గురు కమిటీలు ఉండగా ఇద్దరు కమిషనర్లకు తెలియకుండా మరో కమిషనర్ సాయికుమార్ ప్రమాణ స్వీకారానికి అనుమతిస్తూ ఒక్క ఓటుతో గెలిచిన అభ్యర్థి హరిప్రసాద్ తో కలిపి ముగ్గురు అభ్యర్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం




**విశ్వంభర, తంగళ్ళపల్లి :** చీర్లవంచ గ్రామంలో ఎల్లారెడ్డిపేట్ అశ్విని హాస్పిటల్ వారి సౌజన్యంతో మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసారు. వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేసి అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి సిరిసిల్ల నియోజకవర్గం ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇక్కడ హెల్త్ సబ్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, గత పాలకులు చేసిన పాపానికి ఇక్కడ ఉన్న హెల్త్ సెంటర్ వేములవాడకు తరలించారనీ అన్నారు. ఉద్యమ సమయం నుండి చీర్లవంచ గ్రామానికి నాకు అవినాభావ సంబంధాలు ఉన్నాయని, గత బి ఆర్ ఎస్ పాలనలో చీర్లవంచ గ్రామం నిరాదరణకు గురైందని మిడ్ మానేరు నిర్మాణంలోని మీ త్యాగాలు వెలకట్ట లేనిదని గత ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకొని విలక్షణమైన తీర్పు ఇచ్చారని, ప్రజా ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రవీణ్ డాక్టర్ల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు చింతూరు భాస్కర్ గ్రామ శాఖ అధ్యక్షులు గంగు మహేష్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఆరేపల్లి బాలు పొన్నాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రెస్టారెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే మురళి నాయక్



**విశ్వంభర, మహబూబాబాద్ :** కేసముద్రం మండల కేంద్రంలో బోటి బాటి రెస్టారెంట్ ను, మహబూబాబాద్ శాసనసభ్యులు భూక్యా మురళి నాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు, మాజీ జడ్పీటీసీ బండారు వెంకన్న, అంబటి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారు దయాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రావుల మురళీ, మాజీ ఎంపీపీ కదిరే సురేందర్, ఎండీ అయిబ్ ఖాన్ పాల్గొన్నారు.

## నృపతుంగ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ బర్కత్పురా లోని నృపతుంగ పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1970- 80 మధ్య పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులంతా కలిసి అప్పటి మధురస్మృతులను మిత్రులందరు కలిసి గుర్తు చేసుకున్నారు. ఒకరిని ఒకరు అలింగణం చేసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యా బోధనలు చేసిన ఉపాధ్యాయులను ఆప్యాయంగా పలకరించి వారి నుండి ఆశీర్వాదం తీసుకున్నారు అనంతరం రూప తుంగ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సుందర్ రాజు కార్యదర్శి శ్రీధర్ ల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను గురు సత్కారాలతో ఘనంగా సన్మానం చేశారు. భూపాల్, ఉదయ్, రఘు, ఉడపాచార్, శ్రీధర్ పాల్గొన్నారు.

## డివిజన్ సమస్యల పరిష్కారం కోసం కృషి

– కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**విశ్వంభర, హయత్ నగర్:** బియన్ రెడ్డి నగర్ డివిజన్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. ఎన్ జి ఓ కాలనీలలో రూ .78 లక్షలతో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి కాలనీలో త్వరలోనే ఒకటొకటిగా ప్రతి అభివృద్ధి , సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శరత్ కుమార్, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, నికేతన్ రెడ్డి, వేణు, శ్రీకాంత్, ఉదయ్, వినయ్ , తదితరులు పాల్గొన్నారు.

# యువత కలలు సాకారం చేసుకోవాలి

**–కే ఎల్ ఆర్**

**విశ్వంభర, మహేశ్వరం :** యువత ఏదైనా సాధించాలంటే కలలు కనాలి, వాటిని సాకారం చేసుకునే దిశగా కష్టపడుతూ అడుగులు వేయాలని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం అనంతగిరి మహాత్మా జ్యోతి బాపూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో జరిగిన ఎయిర్ ఇండియా ప్రోగ్రాంలో పాల్గొన్నారు. బట్టీ మెథడ్ లో కాకుండా అవగాహన, అధ్యాయనం చేస్తూ ఒత్తిడి లేని చదువులు కొనసాగించాలని కేఎల్ఆర్ సూచించారు. అధ్యాపక బృందం సైతం మార్కుల కోసం కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి వారి అభ్యున్నతికి పాటుపడాలని కిచ్చెన్నగారు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కే ఎల్ ఆర్ ట్రస్టు ద్వారా ప్రభుత్వ వసతి గృహాల్లో




చదివే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా నైపుణ్య తరగతులను అందిస్తున్నారు.

# విప్లవ పార్టీల విలీన పోస్టర్ ఆవిష్కరణ

**విశ్వంభర, నెల్లికుదురు:** హైదరాబాద్ సుందరయ్య భవనంలో ఈనెల 28న జరిగే విప్లవ విలీన సభ గోడపత్రికలను సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన నెల్లికుదురు లో గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఇరుగు నాగన్న అధ్యక్షతన జరిగిన ప్రచార సభలో తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న మాట్లాడుతూ విడిపోయి ఉన్న విప్లవ పార్టీల ఐక్యత అవసరమన్నారు. విలీన సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిర్ర యాకన్న, నక్క యాకన్న,యుగంధర్, అనిల్,రమేష్,వీరన్న తదితరులు పాల్గొన్నారు.



# 'బుక్ ఫెయిర్' సందర్శించిన శ్రీనివాస్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి గురువారం ఉదయం బుక్ ఫెయి సందర్శించారు. పలు పుస్తక స్టాళ్లను సందర్శించారు. బుక్ ఫెయిర్ ఏర్పాట్లు బాగున్నాయని కితాబిచ్చారు. సందర్శకులకు కోసం అన్ని ఏర్పాట్లూ చేయడం బాగుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా జరిగే బుక్ ఫెయిర్ అన్ని రకాల పుస్తకాలకు కూడలి లాంటిదన్నారు. విద్యార్థులు, యువకులు, పెద్దలు, ప్రతి ఒక్కరు బుక్ ఫెయిర్ను సందర్శించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట అధ్యక్ష కార్యదర్శులు యాకూబ్, ఆర్ వాసు, వైస్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి, కోశాధికారి నారాయణ రెడ్డి, బొమ్మగాని కిరణ్, ప్రముఖ న్యాయవాది బొమ్మగాని ప్రభాకర్ ఉన్నారు.



# అంతటి బుగ్గమ్మ అకాల మృతికి ప్రగాఢ సంతాపం



**విశ్వంభర, రామన్నపేట:** బోగారం గ్రామంలో ఇటీవల అంతటి బుగ్గమ్మ అకాల మరణం చెందగా, ఆమె మృతికి చింతిస్తూ దశదిన కర్మ కార్యక్రమంలో బోగారం తాజా మాజీ సర్పంచ్ అంతటి పద్మా రమేష్ గౌడ్ పాల్గొని, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అను కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంధాలయ మాజీ చైర్మన్ జెల్లా మార్కండేయ, మాజీ ఎంపిటిసి మేడి రామలింగం, తెలంగాణ ఉద్యమకారుడు కునూరు శ్రీనివాస్ గౌడ్, కూనూరు ధనుంజయ గౌడ్, చెరుకు సత్తయ్య, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మేడి కృష్ణ, మేడి యాదయ్య, మేడి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# మోతె జగన్నాథం మృతి కళా రంగానికి తీరని లోటు

**విశ్వంభర, బషీర్ బాగ్ :** జనగామ జిల్లా నర్మెట్ట మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన చెక్క తీగల తోలు బొమ్మలాట మోతె జగన్నాథం మృతి కళా రంగానికి తీరని లోటు అని తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ అన్నారు. జగన్నాథం ఆకస్మిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'బొమ్మలోల్లు' అని ఆప్యాయంగా పిలుచుకునే మోతె జగన్నాథం, చెక్క తీగల తోలు బొమ్మలాట ద్వారా



శతాబ్దాల నాటి కథా సంప్రదాయాన్ని పరిరక్షించడానికి అంకితమైన కళాకారుల బృందానికి నాయకత్వం వహించాడు. 2006లో ఢిల్లీలోని నేషనల్ మాన్యుస్క్రిప్ట్ మిషన్ తో జగన్నాథం బృందంతో కలిసి పనిచేసిన విషయాన్ని వేదకుమార్ గుర్తు చేసుకున్నారు. జగన్నాథంకు పద్మశ్రీ దక్కేలా ప్రయత్నం జరుగుతున్న సంధర్భంలో ఆయన ఆకస్మిక మృతి తీవ్రంగా కలిచి వేసిందన్నారు.

## జొరావర్ సింగ్, ఫతే సింగ్‌లకు కిషన్ రెడ్డి నివాళులు



**విశ్వంభర, హైదరాబాద్:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వీర్ బాల్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి భారతీయ సాహస యోధులైన సాహిబ్‌జాదా జొరావర్ సింగ్, సాహిబ్‌జాదా ఫతే సింగ్ లకు నివాళులర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ 1500 ఏండ్ల క్రితం భారతీయత కోసం, ధర్మం కోసం పదవ సిక్కు గురువు శ్రీ గురు గోవింద్ సింగ్ కుమారులైన.. బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగ్ ప్రాణత్యాగాలకు వెనుకాడకుండా బలిదానమయ్యారని అన్నారు. డిసెంబర్ 26ను వీర్ బాల్ దివస్‌గా గుర్తించి వారి త్యాగానికి, ధైర్యానికి ఘన నివాళులు అర్పిస్తున్నామని, భారతీయ జనతా పార్టీ తరపున, తెలంగాణ ప్రజల తరపున ఆ వీరపుత్రులకు ఘన నివాళులర్పిస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. వారిద్దరు సిక్కుల పథానికి, ధర్మానికి అంకితమై తమ ప్రాణాలను అర్పించి చిన్న వయసులోనే అమరులైన వీరులని గుర్తు చేశారు. మన దేశంలో ప్రతి సంవత్సరం నవంబరు 14 న బాలల దినోత్సవం, అదేవిధంగా డిసెంబరు 26న వీర్ బాల్ దివస్ వేడుకలు జరుపుకుంటున్నాం అన్నారు. ప్రధానమంత్రి మోదీ వీర్ బాల్ దివస్‌ను యావత్ భారతదేశానికి స్ఫూర్తిదాయకంగా ఉండేలా పిలుపునిచ్చారన్నారు. డిసెంబరు 2022లో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వీర్ బాల్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. సాహిబ్‌జాదా జోరావర్ సింగ్, సాహిబ్‌జాదా ఫతే సింగ్ ల ధైర్యం, త్యాగాలకు నివాళి అర్పించడం జరిగిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

## టిఫిన్ సెంటర్ ప్రారంభం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం సాలార్ పూర్ గ్రామానికి చెందిన కనకాల రాకేష్ తలకొండపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన టిఫిన్ సెంటర్ ను లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కడ్తాల్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ ప్రారంభించారు. యువకులు స్వయం ఉపాధి కల్పించుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలి పంతు, మాజీ ఎంపీటీసీ ప్రియరమేష్, నాయకులు బాబా, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నివాళులు



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండల అధ్యక్షుడు డోకరి ప్రభాకర్ రెడ్డి అన్న డోకూరి నరేందర్ రెడ్డి మృతిచెందాడు. ఆమనగల్ మార్కెట్ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి,జలంధర్ రెడ్డి తదితరులు ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పిచారు.

**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ తండ్రి విశ్రాంత ప్రధానోపాధ్యులు జంగయ్య దశదిన కర్మ సందర్భంగా వారి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే లు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, ఉమ్మడి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పూలు వేసి నివాళులర్పించారు. వారితోపాటు షాదనగర్ మున్సిపల్ చైర్మెన్ నరేందర్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ లు దశరథ్ నాయక్, పత్యానాయక్, జడ్పీ కో ఆప్షన్ మూజీబూర్ రహేమాన్, సీనియర్ నాయకుడు దశరథ్ నాయక్ వివిధ మండలాల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- సిసి రోడ్డు, డ్రైనేజీకి శంకుస్థాపన



**విశ్వంభర, వర్ధన్నపేట:** నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నడుస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56 డివిజన్ లో స్మార్ట్ సిటీ 2 కోట్ల 20 లక్షల రూపాయల నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు జీడబ్ల్యుఎంసి కమిషనర్ అశ్విని తానిజీ వాకడేతో కలిసి శంకుస్థాపన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చేశారు. అనంతరం స్మార్ట్ సిటీ 2కోట్ల 20 రూపాయల వయ్యంతో నిర్మించిన జవహర్ నగర్ నూతనంగా బ్రిడ్జి ప్రారంభించిన ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంతన్న నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడేడ్ల మాదిరి సాగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు లు, ఆరోగ్య శ్రీ కార్డులు అందిచమని మళ్ళీ నేటి ఇందిరమ్మ ప్రభుత్వంలో త్వరలో అర్హులకు రేషన్ కార్డులను,డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డుల జారికీ ప్రభుత్వం సన్నద్ధం అవుతుందాన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మించడానికి సిద్ధంగా ఉందన్నారు. డిజిటల్ రేషన్, హెల్త్ కార్డుల ప్రక్రియకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఒక పట్టణం, ఒక గ్రామాన్ని ఎంచుకునే విషయాన్నీ గుర్తు చేశారు.. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, ఏఎంసీ డైరెక్టర్ కందుకూరి పూర్ణచందర్, జవహర్ నగర్ కాలనీ అధ్యక్షుడు సోమయ్య, మరియు డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోతె జగన్నాథం మృతి



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలోని జనగామ జిల్లా అమ్మాపురం మోతె జగన్నాథం ఆకస్మిక మృతి పట్ల తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. "బొమ్మలోల్లు" అని ఆప్యాయంగా పిలుచుకునే మోతె జగన్నాథం, చెక్క తీగల తోలుబొమ్మలాట ద్వారా శతాబ్దాల నాటి కథా సంప్రదాయాన్ని పరిరక్షించడానికి అంకితమైన కళాకారుల బృందానికి నాయకత్వం వహించాడు. వీరి ప్రదర్శనలు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు, ప్రహ్లాద, రామదాసు కథలకు ప్రాణం పోశాయి. ఈ బృందం యొక్క కళానైపుణ్యం తెలంగాణ ప్రాంతపు గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రస్తుతం తెలంగాణలోని వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఒకే మోతె కుటుంబానికి చెందిన రెండు బృందాలు మాత్రమే మిగిలాయి. జగన్నాథంతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వేదకుమార్ మణికొండ 2006లో ఢిల్లీలోని నేషనల్ మాన్యుస్క్రిప్ట్ మిషన్ తో జగన్నాథం బృందం తో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వీరంతా కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని 3 ప్రాంతాలలోని 11 జిల్లాల్లో పర్యటించారు. నేషనల్ మాన్యుస్క్రిప్ట్ మిషన్ అవేర్ నెస్ ప్రచారం జగన్నాథం బృందం తోలుబొమ్మలాట ప్రదర్శనలు విద్యా సంస్థలు మరియు ప్రజలలో సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ మరియు ప్రాముఖ్యతకు దోహదపడ్డాయి.వేదకుమార్ తో దేశంలో సాంస్కృతిక అవగాహనను పెంపొందించే జగన్నాథం చెక్క తీగల తోలుబొమ్మల బృందంతో అనేక వర్క్ షాప్ లు మరియు ప్రదర్శనలు కూడా నిర్వహించారు. దశాబ్దాలుగా హైదరాబాద్ లో జరిగిన అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శనలు ఇప్పించాము .ప్రముఖ చలన చిత్ర నిర్మాత అజిత్ నాగ్ చెక్క తీగల తోలుబొమ్మలాటకు వారి ప్రత్యేక సాంస్కృతిక విలువను వర్ణించే "బొమ్మలోల్లు" అనే డాక్యుమెంటరీ చిత్రంలో జగన్నాథం జీవితం మరియు కళా రంగానికి ఆయన సేవలు చక్కగా తెలియపరిచారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సిఫార్సులతో సహా వేదకుమార్ యొక్క నిరంతర ప్రయత్నాల ద్వారా, జగన్నాథం మరియు అతని బృందం భారతదేశంలోని 12 కి పైగా రాష్ట్రాలలో ప్రదర్శనలు ఇస్తూ జాతీయ వేదికలపై గుర్తింపు పొందారు. దురదృష్టవశాత్తూ, చెక్క బొమ్మలాట (చెక్క తీగల తోలుబొమ్మలాట) ఇప్పుడు అంతరించిపోయే దిశలో ఉంది, సామాజిక-ఆర్థిక సవాళ్ల కారణంగా యువతరం పరిమిత ఆసక్తిని చూపుతోంది.తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని, తెలంగాణ రాష్ట్రానికి ఆయన చేసిన సంప్రదాయ సాంస్కృతిక రూపాన్ని గుర్తించాలని, అంతరించిపోతున్న ఈ సంప్రదాయాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, ఈ కళను సజీవంగా ఉంచడంలో మిగిలిన కీలుబొమ్మల కుటుంబ కళాకారులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అంతరించిపోతున్న కళారూపాన్ని తిరిగి పూర్వ వైభవం తీసుకురావడానికి తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నాను అని తెలిపారు. జగన్నాథంకు పద్మశ్రీ దక్కేలా ప్రయత్నం జరుగుతున్న సంధర్భంలో ఆయన ఆకస్మిక మృతి తీవ్రంగా కలిచి వేసిందన్నారు. కళారంగానికి ఆయన మృతి వల్ల ఏర్పడిన నష్టం పట్ల వేదకుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.మోతె జగన్నాథం కుటుంబానికి వేదకుమార్ మణికొండ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గొప్ప కళాకారుడి మృతికి సంతాపం తెలిపాడు.

## ఘనంగా జాతీయ ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం వార్షికోత్సవం




**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** జాతీయ ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం 50వ వార్షికోత్సవ సందర్భంగా భద్రాచలంలో మొదటి రోజున జాతీయ సెమినార్ మాజీ ఎమ్మెల్యే పోదేం వీరయ్య , తెలంగాణ రాష్ట్ర అడవి అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సెమినారుకు చందా లింగయ్య దొర జాతీయ ఆదివాసి సంఘాల చైర్మన్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పోదేం.వీరయ్య మాట్లాడుతూ ఈ ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం 1974 సంవత్సరంలో స్థాపించారు. ఈ సంఘంలో వీరయ్య అను నేను ఈ సంఘంలో కూడా పనిచేస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అనేక ఆదివాసి అభివృద్ధి పనులతో పాటు వారి ఉనికి కోసం నేను ఎమ్మెల్యే అయ్యేంతవరకు కృషి చేసినాను ఈ సంఘ కార్యక్రమాలు ముందుకు తీసుకొని పోయి, ఆదివాసులకు అండగా నిలవాలని సూచించారు.

## సీసీ రోడ్డు వేయరా?



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మున్సిపాలిటీగా ఏర్పడి మొదటి పాలకవర్గ సమయం అయిదేళ్లు ముగుస్తున్న సందబావి నుండి నల్లాల బావి వరకు సిసి రోడ్డును వేయలేదు. ఆమనగల్లు పట్టణంలో అన్ని కాలనీలలో దాదాపు సిసి రోడ్లు వేశారు. కానీ రెండు వార్డులు కలిసి ఉండడం రోడ్డు మరియు అభివృద్ధి జరగడం లేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డు పట్టణంలో ఏ ముఖ్యమైన ఊరేగింపు జరిగిన ఈ రోడ్డులో వెళ్లాల్సిందే అంత ప్రాముఖ్యమైన రోడ్డును గత పాలకులు పట్టించుకోలేదు కనీసం మున్సిపాలిటీ ఏర్పాటైన తర్వాత అయినా రోడ్డు వేస్తారని భావించిన కాలనీవాసులకు మోక్షం లభించలేదు ఎవరికి వారే అన్న తీరుగా 12, 15,ఇద్దరు కౌన్సిలర్లు ఉన్న వాళ్ల పరిధిలో రోడ్లు వేయించుకున్నారే తప్పితే పట్టణానికి అవసరమైన రోడ్డును వదిలేశారు. మాడుగుల నుండి బాలికల పాఠశాల, సంక్షేమ వసతి గృహా%శీ%, పోస్ట్ ఆఫీస్, హైదరాబాదుకు షార్ట్ కట్ గా వెళ్లే వాహనాలు ఈ రహదారిలోనే వెళుతూ ఉంటాయి. నిత్యం వందల వాహనాలు ప్రయాణించే రోడ్డును ఇప్పటికైనా సీసీ వేసి ఎన్నో రోజుల కోరికను తీర్చాలని నిత్యం రహదారిలో వెళ్లే వాహనదారులు, కాలనీవాసులు కోరుతున్నారు.

## కరుణాపురం చర్చిలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రార్థనలు



**విశ్వంభర, కరుణాపురం :** ఘనపూర్ ధర్మసాగర్ మండలం, కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి వారి సతీమణి వినయరాణి పాల్గొన్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రేమ, సహనం, త్యాగం, దాతృత్వమనే సుగుణాల ఆచరణ ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించిన ఏసుక్రీస్తు జీవనం అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. భారత దేశం సర్వ మతాల సమ్మేళనమని తెలిపారు. అందరినీ ప్రేమించాలి, శాంతిమార్గంలో నడవాలి, పేవాభావంతో మెలగాలి' అనే క్రీస్తు బోధనలు సర్వమానవాళికీ ఆచరణీయమని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధికమంది ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ జరుపుకునే క్రిస్మస్ పండుగను క్రైస్తవులంతా సంతోషంగా చేసుకోవాలని కోరారు. ఆసియాలోనే అతిపెద్ద చర్చిగా పేరుపొందిన కరుణాపురం క్రీస్తు జ్యోతి ప్రార్థనా మందిరానికి ప్రపంచస్థాయి గుర్తింపు దక్కిందన్నారు. ఈ ప్రార్థన మందిరం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అని అన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యటక కేంద్రంగా అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు పాస్టర్ పాల్సన్ రాజ్, పాస్టర్లు, పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిపిఐ పార్టీ ఆవిర్భావ వేడుకలు









**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంత ఉత్స వ వేడుక గురువారం భద్రాచలంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ముందురోజే పట్టణాన్ని ఎర్రజెండాలు, తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. పట్టణ ప్రధాన కూడళ్ల వద్ద భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. గురువారం నాడు తొలిపొద్దు పొడుస్తుండగానే సూర్యని లేలేత కిరణాలు ఎర్రజెండాలను తాకుతుండటంతో శత వసంత శోభకు మరింత వన్నె తెచ్చింది. ఎర్రజెండాలు, తోరణాలతో పట్టణ వీధులు అరుణ వర్ణమయ్యాయి. స్థానిక సిపిఐ కార్యాలయం ఆవరణం, అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన దిమ్మెల వద్ద పార్టీ జెండాలను సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ ఎగురవేశారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద నూరేళ్ల త్యాగాలు, పోరాటాలకు గుర్తుగా కేక్ కట్ చేశారు. అనంతరం పట్టణంలో సుమారు 100 మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సిపిఐ ఆఫీస్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా బస్టాడ్, పోలీస్ స్టేన్ రోడ్, యూబి రోడ్, సూపర్ వజార్ సెంటర్, తాతగుడి సెంటర్, కాలేజీ సెంటర్ మీదుగా పాత మార్కెట్ రోడ్. ఐటిడిఏ రోడ్ మీదుగా సాగి పార్టీ కార్యాలయం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాయకులు కల్లూరి, రావులపల్లి మాట్లాడుతూ స్వాంతంత్ర్యానికి ముందు 1925వ సం.లో భారత కమ్యూనిస్టు పార్టీ కాన్పూర్లో ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ నాయుడు, మారెడ్డి శివాజీ, ఏవూరి వెంకటేశ్వరరావు, కొండబాబు, త్రిరమూర్తులు, మహేష్, సాయిలి గంగాధర్, శోభన్, రామారావు, వెంకన్న, శ్రీనివాస్, కిలిమి ఎల్లారెడ్డి, వేణు, రమేష్, కరుణ కుమారి, ఉమాదేవి, జ్యోతి, సుజాత, లక్ష్మి, యామిని, రామలక్ష్మి, రామచందర్, సురేష్, మైదిన్, కృష్ణ పాల్గొన్నారు.

### ఘనంగా సిపిఐ పార్టీ ఆవిర్భావ వేడుకలు

**విశ్వంభర, నాగోల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి 100 వసంతాల ఉత్సవాల్లో భాగంగా సరూర్నగర్ మండల సహాయ కార్యదర్శి కందుల సుధాకర్ అధ్యక్షతన మన్సూరాబాద్ డబల్ బెడ్ రూమ్ ఇళ్ల దగ్గర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ సరూర్నగర్ మండల కార్యదర్శి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ హాజరై జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి పూజారి అనిత, జి.శోభ, లింగస్వామి, శ్రీనివాస్, దుండిగల్ లక్ష్మి, కట్ట పార్వతమ్మ, యాదిరెడ్డి, విక్రం తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

**విశ్వంభర, హైదరాబాద్:** సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ హిమాయత్ నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్ ముందు సీపీఐ సీనియర్ నాయకులు ప్రేమ్ పావని అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు కమ్యూనిస్టు పార్టీ చేసిన త్యాగాలను, సాధించిన విజయాలను వివరిస్తూ పాటలు పాడారు. హిమాయత్ నగర్ నుండి సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంభవన్ వరకు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం లో మాజీ ఎంపీ అజీజ్ పాషా మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈటి నరసింహ ఎస్. బాలరాజు, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎన్ జ్యోతి, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు స్టాలిన్, యాదగిరి, వెంకటేశం, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

## ఎర్రోళ్ల శ్రీనివాస్ అక్రమ అరెస్ట్‌ను ఖండించిన దేవీప్రసాద్



**విశ్వంభర, హైదరాబాద్:** నోటీస్‌లు ఇవ్వకుండా ఉదయం 4 గంటలకు కుటుంభ సభ్యులను భయబ్రాంతులు గురి చేసే విధంగా వచ్చి అరెస్టు చేసే అవసరం ఏమొచ్చిందని బెవరేజెస్ కార్పొరేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ అన్నారు. ప్రభుత్వ హామీలపై ప్రశ్నిస్తే, బీఆర్ఎస్ నేతల మీద కేసులు, అరెస్టులు తెలంగాణలో సర్వసాధారణమై పోయిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ చేస్తామని హామీ ఇచ్చి ప్రశ్నించే గొంతులను నొక్కాలని కాంగ్రెస్ సర్కార్ చూస్తుందని అన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఎన్ని డ్రామాలు చేసినా ప్రజలు నమ్మరని, అక్రమ అరెస్టు లకు భయపడే ప్రసక్తే లేదని, ఎన్ని కేసులు పెట్టినా, జైళ్లకు పంపినా బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వం లో ప్రజల పక్షాన పోరాడుతామని, అక్రమ కేసులను న్యాయ పరంగా ఎదుర్కొంటామని దేవీప్రసాద్ తెలిపారు.

# ఆవోపా ఆధ్వర్యంలో 'వధూవరుల పరిచయ వేదిక'






**విశ్వంభర, హైదరాబాద్:** ఆవోపా హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏడవ వధూవరుల పరిచయ వేదిక హైటెక్స్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అమ్మాయిలు, అబ్బాయిలు సుమారు 110 మంది పాల్గొని పరస్పర పరిచయాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి దాదాపు 500 మంది హాజరయ్యారు. ఉదయం 9:30 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేదిక రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. ముఖ్య అతిథులుగా రమేష్ గెల్లి, తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత హాజరై తమ స్ఫూర్తిదాయకమైన మాటలతో కార్యక్రమాన్ని మరింత ప్రోత్సహించారు. అనంతరం రమేష్ గెల్లి మాట్లాడుతూ.. జీవిత భాగస్వామి ఎంపికలో ఓపిక, సర్దుకుపోయే గుణం ముఖ్యమని హితవు పలికారు. కల్వ సుజాత మాట్లాడుతూ.. భాగస్వామి ఎంపిక ఎంత కష్టమైందో వివరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో ఆవోపా నిర్వాహకుల శ్రమను ప్రశంసించారు. సభాధ్యక్షులు నమశివాయ స్వాగత ఉపన్యాసంలో ఈ సంవత్సరంలో కొత్తగా ఒక మధ్యస్థ కమిటీను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కమిటీకి ఈ పరిచయ వేదిక సలహాదారులు కౌటికె విఠల్ చైర్మన్‌గా నియమించగా.. ఐదుగురు సభ్యులు ఈ కమిటీలో ఉండనున్నారు. ఈ కమిటీ ద్వారా సంబంధాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడం తమ కర్తవ్యమని వివరించారు. ప్రధాన కార్యదర్శి మడుపల్లి రవి గుప్తా మాట్లాడుతూ.. గత ఎనిమిదేళ్ల అనుభవంతో భవిష్యత్తులో ప్రతి సంవత్సరం డిసెంబర్ 25 న ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు. ఉభయ రాష్ట్రాల వైశ్యులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. మధ్యస్థ కమిటీ చైర్మన్ కౌటికె విఠల్ తమ సభ్యులను పరిచయం చేస్తూ, వారి సేవల ద్వారా సంబంధాలను సమన్వయం చేసేందుకు అందరి సహకారం కోరారు. ఈ సేవకు అవకాశం కల్పించిన ఆవోపా మేనేజ్మెంట్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ఆర్థిక సహకారం అందించిన బి.వి. మోహన్ రావు, విశిష్ట జువెలరీస్ గందె సుధాకర్, ఎర్రం బాలకృష్ణ, బండారు సుబ్బారావు, తాడేపల్లి రాజశేఖర్ (చెన్నై), పబ్బతి వెంకట రవికుమార్‌కు సంస్థ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. కోశాధ్యక్షులు మాకం బద్రీనాథ్ వందన సమర్పణ ద్వారా కార్యక్రమానికి ముగింపు పలికారు.

## అంగన్‌వాడీల్లో ఆరోగ్యపంట



**విశ్వంభర, సూర్యాపేట :** అంగన్‌వాడీల్లో చదివే పిల్లలు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం సమకూరుస్తోంది. ఇప్పటికే చిన్నారులకు కోడిగుడ్డు, బాలామృతంతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఇకపై తాజా కూరగాయలతో ఆరోగ్యకరమైన భోజనం అందించడంపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా కేంద్రాల్లో గ్రీన్ గార్డెన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. తొలుత సొంత భవనాలున్న కేంద్రాల్లో కూరగాయలు పండించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమం గతంలో ఉన్నా.. కూరగాయలు పండించేందుకు శ్రద్ధ చూపకపోవడంతో ఫలితం లేకపోయింది. కాగా మరోసారి గ్రీన్‌గార్డెన్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,206 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 1,294 సొంత, 2912 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. తొలుత కూరగాయల సాగుకు అనుకూలంగా ఉన్న సొంత భవనాలను పరిశీలించి పండించనున్నారు. చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో ఎలాంటి క్రిమి సంహారక మందులు చల్లకుండా సేంద్రియ పద్ధతుల్లో వీటిని పండించేందుకు సన్నాహాలు చేపడుతున్నారు. దాదాపు అన్ని రకాల కూరగాయల మొక్కలను పెంచేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నిత్యం వీటిని పర్యవేక్షించనున్నారు. కూరగాయలు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు.

## పల్లెల అభివృద్ధికి పెద్దపీట



**విశ్వంభర, ఖమ్మం:** ప్రస్తుతం రాష్ట్రంలో బడుగు బలహీన వార్గల అభివృద్ధికి పాటుపడే ఇందిరమ్మ ప్రభుత్వం పాలన సాగిస్తుందని, ఆ వర్గాల వారు అధికంగా నివాసం ఉండే పల్లెల అభివృద్ధికి తమ ప్రభుత్వంలో పెద్దపీట వేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అశ్వారావుపేట మండలంలో కేశప్పగూడెం మద్దికొండ రహదారిలో ఎంపీజీఎస్వై నిధులు రూ.3.65 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ వంతెన నిర్మాణానికి ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలసి మంత్రి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నిక సమయంలో ఇచ్చిన ఆరు హామీలను ఏడాది పాలనా కాలంలోనే నెరవేర్చిన ఘనత కాంగ్రెసేనని అన్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన జనం మంత్రికి వినతి పత్రాలు అందించారు. గ్రామస్థులు ఇచ్చిన వినతితో వాగొడ్డుగూడెంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్ డబ్ల్యుఎస్ అధికారులను మంత్రి ఆదేశించారు. నారంవారిగూడెం పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని గ్రామస్థులు కొందరు మంత్రికి ఫిర్యాదు చేయడంతో అతన్ని వెంటనే ఇక్కడ నుంచి వేరే చోటకు బదిలీ చేయాలని డీఎల్పీవో రమణారావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో మువ్వా విజయబాబు, కాంగ్రెస్ జూపల్లి రమేశ్, వీరభద్రరావు, రాంబాబు, సత్యనారాయణ చౌదరి, మిండా హరి, ఆకుల శ్రీను, చెన్నారెడ్డి, జూపల్లి ప్రమోద్ పాల్గొన్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల క్రాస్ వద్ద మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా తప్పించుకునే ప్రయత్నంలో ఓ ట్రాక్టర్ లోడుతో వెళ్తూ బోల్తా.. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డ ముగ్గురు ట్రాక్టర్ డ్రైవర్ల పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కమలాపూర్ సీఐ హరికృష్ణ తెలిపారు. కమలాపూర్ మండలం గుండేడు గ్రామానికి చెందిన ఓ వివాహిత పట్ల మంగళవారం రాత్రి అసభ్యకరంగా ప్రవర్తించిన అదే గ్రామానికి చెందిన మేకల కనుకయ్య అనే వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

## గురుకుల బాలికలతో కలిసి యోగా చేసిన మంత్రి సీతక్క



**విశ్వంభర, కొత్తగూడ:** కొత్తగూడ మండలం గాంధీనగర్‌లో గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఉదయం మంత్రి సీతక్క బాలికలతో కలిసి యోగా, వ్యాయామం చేశారు. బుధవారం రాత్రి బాలికల పాఠశాలలో నిద్ర చేసి వారితో మాట్లాడి వారి సమస్యలను సీతక్క తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె సూచించారు. గురువారం తెల్లవారుజామున బాలికలతో కలిసి వ్యాయమం చేశారు.

## అయ్యప్పా.. అయ్యప్పా.. శరణుఘోషతో మార్మోగిన పాలమూరు



**విశ్వంభర, మహబూబ్ నగర్:** శరణుఘోషతో పాలమూరు పట్టణ వీధులు మార్మోగాయి. ఎక్కడ చూసిన నీవే అయ్యప్పా.. సర్వాంతర్యామి నీవే అయ్యప్పా.. అంటూ భక్తజనం గానంచేసింది. అయ్యప్ప సేవాసమాజం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో స్వామి వారి పల్లకి, 'కలశ' ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలలనుంచి అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. తూర్పుకమాన్ రామాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర లో శ్రీరాముడి భారీ ప్రతిమ ఆకట్టుకుంది. పట్టణ ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు. భక్తులు వినోద్‌కుమార్, పాతూరి నగేశ్ ఆధ్వర్యంలో ప్రసాద పంపిణీ చేపట్టారు. రామ్‌మందిర్ చౌరస్తాలో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అయ్యప్పస్వామికి పూజలు చేశారు. ఉదయం అయ్యప్పకొండపై రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించగా స్వాములు 338 యూనిట్ల రక్తదానం చేశారు. బుధవారం రాత్రి పద్మావతికాలనీలోని అయ్యప్ప దేవాలయంలో తిరుపతి వాస్తవ్యుడు శ్రీవెంకటేశ్వరశర్మ స్వామి పర్యవేక్షణలో ఏకశిల పదునెట్టంబడి మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. ఎంపీ డీకే.అరుణ, ఎమ్మెల్యే యెన్నం, ముడా, పుర ఛైర్మన్లు లక్ష్మణ్‌యాదవ్, ఆనంద్‌కుమార్‌గౌడ్, అయ్యప్ప సేవాసమాజం అధ్యక్షుడు భగవంతరావు, గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎనిమిది మంది ఎంపిక

**విశ్వంభర, హుజురాబాద్:** సీఎం కప్ హాకీ రాష్ట్రస్థాయి పోటీలకు హుజురాబాద్ నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు ఎంపికైనట్లు శిక్షకులు తిరునహరి శ్రీనివాస్ తెలిపారు. పోలు రాజకుమార్, ఎం.వినయ్, ఎస్.సాంబరాజు, ఎం.వినీత్, ఆదిత్య, ఎం.విపుల్, సాయి మిథున్ రెడ్డి, ఎం.పవన్ కుమార్ లు ఎంపికైన వారిలో ఉన్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఈ నెల 30 వ తేదీ వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ నెల 18 న కరీంనగర్ అంబేద్కర్ మైదానంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా జిల్లా స్థాయి పోటీలు జరగగా మంచి ప్రతిభను కనబరిచినట్లు చెప్పారు. సీనియర్ క్రీడాకారులు కొలిపాక శ్రీనివాస్, బండ శ్రీనివాస్, తోట రాజేంద్రప్రసాద్, ఉమామహేశ్వర్ తాళ్లపల్లి శ్రీనివాస్ తో పాటు పలువురు క్రీడాకారులను అభినందించారు.

## గ్రామ సభల ద్వారానే లబ్దిదారులను ఎంపిక చేయాలి

కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాలతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ రూ. 12 వేలు ఇవ్వాలని, లబ్దిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.100 రోజులు పని పొందిన కుటుంబాల లబ్దిదారులను కుదించేందుకు కుట్ర జరుగుతుందన్న అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. అలాగే గ్రామ సభల ద్వారానే లబ్దిదారులను ఎంపిక జరగాలని, ఒంటరి మహిళలు, వృద్ధుల పేరుతో పనికి రానివ్వకుండా అనేక చోట్ల అధికారులు అడ్డుకున్నారన్నారు. దీంతో అనేకమంది పేదలు పనికి దూరమయ్యారని, గుంట, రెండు గుంటల భూమి ఉన్న చిన్న రైతులకు కూడా వ్యవసాయ కూలీలుగా పరిగణించి ఆర్థిక భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన అందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపెల్లి మల్లారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, శోభన్, పద్మ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలు నిర్లక్ష్యానికి గురవుతున్నయ్

**– ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



**విశ్వంభర, హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌లో గురుకుల పాఠశాలలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బీబీ నగర్ డిగ్రీ కాలేజీలో నెలకొన్న పరిస్థితులపై గురువారం బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. గురుకులాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గురుకులాల్లో నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ నేతలు నిలదీస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో నే మొదటి సాంఘిక సంక్షేమ మహిళా ఆర్మీ కళాశాలగా గుర్తింపు ఉన్న బీబీ నగర్ డిగ్రీ కళాశాల రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో శిథిలమైపోయిందన్నారు. ఎంతో మంది మెరికల్లాంటి తెలంగాణ అమ్మాయిలు ఈ కాలేజికి వచ్చి శిక్షణ తీసుకొని ప్రభుత్వ పరీక్షలకు చివరి స్టేజ్ వరకు వెళ్లేవారన్నారు.ఇందులో మేజర్ ఉషా శర్మ, రాఖీ చౌహాన్ లాంటి ఉక్కులాంటి ఆఫీసర్ల కనుసన్నల్లో పెరిగారన్నారు. ఇప్పుడు ఇదే తెలంగాణ పేద బిడ్డలను రేవంత్ రెడ్డి మళ్లీ చీకట్లోకి నెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డింగ్ ఓనర్ ఖాళీ చేయమన్నాడన్న ఏకైక సాకుతో పేద బిడ్డలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా మరో చోటికి రాత్రికి రాత్రే తరలించారన్నారు. అక్కడ పనిచేసే మిలిటరీ సిబ్బందికి గత ఐదు నెలల నుంచి జీతాలు లేవని, భారత సైన్యం బహుమతిగా ఇచ్చిన యుద్ధ ట్యాంకులు తుప్పు పడుతున్నాయన్నారు.

# ఘనంగా వేం నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు తాళ్లూరి బాబు కుమారుడు గంగాధర్ అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి 62 వ జన్మదిన వేడుకలను తాళ్ళూరి గంగాధర్ ఆధ్వరంలో ఉయ్యాలవాడ ఎక్స్ రోడ్ తాళ్ళూరి బాబు స్ఫూర్తి వనంలో డోర్నకల్ మండలం తాళ్ళూరి గంగాధర్ అభిమానులు మధ్య కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్ళూరి గంగాధర్ మాట్లాడుతూ నిత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ ప్రతి కార్యకర్తను సోదర భావంతో సమన్వయ పరిచే సలహాదారులు నరేందర్రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాలూరి రామయ్య, ఏఎంసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అభి, రామారావు, నజీర్, ఇమ్ము శ్రీధర్, ఖాదర్ బాబా, ఎడమకంటి రవి, శ్రీధర్, అజ్మీర లెనిన్ కుమార్, జర్పులా బంటి, బానోత్ కొబాల్, ధభా శీను, అనంతుల ఉపేందర్, గుద్దేటి మల్లయ్య, గౌని ఐలయ్య, సుదర్శన్ రెడ్డి, తాళ్లూరు బాబు అభిమానులు పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### ఘనంగా వేం నరేందర్ రెడ్డి బర్త్ డే వేడుకలు

**విశ్వంభర, ఇనుగుర్తి:** మండల కేంద్రం ఇనుగుర్తిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డి బర్త్ డే వేడుక గురువారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీ ఎస్ ఎస్, ఏ ఎం సీ డైరెక్టర్లు కొట్టం మహేందర్ రెడ్డి, కొట్టం రామ్ రెడ్డి, నాయకులు సతీష్, ఒర్రె కవిత, గుజ్జునూరి బాబురావు, చిన్నాలకట్టయ్య, బైరు శ్రీనివాస్ గౌడ్, వల్లంల మురళి, గండు అజయ్, కయ్యడి యాకాంతం గౌడ్, కొట్టం చరణ్, మరద హరికృష్ణ, మామిడి జనార్ధన్, సలీం, సుధీర్, రాములు, నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం హైదరాబాదులోని ఆయన నివాసంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ నాయకులు నీల వెంకటేశం, రామకృష్ణ తదితరులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.







# ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్‌ను పంపించేందుకు ఆప్ ప్రయత్నాలు



ఢిల్లీః ప్రతిపక్ష ఇండియా కూటమిలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ముఖ్యంగా కూటమి భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్ , ఆప్ మధ్య వైరం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆమ్ ఆద్మీ పార్టీపై కాంగ్రెస్ ఆరోపణలతోఈ వైరం మరింత ముదురుతోంది. తాజాగా ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనిఆమ్ ఆద్మీ పార్టీ ఇస్తున్న ఎన్నికల హామీలపైకాంగ్రెస్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా ఆచరణ సాధ్యం కాని హామీలు అమలు చేస్తామని కేజ్రీవాల్ ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారంటూ హస్తం పార్టీ ఆరోపించింది.

ఈ నేపథ్యంలోనే ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు ఆప్ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు కూటమి నుంచి కాంగ్రెస్‌ను బయటకు పంపించేలా ఇతర పార్టీలను ఒప్పించేందుకు ఆప్ ప్రయత్నాలుమొదలు పెట్టినట్లు సమాచారం.కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి దించేయాలన్న ప్రధాన లక్ష్యంతో సుమారు 24 విపక్ష పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి బీటలు వారుతున్నది. ఇప్పటికే కూటమిలో ఉన్న విభేదాలు లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్ఫుటం కాగా, ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ పట్ల అందులోని పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. 'ఎన్నికల్లో విజయం సాధించి పెట్టలేని నాయకుడిని మనం ఇంకా ఎంతకాలం భరించాలి' అన్న ధోరణి ఆ పార్టీల్లో ఇటీవల అధికమైంది. రాహుల్ నాయకత్వంలో బీజేపీని ఎదుర్కోవడం కష్టమేనని, కాంగ్రెస్‌ను నమ్ముకుంటే తామూ మునగడం ఖాయమని ఆయా పార్టీల నేతలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రత్యామ్నాయంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నాయకత్వానికి జై కొడుతున్నారు. ఇప్పటికే సమాజ్‌వాదీ, ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్), శివసేన (యూబీటీ) సహా పలు మిత్రపక్ష పార్టీలు దీదీకి మద్దతు తెలిపిన విషయం



### ఇండియా కూటమిలో కాంగ్రెస్ వద్దు: సంజయ్ సింగ్

ఢిల్లీ: దేశరాజధాని దిల్లీ లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్‌ను దూరం పంపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది.ఢిల్లీ ఎన్నికల్లో భాజపాకు లబ్ధం చేకూరేందుకు కాంగ్రెస్ అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ బీజేపీ స్క్రిప్ట్‌ను చదివారు. ఆయన హద్దులు దాటి మా పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 24 గంటల్లో పార్టీ ఆయనపై చర్యలు తీసుకోవాలి. లేదంటే ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్‌ను తప్పించేందుకు ఇతర పార్టీలతో మాట్లాడతాం' అని ఆప్ నేత సంజయ్ సింగ్ పేర్కొన్నారు. దేశ రాజధాని అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమితో పొత్తు లేకుండా ఒంటరిగానే పోటీ చేస్తామని ఇప్పటికే కేజ్రీవాల్ ప్రకటించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆప్‌ని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. 2013లో 40 రోజుల పాటు ఆప్‌నకు మద్దతివ్వడం కాంగ్రెస్ చేసిన అతి పెద్ద తప్పిదమన్నారు. అందువల్లే దిల్లీలో కాంగ్రెస్ బలహీనపడిందని, తాము చేసిన ఆ పొరపాటును ఇప్పటికైనా సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. దేశ రాజధానిలో కాలుష్య నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమయ్యాయంటూ ఆప్, భాజపాలపై అజయ్ మాకెన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దీనిపై ఆప్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తాజా వ్యాఖ్యలు చేసింది.

## కోడిగుడ్లతో బీజేపీ ఎమ్మెల్యేపై దాడి



**బెంగళూరుః** కర్ణాటక మాజీ మంత్రి, రాజరాజేశ్వరి నగర్ ఎమ్మెల్యే, బీజేపీ నేత మునిరత్న నాయుడిపై కొందరూ గుర్తు తెలియని వ్యక్తులు కోడిగుడ్లతో దాడి చేశారు. అత్యాచారం కేసులో అరెస్ట్ అయ్యి మునిరత్న బెయిల్ మీద బయటకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే నేడు వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా.. లక్ష్మీనగర్‌లో నిర్వహించిన వేడుకలో మునిరత్న పాల్గొన్నారు. ఈ వేడుక అనంతరం మునిరత్నం తిరిగి వెళుతుండగా.. కొందరు వ్యక్తులు అతడిపై గుడ్లతో దాడి చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. మరోవైపు ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మునిరత్న స్పందిస్తూ.. కర్నాటక డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ అతని తమ్ముడు నన్ను చంపడానికి కుట్ర పన్నారని ఆరోపించాడు.

## విమానంపై ఆ రంధ్రాలేంటి..? అజర్ బైజన్ ఎయిర్‌లైన్స్ ప్రమాదంలో కుట్రకోణం!



**కజఖ్‌స్థాన్ః** అజర్ బైజన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన జె2-8243 విమానం కూలిపోవడంతో 38 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. ఈ క్రమంలో పలు కుట్రకోణాలు వినిపిస్తున్నాయి.అజర్ బైజన్‌లోని బాకు నగరం నుంచి రష్యాలోని చెచెన్ ప్రాంతానికి చెందిన గ్రోజ్నికి ప్రయాణిస్తుండగా కజఖ్‌స్థాన్‌లోని ఆక్టావ్‌లో ఈ విమానం కూలిపోయింది. పక్షి ఢీకొనడంతో పైలట్ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తుండగా ప్రమాదం జరిగిందని రష్యా ఏవియేషన్ పేర్కొంది. అయితే,ప్రమాద దృశ్యాలను చూసిన నెటిజన్లు మాత్రం పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో రష్యా-ఉక్రెయిన్ మధ్య దాడులు జరగడమే అందుకు కారణం. దానిని కీవ్‌కు చెందిన డ్రోన్‌గా భావించడం వల్లే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ కూల్చివేసినట్లు అనుమానిస్తున్నారు. ఉక్రెయిన్ డ్రోన్ దాడులను రష్యా తిప్పికొడుతున్న సమయంలోనే పైలట్ అప్రమత్తమై ఓ కాల్ పంపించారని కొన్ని మీడియా సంస్థల కథనాలు పేర్కొన్నాయి. అలాగే కొన్నిచిత్రాల్లో విమానం బాడీపై బుల్లెట్ ఆనవాళ్లు కనిపించినట్లు వెల్లడించాయి. అయితే, ఈ కథనాలపై కజఖ్‌స్థాన్ డిప్యూటీ ప్రధానిని మీడియా ప్రశ్నించగా కచ్చితమైన సమాధానం రాలేదు.ఇదిలాఉంటే.. నిన్న క్రిస్మస్ సమయంలో కూడా ఉక్రెయిన్‌పై రష్యాదాడుల ఉద్ధృతికొనసాగింది. ఆ దేశంలోని పలు విద్యుత్తు కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని 70కిపైగా క్షిపణులు, 100కు పైగా డ్రోన్లతో దాడులు చేసింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వయంగా ఈ వివరాలను వెల్లడించారు. రష్యా ప్రయోగించిన వాటిలో బాలిస్టిక్ మిసైల్స్ కూడా ఉన్నాయని తెలిపారు. తాము కనీసం 50 క్షిపణులను,పలు డ్రోన్లను కూల్చివేసినట్లు వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉద్దేశపూర్వకంగానే క్రిస్మస్ రోజున భీకర దాడులు జరిపించారని జెలెన్‌స్కీ ఆరోపించారు.

# భారత్‌పై చైనా 'వాటర్ బాంబ్'..

## సరిహద్దు వద్ద అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుకు శీకారం!

**బీజింగ్:** ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ డ్యామ్ నిర్మాణానికి చైనా ఆమోదం తెలిపింది. టిబెట్ తూర్పు అంచులో యార్లంగ్ జంగ్పో నది దిగువ భాగంలో ఈ జలాశయాన్ని నిర్మించనున్నట్లు అక్కడి మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 300బిలియన్ కిలోవాట్ అవర్స్ అని 2020లో ఆ దేశానికి చెందిన పవర్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనావేసింది. ప్రస్తుతం చైనాలో ఉన్న అతి పెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్ సామర్థ్యం 88.2 బిలియన్ కిలోవాట్ అవర్స్. అంటే కొత్త జలాశయం సామర్థ్యం దానికి మూడురెట్లు అధికం. టిబెట్‌లో జన్మించిన బ్రహ్మపుత్ర నది (దీనిని టిబెట్‌లో యార్లంగ్ జంగ్పోగా పిలుస్తారు) భారత్ గుండా బంగ్లాదేశ్‌లోకి ప్రవహిస్తోంది. మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు ఇది వరదాయిని. ఈ నదీ జలాల ప్రవాహాతీరు, పంపిణీ వంటి అంశాలపై సమాచార మార్పిడి కోసం భారత్-చైనా మధ్య ఒప్పందం ఉంది. వర్షాకాలంలో ఈ నదికి విపరీతంగా వరదలు వస్తుంటాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో అపారనష్టాన్ని కలగజేస్తుంటాయి. ఒప్పందం ప్రకారం మే 15వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు బ్రహ్మపుత్ర జలసంబంధ (హైడ్రలాజికల్) విషయాల్ని ఎగువనున్న చైనా దిగువనున్న భారత్‌తో పంచుకోవాల్సి ఉంది.ముఖ్యంగా వరదలొచ్చే అవకాశం ఉన్నప్పుడు నదీ మట్టాల్ని దిగువనున్న దేశాలకు తెలియజేయాలి. కానీ, ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తర్వాత చైనా ఆ సమాచారాన్ని భారత్‌కు సరిగా ఇవ్వడంలేదు. బ్రహ్మపుత్ర నదీ జలాలపై తొలిసారిగా 2002లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2008, 2013, 2018లో నాటి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేశారు. చివరి సారిగా కుదిరిన ఒప్పందం 2023తో ముగిసింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ తర్వాత కొత్త ఒప్పందం జరగలేదు. ఈ



తరుణంలో ప్రాజెక్టు నిర్మాణానికి చైనా సిద్ధమవడం కలవర పెడుతోంది. ఒక వేళ చైనా ప్రతిపాదిత ప్రాజెక్టును పూర్తి చేస్తే భారత్‌కు పక్కలో బల్లెంలా మారే ప్రమాదముంది. ఎండాకాలంలో బ్రహ్మపుత్ర నీటిని మళ్లించేందుకు బీజింగ్‌కు అవకాశం ఏర్పడుతుంది. దీంతో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రమాదముంది. మరోవైపు వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నదికి భారీగా వరద ఉంటుంది. ఒకేసారి పెద్దమొత్తంలో నీటిని విడుదల చేస్తే.. దిగువనున్న ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. ఈ ప్రాజెక్టు భారత్-చైనా సరిహద్దుకు కేవలం 30కి.మీ దూరంలోనే ఉంది. అందువల్ల రక్షణ పరంగానూ భారత్‌కు సమస్యలు పొంచి ఉన్నాయి. ఒక వేళ యుద్ధ పరిస్థితులు తలెత్తితే.. ప్రాజెక్టులో నిల్వ చేసిన నీటిని ఒకేసారి విడుదల చేసి.. చైనా 'వాటర్ బాంబ్'గా ఉపయోగించే ప్రమాదముంది.

## సిరియా మాజీ అధ్యక్షుడు అసద్ సతీమణికి ప్రాణాంతక వ్యాధి..!

**సిరియాః** తిరుగుబాటుదారులు ఆక్రమించడంతో అధికారం కోల్పోయిన సిరియా మాజీ అధ్యక్షుడు బషర్-అల్-అసద్ దేశాన్ని వీడి కుటుంబంతో సహా రష్యాలో ఆశ్రయం పొందుతున్నారు. తాజాగా ఆయన వ్యక్తిగత జీవితం గురించి మరో వార్త వెలుగులోకి వచ్చింది. అసద్ సతీమణి అస్మా ప్రాణాంతక క్యాన్సర్‌తో పోరాడుతున్నట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ కథనం వెల్లడించింది.గత కొంతకాలంగా లుకేమియాతో బాధపడుతున్న అస్మా ప్రస్తుతం ఐసోలేషన్‌లో ఉంటూ చికిత్స పొందుతున్నారని టెలిగ్రాఫ్ కథనం పేర్కొంది. ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిపింది. అస్మా ఈ వ్యాధి బారిన పడినట్లు మేలో నాటి సిరియా అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. కాగా.. 2019లో ఆమె రొమ్ము క్యాన్సర్‌ను జయించారు. ఏడాది పాటు చికిత్స తీసుకుని దాని నుంచి బయటపడ్డారు. ఆ తర్వాత కొన్నేళ్లకే ఆమె బ్లడ్ క్యాన్సర్ బారిన పడటం గమనార్హం.లండన్‌లోని సిరియన్ తల్లిదండ్రులకు జన్మించిన అస్మా అక్కడే పెరిగారు. కంప్యూటర్ సైన్స్‌ను అభ్యసించిన ఆమె కొంతకాలం పాటు ఓ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ రంగంలో పనిచేశారు. ఆ తర్వాత 2000 సంవత్సరంలో తన 25వ ఏట సిరియాకు వచ్చారు. అదే ఏడాది అసద్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. కాగా.. సిరియాలో తిరుగుబాటు కారణంగా డిసెంబరు 8న అసద్ కుటుంబంతో కలిసి రష్యాకు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. నాటి నుంచి ఆయన మాస్కోలోని ఓ రహస్య ప్రాంతంలో శరణార్థిగా ఉంటున్నారు.



అయితే, రష్యా అధికారులు మాత్రం ఆయనపై ఆంక్షలు విధించినట్లు వార్తలు వచ్చాయి. ఆయన ఆస్తులను ఫ్రీజ్ చేసి, మాస్కో వదలి వెళ్లొద్దని ఆదేశించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ ఆంక్షలతో విసిగిపోయిన అసద్ సతీమణి ఆయన నుంచి విడాకులు కోరుతున్నట్లు ప్రచారం జరిగింది.ఇందు కోసంఆమె కోర్టులో దరఖాస్తు చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, వీటిని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ఖండించింది.

## ఉత్తరాదిపై మంచు దుప్పటి.. హిమాచల్‌కు ఆరెంజ్ అలర్ట్.. 226 రోడ్లు మూసివేత



**శిమ్లాః** చలి తీవ్రతకు ఉత్తర భారతం గజగజ వణికిపోతోంది. జమ్ము కశ్మీర్ , హిమాచల్ ప్రదేశ్ , ఉత్తరాఖండ్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌ను మంచు దుప్పటి కప్పేసింది. ఎడతెరిపి లేకుండా మంచు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లపై అడుగుల మేర మంచు పేరుకుపోయింది. అప్రమత్తమైన అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా రహదారులను తాత్కాలికంగా మూసివేశారు.హిమాచల్ ప్రదేశ్‌లో మూడు జాతీయ రహదారులు సహా మొత్తం 226 రోడ్లను మూసివేశారు. ఇందులో సిమ్లాలో 123 రోడ్లు, లాహౌల్, స్పితిలో 36, కులులో 25 రోడ్లు ఉన్నాయి. 173 ట్రాన్స్‌ఫార్మర్‌లకు అంతరాయం ఏర్పడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో తీవ్రమైన చలి పరిస్థితుల కారణంగా భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దట్టమైన పొగమంచు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.ఇక ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో మంచు దట్టంగా కురుస్తోంది. దీంతో త్యుని-చక్రతా-ముస్సోరీ జాతీయ రహదారి, ధరణాధర్-కోటి కనసర్ రహదారి పూర్తిగా మంచుతో కప్పుకుపోయింది. జమ్ము కశ్మీర్‌లోని పలు ప్రదేశాలు చలికి అల్లాడిపోతున్నాయి. శ్రీనగర్‌లో మైనస్ 7 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ విభాగం తెలిపింది. రాబోయే రెండు రోజుల్లో ఇది మరో 2 నుంచి 3 డిగ్రీల వరకూ తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది.

## ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, యాప్ సేవల్లో అంతరాయం.. ప్రయాణికుల అసహనం





**ఢిల్లీః** రైల్వే టికెట్ల బుకింగ్ కోసం ఏర్పాటైన ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. మెయింటెనెన్స్ కారణంగా సర్వర్ డౌన్ అయ్యింది. ఫలితంగా గురువారం ఉదయం కొన్ని గంటల పాటు ఐఆర్‌సీటీసీ సేవలు నిలిచిపోయాయి.ఉదయం తత్కాల్ టికెట్స్ బుకింగ్ సమయంలో ఈ సమస్య తలెత్తింది. దీంతో యూజర్లు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెబ్‌సైట్, మొబైల్ యాప్ ఓపెన్ అవ్వట్లేదని పలువురు యూజర్లు ఉదయం నుంచి సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. తాము రైలు ప్రయాణ టికెట్లు బుక్ చేసుకోలేక పోతున్నామంటూ పేర్కొంటున్నారు.ఈ సమస్యపైఐఆర్‌సీటీసీ స్పందించింది. మెయింటెనెన్స్ కారణంగా ఈటికెట్ సేవలు అందుబాటులో లేవని తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. టికెట్ రద్దు చేసుకోవడానికి, ఫైల్ టీడీఆర్ కోసం కస్టమర్ కేర్ నెంబర్ 14646, 08044647999, 08035734999కు ఫోన్ చేయాలని, లేదంటే etickets@irctc.co.inకి మెయిల్ చేయాలని సూచించింది.కాగా, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవల్లో అంతరాయం కలగడం ఈ నెలలో ఇది రెండో సారి. రెండు వారాల క్రితం కూడా ఇదే సమస్య తలెత్తిన విషయం తెలిసిందే. అప్పుడు కూడా తత్కాల్ బుకింగ్ సమయంలోనే సమస్య తలెత్తింది. తరచూ ఇలాంటి సమస్యల కారణంగా ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

## నడిరోడ్డుపై మంటల్లో చిక్కుకున్న రూ.కోట్లు ఖరీదైన లాంబోర్గినీ కారు..

**ముంబయిః** మహారాష్ట్ర ముంబై లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కోస్టల్ రోడ్ లో కోట్ల ఖరీదైన లగ్జరీ లాంబోర్గినీ కారు మంటల్లో చిక్కుకుంది . బుధవారం రాత్రి 10:20 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది.ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని దాదాపు 45 నిమిషాలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియరాలేదు. గుజరాత్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఆరెంజ్ కలర్ కారు క్యాబిన్‌లో మంటలు వస్తున్న వీడియోను వ్యాపార దిగ్గజం గౌతమ్ సింఘానియా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ఈ కారు ఖరీదు రూ.9 కోట్లు అని సమాచారం.



## నువ్వు ప్రధాని ఎందుకు కాకూడదు.. కెనడా ఐస్ హాకీ క్రీడాకారుడిని అడిగిన ట్రంప్



వాషింగ్టన్ః కెనడా ప్రధాని ట్రూడోను వెక్కిరించే ఏ అవకాశాన్ని అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌వదలడంలేదు. తాజాగా మరోసారి ట్రోల్ చేశారు. ఆ దేశానికి చెందిన ఓ ఐస్ హాకీ క్రీడాకారుడిని ప్రధాని పదవికి పోటీ చేయమని సలహా ఇచ్చినట్లు ప్రకటించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. "ఐస్ హాకీలో 'ది గ్రేట్ వన్'గా పేరున్న వేన్ గ్రేట్జ్కీతో భేటీ అయ్యాను. ప్రధానిగా ఎందుకు పోటీ చేయొచ్చుకదా.. త్వరలోనే గవర్నర్ ఆఫ్ కెనడా అవ్వొచ్చని అతడిని అడిగాను. ప్రచారం అవసరం లేకుండానే గెలుస్తావని చెప్పాను. కానీ, అతడు ఆసక్తి చూపలేదు. ఆయన పోటీ చేయాలని కోరుతూ ఆ దేశ ప్రజలు ఉద్యమం చేయాలని భావిస్తున్నా. చూడటానికి చాలా సరదాగా ఉంటుంది" అని రాసుకొచ్చారు. ట్రంప్‌ను మార్-ఎ-లాగో ఎస్టేట్‌లో గ్రెట్జ్కీ కుటుంబసభ్యులతో సహా కలిశారు. తాను అధికారం చేపట్టాక కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకం విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించడం సంచలనం సృష్టించింది. దీంతో వెంటనే అమెరికాకు పయనమైన జస్టిన్ ట్రూడో.. ట్రంప్‌తో భేటీ అయ్యారు. సుంకాలు, వాణిజ్య లోటు, వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణా అంశాలపై వారు చర్చించారు. ఈ సమయంలోనే కెనడా 51వ రాష్ట్రంగా అమెరికాలో చేరాలని ట్రూడోకు చురకలంటించారు.

## 13వేల జీతగాడు.. కానీ గర్ల్‌ఫ్రెండ్‌కు 4బీహెచ్‌కే ఫ్లాట్ గిఫ్ట్ ఇచ్చాడు

ముంబై: మహారాష్ట్రకు చెందిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా చేస్తున్న హర్షల్ కుమార్ అనే వ్యక్తి భారీ మోసానికి పాల్పడ్డాడు. 13 వేల జీతం తీసుకునే ఆ వ్యక్తి.. అక్రమ రీతిలో 21 కోట్లు సంపాదించాడు. ఆ డబ్బుతో అతను లగ్జరీ కార్లు కొన్నాడు. ఇంకా తన గర్ల్‌ఫ్రెండ్‌కు 4బీహెచ్‌కే ఫ్లాట్‌ను గిఫ్ట్‌గా ఇచ్చాడు. వివరాల్లోకి వెళ్తే.. ఛత్రపతి సంభాజినగర్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కాంట్రాక్టు స్టాఫ్‌గా చేస్తున్న హర్షల్ కుమార్ అక్రమార్జనకు తెగించాడు. అతనితో పాటు ఉద్యోగం చేసే యశోదా శెట్టిని పోలీసులు అరెస్టు చేశారు. ఆమె భర్త బీకే జీవన్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. 23 ఏళ్ల హర్షల్ చాలా చాకచక్యంగా డబ్బును కాజేశాడు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు చెందిన ఓ పాత లెటర్‌హెడ్ ద్వారా బ్యాంకుకు ఈమెయిల్ చేశాడు. అకౌంట్‌తో లింకున్న ఈమెయిల్ అడ్రాసును మార్చాలని కోరాడు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ అకౌంట్‌తో సరిపోయే రీతిలో ఉన్న కొత్త ఈమెయిల్ అకౌంట్ ఓపెన్ చేశాడు. కేవలం ఒక్క అక్షరం తేడా ఆ అకౌంట్ తెరిచాడు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ బ్యాంక్ అకౌంట్‌తో లింకున్న ఆ అడ్రస్‌తో .. లావాదేవీలకు అవసరమైన ఓటీపీలను హర్షల్ ఓపెన్ చేసేవాడు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ సౌకర్యాన్ని యాక్టివేట్ చేశాడు. జూలై ఒకటి నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు బ్యాంకు ఖాతా నుంచి 21.6 కోట్లు కాజేసి వాటిని 13 బ్యాంకు అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేశాడు.ఆ డబ్బుతో అతను 1.2 కోట్లు ఖరీదైన బీఎండబ్ల్యూ కారు కొన్నాడు. 1.3 కోట్లతో మరో ఎస్‌యూవీ తీసుకున్నాడు. 32 లక్షల ఖరీదైన బీఎండబ్ల్యూ బైక్ కూడా కొన్నాడు. ఛత్రపతి సంభాజినగర్ విమానాశ్రయం వద్ద ఉన్న విలాసవంతమైన 4 బీహెచ్‌కే ఫ్లాట్‌ను గర్ల్‌ఫ్రెండ్‌కు గిఫ్ట్‌గా ఇచ్చినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. ఈ కేసులో మరికొంత మంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. డబ్బు లావాదేవీలకు చెందిన ఇతర అకౌంట్లను పరిశీలిస్తున్నారు. లగ్జరీ కార్లను ఇప్పటికే సీజ్ చేశారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ అకౌంట్లో అక్రమాలు జరుగుతున్నట్లు ఓ అధికారి గుర్తించి ఫిర్యాదు ఇవ్వడంతో హర్షల్ బాగోతం బయటకు వచ్చింది.ప్రధాన నిందితుడు హర్షల్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. మరో ఇద్దర్ని ఇప్పటికే అరెస్టు చేశారు. కొన్ని బంగారు ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

# తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న పీవీ సింధు దంపతులు

**విశ్వంభర, తిరుపతి:** భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు తిరుపతిలోని తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇటీవలే సింధు వివాహం హైదరాబాదకు చెందిన వెంకట దత్త సాయితో ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెళ్లి తర్వాత కొత్త దపంతులు అమ్మవారి ఆశీస్సులకోసం తిరుమతి వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి సింధు-దత్త సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని.. పెళ్లి తర్వాత అమ్మ ఆశీస్సుల కోసం వచ్చినట్లు సింధు తెలిపారు. కాగా, పీవీ సింధు - వెంకట దత్తసాయి వివాహం ఈనెల 22న ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని ఓసరస్సులో21ఎకరాల్లో విస్తరించినఒక దీవిలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ జంట ఒక్కటైంది. ఇక పెళ్లికి సంబంధించిన ఫొటోలను కూడా సింధు సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ కూడా జరిగింది. పెళ్లి, రిసెప్షన్‌కు సంబంధించిన ఫొటో లు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.



## పూర్తి పరిష్కారానికి 'సోఫా' చేరాల్సిందే..! సీఎం రేవంత్‌తో సినీ ప్రముఖుల భేటీ వేళ అంబటి రాంబాబు ఆసక్తికర ట్వీట్



**విశ్వంభర, అమరావతి :** సీఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ సినీ ప్రముఖులు గురువారం భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ భేటీ సమయంలో వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు సంచలనంగా మారింది. 'పూర్తి పరిష్కారానికి 'సోఫా' చేరాల్సిందే..!' అంటూ ఆయన పెట్టిన పోస్టు వైరల్ అవుతోంది.పుష్ప-2 మూవీలో 'సోఫా' సీన్లు ఉంటాయన్న విషయం తెలిసిందే. తనకు వ్యతిరేకంగా ఉన్న వాళ్లను కొనేందుకు, అనుకూలంగా పనిచేసేవాళ్లకు పుష్పరాజ్ 'సోఫా' పంపిస్తుంటారు. అందులో పెద్ద మొత్తంలో డబ్బు ఉంచి లంచంగా ఇస్తుంటారు. ఇదే అంశాన్ని అంబటి రాంబాబు ప్రస్తావిస్తూ.. 'సోఫా' పంపితేనే సినీ ఇండస్ట్రీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందంటూ వ్యాఖ్యానించారు. ఈ ట్వీట్ చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. 'పుష్ప వివాదానికి.. పుష్పరాజ్ తరహాలోనే పరిష్కారమా..?' అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

## ట్రాఫిక్ పెండింగ్ చలానాలపై రాయితీ.. స్పష్టత ఇచ్చిన అధికారులు




విశ్వంభర, హైదరాబాద్: ట్రాఫిక్ పెండింగ్ చలానాలపై ప్రభుత్వం మరోసారి రాయితీ ఇచ్చిందని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోఉన్నతాధికారులుస్పందిం చారు. చలానాలపై రాయితీ వార్తలను ట్రాఫిక్ పోలీసులు ఖండించారు. పెండింగ్ ట్రాఫిక్ చలానాలపై ఎలాంటి రాయితీ లేదని వెలడించారు. తప్పుడు ప్రచారం నమ్మొద్దని ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అటువంటి విధానం అమల్లోకి వస్తే ముందుగానే ప్రకటిస్తామన్నారు. తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. %వఎష్టుశ్రీశ్రీఖఅ్.ంజూశీశ్రీఅఎవ.స్త్రశీజ. ఱఅ% వెబ్‌సైట్‌లోని సమాచారాన్ని మాత్రమే నమ్మాలని వాహనదారులకు సూచించారు. ఎవరికైనా అనుమానాలుంటే హెల్ప్‌లైన్ నెంబర్లు 040 27852772, 27852721 కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని విశ్వప్రసాద్ తెలిపారు.

## గ్రూప్-1 పరీక్షపై అభ్యర్థుల పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

**విశ్వంభర, హైదరాబాద్ :** టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షపై అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లతో పాటు పలు అంశాలపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్లు తేలేంత వరకు గ్రూప్-1 ఫలితాలు ప్రకటించొద్దని కోర్టుకు అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తూ పలు పిటిషన్లు దాఖలు చేశారు. ఫలితాలు నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన కోర్టు.. ఫలితాలు నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది మార్చి నాటికి గ్రూప్-1 ఫలితాలు ప్రకటిస్తామని ఇటీవలే టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం ప్రకటించారు.

# ప్రజల హక్కుల కోసం నిరంతర పోరాటం: సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి

హైదరాబాద్: మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాల పునాదులపై సీపీఐ ఆవిర్భవించిందని సీపీఐ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. పార్టీ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ ప్రజల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు చేస్తోందని చెప్పారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు ఇంకా అమలు కావడం లేదని తెలిపారు. భూములు, కార్మికుల హక్కులు సీపీఐ పోరాటం వల్లే వచ్చాయని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికే ప్రమాదం వచ్చిపడిందని విమర్శించారు.



**మహిళలు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయి: అజీజ్ పాషా**

దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులు పండగ చేసుకుంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా అన్నారు. కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించి నేటికీ వందేళ్లు అవుతోందని చెప్పారు. భారతదేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీది ప్రముఖ పాత్ర అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించినట్లు వివరించారు. రాజ్యసభ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ భాజపా కార్యకర్తల్లా తయారయ్యారని విమర్శించారు. దేశంలో మహిళలు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని మండిపడ్డారు. ఏడాది పాటు పార్టీ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తామని.. ముగింపు కార్యక్రమాన్ని ఖమ్మంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# సంధ్య థియేటర్ ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోంది: హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్:** సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను గురువారం భారాస నేతలు పరామర్శించారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వివేకానంద, బండారు లక్ష్మారెడ్డి, సీనియర్ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నవీన్ రావు తదితరులు ఆసుపత్రికి చేరుకుని బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. "శ్రీతేజ్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు కిమ్స్ డాక్టర్లు చెప్పారు. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌కు మనోధైర్యం ఇమ్మని కేసీఆర్ ఆదేశించారు. మృతిచెందిన రేవతి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాం. సినిమా వాళ్లను భయపెట్టి సీఎం మంచి చేసుకోకూడదు. సంధ్య థియేటర్ ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోంది. గురుకులాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను సీఎం పరామర్శించిన సందర్భాలు లేవు. రాష్ట్రంలో ఓ సర్పంచి ఆత్మహత్య చేసుకుంటే.. అందుకు కారణమైన సీఎం తమ్ముడిని ఎందుకు అరెస్టు చేయలేదు? చట్టం అందరికీ సమానమన్న సీఎం.. వాళ్ల తమ్ముడిపై చర్యలు ఎందుకు తీసుకోలేదు" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.శ్రీతేజ్‌ను పరామర్శించిన వారిలో కేపీ వివేకానంద, బండారు లక్ష్మారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్, నవీన్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.




## అక్రమ క్వారీల నిర్వహణ కట్టడికి జాయింట్ ఆపరేషన్

**విశ్వంభర, సబ్బవరం:** అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం లోని గంగవరం విధుల నరవ, ఎరుకనాయుడుపాలెం, గాలి భీమవరం ఎల్లుప్పి గ్రామాల్లో అక్రమంగా జరుగుతున్న క్వారీలను అరికట్టేందుకు మైన్స్ అధికారులు పోలీసులు రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు చేసేందుకు నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో మెటీరియల్ గ్రావెల్ మట్టి తవ్వకాలను అరికట్టాలని వారు భావించారు ఈ మేరకు గురువారం సబ్బవరం తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దారు బి. చిన్నికృష్ణ సీఐ పిన్నింటి రమణ మైన్స్ డిపార్మెంట్ నుంచి రాయలేటి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సబ్బవరం మండలంలో ఎరుకునాయుడుపాలెం లో కేవలం రెండు క్వారీలకు మాత్రమే గుర్తింపు ఉందని వారు తెలిపారు మిగిలిన గ్రామాల్లో వారి గుర్తింపు గానీ అనుమతులు గాని లేదని వారు తెలిపారు ఎవరైనా అక్రమంగా క్వారీలు నిర్వహించినట్లయితే వారిపై సివిల్ క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు హెచ్చరించారు.

## వంగవీటి రాధా విగ్రహం, బస్ షెల్టర్ ప్రారంభం



విశ్వంభర, చినగంజాం: బాపట్ల , చినగంజాం మండలం, సోపిరాల సెంటర్‌లలో బస్ షెల్టర్, వంగవీటి రంగా 10 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరించారు. వంగవీటి రాధా కృష్ణ, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంశివరావు, పలువురు రాష్ట కాపు సంఘ నాయకులు దాసరి రాము, గాళ్ళ సుబ్రహ్మణ్యం, పొగడ దండ రవికుమార్, అమంచి స్వాములు , గొర్రి పాటి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

## అహోబిలంలో ఘనంగా స్వాతి వేడుకలు

**విశ్వంభర, ఆళ్లగడ్డ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో గురువారం స్వాతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రం స్వాతి కావడంతో తెల్లవారుజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య ఆరాధనలు చేశారు. ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి, సుదర్శన మూర్తిని అలంకరించి ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచారు. స్వామి అమ్మవార్లకు ఎదురుగా హోమగుండం ఏర్పాటు చేసి స్వాతి సుదర్శన హోమం నిర్వహించారు. హోమం నుంచి వెలువడిన కాటుకను భక్తులు స్వీకరించి స్వామిని ఆరాధించారు. అనంతరం అర్చకులు స్వామికి మహా మంగళహారతి అందించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

## అప్పన్న స్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

**విశ్వంభర, సింహాచలం:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి మండల గురువారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆమెకు అధికారులు, అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారిని దర్శించుకొని పూజల పాల్గొన్నారు. పండితులు న్యాయమూర్తిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఏఈఓ ఆనంద్ కుమార్ స్వామి వారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు

## ఘనంగా సీపీఐ జెండా ఆవిష్కరణ

**విశ్వంభర, నందిగామ:** ప్రజా పోరుబాటలో ప్రజా సేవలో సీపీఐ తన వంతు పోరాటాలు చేస్తూనే ఉంటుందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు అన్నారు. గురువారం స్థానిక రైతు పేట సి.ఎస్.ఆర్ భవన్ సీపీఐ కార్యాలయం వద్ద శత వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. సీనియర్ నాయకులు పొన్నెడి నాగ భూషణం పతాక ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి చుం దూరు వెంకట సుబ్బారావు మాట్లాడుతూ.. బ్రిటీ ష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం మహోజ్వల పోరా టాల కేతనంగా, కార్మికవర్గ సైద్ధాంతిక శక్తిగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు.

## చెత్తకుండీలో ఆడ శిశువును పడేసిన గుర్తు తెలియని వ్యక్తులు

**విశ్వంభర, నందిగామ:** కంచికచర్లలో రాజ్యలక్ష్మి గ్యాస్ కంపెనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆడ శిశువును చెత్తకుండీలో వదిలి వెళ్లారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచికచర్ల రాజ్యలక్ష్మి గ్యాస్ కంపెనీ సమీపంలో చెత్తకుండీలో ఓ ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. పాప కేకలు వినిపించడంతో స్థానికులు గమనించారు. ఒంటిపై చీమలు, పురుగులు పట్టి ఉన్న ఆ శిశువును ప్రాథమిక చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పాప తక్కువ బరువుతో జన్మించిందని వైద్యులు తెలిపారు. ఐసిడిఎస్ అధికారులు గుర్తుతెలియని మహిళ ప్రసవించి పాపను వదిలేసి వెళ్లినట్లు కంచికచర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దీనిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పాపకు మెరుగైన వైద్య సేవల కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఘనంగా సీపీఐ శత జయంతి ఉత్సవాలు




**విశ్వంభర, విశాఖ:** భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాలు ప్రారంభం గురువారం విశాఖ వుడా పార్క్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహం నుంచి నోవాటెల్ హోటల్ జంక్షన్ వరకు ఎర్ర కవాతు చేశారు. వంద మీటర్ల జెండాతో ర్యాలీ నిర్వహించారు.

## జగన్ ప్రజాదర్బార్ నిర్వహించడం హాస్యాస్పదం: ఎమ్మెల్యే యార్లగడ్డ



విశ్వంభర, విజయవాడ: ముఖ్యమంత్రి చంద్రబాబును ఎదుర్కొనే ధైర్యం లేకనే జగన్ అసెంబ్లీకి రావడం లేదని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. విజయవాడ రామవరప్పాడులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ.. జగన్‌పై విమర్శలు గుప్పించారు. పులివెందుల పర్యటనలో భాగంగా జగన్ ప్రజాదర్బార్ నిర్వహించడం హాస్యాస్ప దంగా ఉందన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను జగన్ సొంత నిధులతో పరిష్కరిస్తారా? అని ప్రశ్నించారు.అసెంబ్లీ సమావేశాలకు రాకుండానే మైక్ ఇవ్వడం లేదంటూ అసత్యాలు చెబుతున్నారన్నారు. జగన్‌కు మైక్ ఇవ్వరేమోనన్న ఫోబియా పట్టుకుందని ఎద్దేవా చేశారు. శాసనసభకు రాకపోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే అవుతుందన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారన్నారని, 11 మంది శాసనసభ్యులు ఉంటే ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వైకాపాకు ప్రతిపక్ష హోదా ప్రజలే ఇవ్వలేదని యార్లగడ్డ వ్యాఖ్యానించారు.

## పులివెందులలో జగన్ పర్యటన .. కార్యకర్తల మధ్య తోపులాట



**విశ్వంభర, పులివెందుల:** వైసీపీ అధినేత జగన్ కడప జిల్లా పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ జిల్లాల నుంచి పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. తోపులాట జరగడంతో కార్యకర్తలను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఈ ఘటనలో కార్యాలయం కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

## అల్పపీడనం ప్రభావం.. గంటకు 65 కి.మీ. వేగంతో గాలులు: విశాఖ వాతావరణ కేంద్రం



విశాఖ: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం.. బలహీనపడి అల్పపీడనంగా మారిందని విశాఖ వాతావరణ శాఖ అధికారి సుధావల్లి తెలిపారు. దీని ప్రభావంతో 1.5 కి.మీ. మేర ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు పేర్కొన్నారు. అల్పపీడన ప్రభావంతో తీరం వెంబడి గంటకు 65 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని పోర్టుల వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. వచ్చే 24 గంటలు నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని పేర్కొన్నారు. రానున్న రెండ్రోజులు రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## విద్యుత్ భారం మోపాలని ఈఆర్సీకి సిఫార్సు చేసింది జగన్ కాదా?: మంత్రి గొట్టిపాటి



విశ్వంభర, అమరావతి: వైసీపీ పెంచిన విద్యుత్ ఛార్జీలకు వాళ్లే ధర్నాకు పిలుపునివ్వడం హాస్యాస్పదమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ప్రపంచంలో ఈ తరహా వింత పోకడ ఎక్కడా చూసి ఉండమని ఎద్దేవా చేశారు. జగన్ ఇంటి ముందు ధర్నా చేయాలని.. కలెక్టరేట్లలో కాదని చెప్పారు. "ప్రజలపై విద్యుత్ భారం మోపాలని ఈఆర్సీకి సిఫార్సు చేసింది జగన్ కాదా? గతంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రానికి మిగులు విద్యుత్ ఇచ్చింది. విద్యుత్ రంగ వ్యవస్థలను జగన్ (%ూ జీుస్త్రుఅ%) ఎలా నాశనం చేశారో అందరికీ తెలుసు. అనుయాయులకు దోచిపెట్టేందుకు అధిక ధరలతో కొనుగోళ్లు చేశారు. రాష్ట్రాన్ని రివర్స్ పాలనతో అట్టడుగు స్థాయికి తీసుకెళ్లారు" అని గొట్టిపాటి రవికుమార్ చెప్పారు.

## జనవరి 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**విశ్వంభర, తిరుపతి:** తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న చెప్పారు.



**8 నుంచి ఆఫ్‌లైన్ టికెట్లు..**

శ్రీవారి వైకుంఠద్వార దర్శన టికెట్లకు భారీ డిమాండ్ ఉన్నది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో విడుదల చేసిన1.40 లక్షల టికెట్లు అయిపోగా.. ఆఫ్‌లైన్ టికెట్లకు పోటీనెలకొన్నది. ఈటికెట్లను జనవరి8నుంచి విడుదలచేసేలాటీటీడీ ఏర్పాట్లుచేస్తున్నది.

# తొలి రోజు చెలరేగిన ఆసీస్ బ్యాటర్లు

## టాప్ నలుగురు హాఫ్ సెంచరీలు.. ఆసీస్ స్కోరు 311/6

**మెల్‌బోర్న్‌:** బాక్సింగ్ డే టెస్టులో ఆసీస్ బ్యాటర్లు చెలరేగారు. బ్యాటింగ్ వరుసలోని టాప్ 4 ఆటగాళ్లు హాఫ్ సెంచరీలు సాధించారు. తొలి రోజు ఆట ముగిసేసమయానికి ఆస్ట్రేలియా 86 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 311 పరుగులు చేసింది. క్రీజ్‌లో స్టీవ్ స్మిత్ (68*), పాట్ కమిన్స్ (8*) ఉన్నారు. అంతకుముందు ఓపెనర్లు సామ్ కాన్‌స్టాస్ (60), ఉస్మాన్ ఖవాజా (57)తోపాటు మార్నస్ లబుషేన్ (57) అర్ధశతకాలు చేశారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 3.. ఆకాశ్ దీప్, సుందర్, జడేజా ఒక్కో వికెట్ పడగొట్టారు.



**తొలి మూడు వికెట్లకు 50+ చొప్పన భాగస్వామ్యాలు..**

మెల్‌బోర్న్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో ఆసీస్ టాస్ నెగ్గగానే అటువైపే మొగ్గు చూపింది. అందుకు తగినట్టుగానే ఆసీస్ ఓపెనర్లు శుభారంభం ఇచ్చారు. మరీ ముఖ్యంగా సామ్ కాన్‌స్టాస్ దూకుడు చూపాడు. మొదటి మూడు ఓవర్లలో ఆచితూచి ఆడిన అతడు.. బుమ్రాను టార్గెట్ చేస్తూ షాట్లు కొట్టాడు. ఉస్మాన్ ఖవాజాతో కలిసి తొలి వికెట్‌కు 89 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో అరంగేట్రం టెస్టుతోపాటు పిన్నవయస్సులోనే హాఫ్ సెంచరీ చేసిన రెండో ఆసీస్ బ్యాటర్‌గా నిలిచాడు. సామ్ ఔటైన తర్వాత బ్యాటింగ్‌కు దిగిన మార్నస్ లబుషేన్ (72)తో కలిసి ఉస్మాన్ ఖవాజా ఇన్నింగ్స్‌ను నడిపించాడు. రెండో వికెట్‌కు 65 పరుగులు జోడించాడు. తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాక ఖవాజా పెవిలియన్‌కు చేరాడు. ఫామ్‌తో ఇబ్బంది పడుతోన్న స్టీవ్ స్మిత్‌తో కలిసి లబుషేన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మూడో వికెట్‌కు 83 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు.

**బుమ్రానే మళ్లీ..**

టాప్ 4 బ్యాటర్లు దూకుడుగా ఆడటంతో భారత బ్యాటర్లు ఒకదశలో డీలా పడ్డారు. ఆరంభంలో బుమ్రా పెద్దగా ప్రభావం చూపించలేదు. కానీ, బంతి పాతబడిన కొద్దీ ప్రమాదకరంగా మారాడు. కీలకమైన ఖవాజా, ట్రావిస్ హెడ్ (0), మిచెల్ మార్ష్ (4)ను పెవిలియన్‌కు పంపాడు. కాస్త దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించిన అలెక్స్ కేరీ (31)ను ఆకాశ్ దీప్ ఔట్ చేశాడు. జడేజా బౌలింగ్‌లో కాన్‌స్టాస్, సుందర్ బౌలింగ్‌లో లబుషేన్ పెవిలియన్‌కు చేరారు.

**మరికొన్ని విశేషాలు..**

2017లో పాకిస్థాన్‌తో టెస్టులో తొలి మూడు వికెట్లకు 50+ భాగస్వామ్యాలను నమోదు చేసిన ఆసీస్ బ్యాటర్లు. ఇప్పుడు మరోసారి భారత్‌పై ఆ ఫీట్ సాధించారు.ఖవాజాను ఈ సిరీస్‌లో ఆరు ఇన్నింగ్స్‌ల్లో ఐదు సార్లు బుమ్రా ఔట్ చేశాడు. బుమ్రా బౌలింగ్‌లో ఖవాజా 87 బంతులు ఎదుర్కొని 24 పరుగులు మాత్రమే చేశాడు. అయితే, ఈ సిరీస్‌లో తొలిసారి హాఫ్ సెంచరీ సాధించడం గమనార్హం. బాక్సింగ్ డే మొదటి రోజు తొలి సెషన్‌లో 112/1 పరుగులు చేసిన ఆసీస్. గతంలో భారత్‌పైనే (2007లో) 111/0 స్కోరు చేసింది. బుమ్రా బౌలింగ్‌లో దూకుడుగా ఆడిన ఏకైక బ్యాటర్ సామ్ కాన్‌స్టాస్. 33 బంతుల్లో 34 పరుగులు రాబట్టాడు. గతంలో అలిస్టర్ కుక్ (40 బంతుల్లో 25 పరుగులు) సాధించాడు. టెస్టుల్లో దాదాపు 4,484 బంతుల తర్వాత బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ వచ్చింది. అదీనూ కాన్‌స్టాస్ రెండు సిక్స్‌లు కొట్టిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. జోస్ బట్లర్ (2018) మాత్రమే ఈ ఘనత నమోదు చేశాడు. ఆసీస్ తరఫున అతి పిన్న వయసులో హాఫ్ సెంచరీ సాధించిన రెండో ఆటగాడిగా సామ్ కాన్‌స్టాస్ (19 ఏళ్ల 85 రోజులు). అతడి కంటే ఇయాన్ క్రెయిగ్ (17ఏళ్ల 240 రోజులు) ముందున్నాడు. 1953లో దక్షిణాఫ్రికాపై హాఫ్ సెంచరీ చేశాడు.

## అశ్విన్‌కు ఈ విషయం తెలిసుంటే.. రిటైర్మెంట్ ఇచ్చేవాడు కాదేమో: రవిశాస్త్రి



**బ్రిస్బేన్‌:** బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియా భారత్ జట్ల మధ్య మూడో టెస్టు వర్షం కారణంగా డ్రా అయిన సంగతి తెలిసిందే. టీమ్ఇండియా అభిమానులు సంతోషపడిన వేళ స్టార్ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ 'రిటైర్మెంట్' ప్రకటించి ఫ్యాన్స్‌ను షాక్‌కు గురిచేశాడు. పింక్ బాల్ టెస్టు (అడిలైడ్)లో ఆడే అవకాశం వచ్చినప్పటికీ.. గబ్బా మ్యాచ్‌కు ఎంపిక కాకపోవడంతో మిగిలిన టెస్టులకు తీసుకొనే అవకాశం లేదనే ఉద్దేశంతో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికేశాడు. ఇప్పుడు మెల్‌బోర్న్ మ్యాచ్‌కు ఇద్దరు స్పిన్నర్లతో భారత్ బరిలోకి దిగింది. ఒకవేళ అశ్విన్‌కు ఈ విషయం తెలుసుంటే రిటైర్మెంట్ నిర్ణయం తీసుకొనేవాడు కాదేమోనని భారత మాజీ క్రికెటర్ రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు.

''మెల్‌బోర్న్ టెస్టు కోసం తుది జట్టు నుంచి శుభ్‌మన్ గిల్‌ను పక్కన పెట్టేయడం సాహసోపేతమైన నిర్ణయం. నితీశ్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ ఎంపిక కూడా క్లిష్టమైందే. వారిపై నమ్మకంతో మేనేజ్‌మెంట్ తీసుకుంది. ఇప్పటికే జట్టులో రవీంద్ర జడేజా ఉన్నాడు. ఇప్పుడు సుందర్‌ను తీసుకుంది. ఒకవేళ రవిచంద్రన్ అశ్విన్‌కు ముందే ఈ విషయం తెలిసి ఉంటే వీడ్కోలు నిర్ణయాన్ని ఇప్పుడే ప్రకటించేవాడు కాదేమో. మరికొంతకాలం ఆడే అవకాశం ఉండేది'' అని రవిశాస్త్రి తెలిపాడు.

అలా చేస్తే తక్కువేం కావు: కోహ్లీ కాన్‌స్టాస్ వాగ్వాదంపై గావస్కర్

విరాట్ కోహ్లీ కాన్‌స్టాస్ వాగ్వాదంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ''ఇలాంటిది జరగకుండా ఉంటే బాగుండేది. దాని నుంచి తప్పించుకొనే అవకాశం ఉంది. మీరు పాదచారుల మార్గంలో నడుస్తుంటే.. ఎదురుగా ఎవరైనా వస్తుంటే పక్కకు వైదొలగొచ్చు. అలా చేసినంత మాత్రాన మన స్థాయి ఏమీ పడిపోదు. ఇలాంటి ఘటనలు మైదానంలో చూసేందుకు బాగోవు'' అని గావస్కర్ వెల్లడించాడు.

**కొన్‌స్టాస్‌ను భుజంతో ఢీకొట్టిన ఘటనలో**

# కోహ్లీకి మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత

**మెల్‌బోర్న్‌:** మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగవ టెస్టులో.. యువ బ్యాటర్ సామ్ కొన్‌స్టాస్‌ను ..కోహ్లీ భుజంతో ఢీకొట్టాడు. క్రీజ్‌పై ఎదురెదురుగా నడుస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. ఆ ఘటన పట్ల ఐసీసీ చర్యలు తీసుకున్నది. కోహ్లీకి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించింది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ పదవ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. పిచ్‌పై ఎదురెదురుగా వెళ్తున్న సమయంలో.. కొన్‌స్టాస్ భుజాన్ని కోహ్లీ తాకాడు. ఆ తర్వాత ఇద్దరూ ఒకర్ని ఒకరు తిరిగి చూసుకున్నారు. కొన్ని మాటలు అనుకున్నారు. మరో బ్యాటర్ ఖవాజా వచ్చి ఆ గొడవను కూల్ చేసే ప్రయత్నం చేశాడు.ఇద్దరు ప్లేయర్లతో చర్చించిన ఆన్‌ఫీల్డ్ అంపైర్లు..కోహ్లీపై లెవల్ 1 అభియోగాన్ని నమోదు చేశారు. ఆ నేరం కింద అతనికి మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధించారు.



కోహ్లీకి ఒక మ్యాచ్ నిషేధం విధించే అవకాశాలు ఉన్నట్లు తొలుత కొందరు మాజీ క్రికెటర్లు అంచనా వేశారు. లెవల్ 2 నేరం అయితే కోహ్లీ నాలుగు పాయింట్లు కోల్పోయేవాడు. దాని వల్ల అతను ఓ టెస్టు మ్యాచ్‌ను దూరం అయ్యే అవకాశాలు ఉండేవి. క్రికెట్‌లో ఎటువంటి భౌతికపరమైన దాడి .. ఐసీసీ నియమావళిని ఉల్లంఘించినట్లు అవుతుంది. కోహ్లీ భుజం తాకిన ఘటనపై కొన్‌స్టాస్ స్పందించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత మాట్లాడుతూ.. అతనేమీ కావాలని భుజాన్ని ఢీకొట్టలేదన్నాడు. అకస్మాత్తుగా కోహ్లీ తనవైపు దూసుకొచ్చాడని, క్రికెట్‌లో ఇదంతా జరుగుతుందన్నాడు. ఇద్దరమూ భావోద్వేగానికి లోనైట్లు చెప్పాడు. ఈ ఘటన జరిగిన సమయంలో కొన్‌స్టాస్ 27 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నాడు. ఆ తర్వాత ఓవర్‌లో అతను బుమ్రా బౌలింగ్‌లో రెండు ఫోర్లు, ఓ సిక్సర్ కొట్టాడు.

# బాక్సింగ్ డే టెస్టులో.. ఖలిస్థానీ అనుకూలవాదుల రగడ

**మెల్‌బోర్న్‌:** మెల్‌బోర్న్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య మొదలైన బాక్సింగ్ డే టెస్టు మైదానంలో ఖలిస్థానీ అనుకూలవాదులు ఆందోళన చేయడం కలకలం సృష్టించింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి వారిని చెదరగొట్టారు.మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌కు కొందరు ఖలిస్థానీ మద్దతుదారులు టికెట్ లేకుండా లోపలికి చొరబడ్డారు. మ్యాచ్ జరుగుతుండగా ఖలిస్థానీ జెండాలు పట్టుకుని భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారి నిరసన పట్ల కొంతమంది భారత అభిమానులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అప్రమత్తమైన విక్టోరియా పోలీసులు వెంటనే ఖలిస్థానీ అనుకూలవాదులను అక్కడి నుంచి పంపించేసినట్లు తెలుస్తోంది. దీనిపై భారత అభిమానులు మీడియాతో మాట్లాడారు. ''ఈ ఘటనకు అనవసరమైన ప్రచారం కల్పించొద్దు. వారు చేసిన ఆందోళనకు విలువ లేదు. పంజాబ్‌తో అసలు సంబంధమే లేని వ్యక్తులు వచ్చి కావాలనే గొడవ చేశారు'' అని తెలిపారు.

కుంభమేళాకు పన్నూ బెదిరింపులు

ఇదిలా ఉండగా.. ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ మరోసారి భారత్‌పై బెదిరింపులకు పాల్పడ్డాడు. వచ్చే ఏడాది జరిగే మహా కుంభమేళాను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగే అవకాశం ఉందని ఓ వీడియో విడుదల చేశాడు. దీనిపై అఖిల భారతీయ అఖాడా పరిషత్ స్పందించింది. మతాల మధ్య విభేదాలు సృష్టించేందుకే ఈ తరహా కుయుక్తులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టింది. ఇలాంటి ఉన్మాదులను చాలా మందిని చూశామని పేర్కొంది.



## రజనీతో చెస్ చాంపియన్ గుకేశ్



**చెన్నై:** స్టార్ నటుడు రజనీకాంత్‌ను భారత యువ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ చెస్ చాంపియన్ డి గుకేశ్ కలిశారు. రజనీ ఆహ్వానం మేరకు తల్లిదండ్రులతో కలిసి ఆయన ఇంటికి వెళ్లిన గుకేశ్ తలైవాను కలిశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను గ్రాండ్ మాస్టర్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. విలువైన సమయాన్ని తనకోసం వెచ్చించిన రజనీకాంత్‌కు గుకేశ్ ధన్యవాదాలు తెలిపారు. మరో హీరో శివకార్తికేయన్‌ను కూడా గుకేశ్ కలిశారు.ప్రపంచ చెస్ చాంపియన్‌గా 18 ఏళ్ల గుకేశ్ అవతరించిన విషయం తెలిసిందే. సింగపూర్‌లో జరిగిన ఫిడే వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో చైనా క్రీడాకారుడు డింగ్ లిరెన్‌ను ఓడించి అతను విశ్వ విజేతగా నిలిచాడు. ఆ టైటిల్‌ను అందుకున్న అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

**స్టార్టప్ రొమాన్స్..**

## ఆ వలలో పడకండి: రాధికా గుప్తా

**ముంబయి:** సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ.. పెట్టుబడి పాఠాలు, సూచనలు, సలహాలు అందిస్తుంటారు ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ, ఎండీ రాధికా గుప్తా. తాజాగా తాను గమనించిన ఓ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించి యువతను అప్రమత్తం చేశారు.

''స్టార్టప్ రొమాన్స్ సంస్కృతి పెరుగుతోంది. స్టార్టప్ లైఫ్ అంటే సరదా వాతావరణంలో పని, రోజంతా ఐడియాలపై చర్చలు, నిధుల సమీకరణ, సోషల్ మీడియాలో ఉచిత సలహాలు ఇవ్వడం, వారాంతాలు సరదాగా గడపడం అనే అభిప్రాయం చక్కర్లు కొడుతోంది. ఆ ఉచ్చులో పడకండి. త్వరలోనే స్టార్టప్ వాస్తవం బోధపడుతుంది. అంతంతమాత్రంగానే నిధుల లభ్యత, పరిమిత పని పరిస్థితులు, తిరస్కరణలు, నియామకాల్లో సవాళ్లు, అనిశ్చిత పరిస్థితులు, ఒత్తిడి కూడా అందులో భాగమేనని అర్థమవుతుంది'' అని రాధిక రాసుకొచ్చారు. ఆమె చేసిన ముందుజాగ్రత్తపై నెట్టింట్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

''స్టార్టప్ అనేది అంత సులభమైన విషయం ఏమీ కాదు. ప్రజలు విజయవంతమైన వ్యక్తుల జీవితాలను మాత్రమే చూస్తారు. వాటికే ఆకర్షితులవుతారు. ఐదు శాతం విజయాలతో పాటు 95 శాతం అపజయాలు ఉన్నాయని మర్చిపోతారు'' అని ఓ నెటిజన్ స్పందించారు. ''1998లో నేనొక స్టార్టప్ పెట్టాను. పెద్ద ఐటీ సంస్థలో ఉద్యోగం రాకపోవడం వల్లే నేను దానిని ప్రారంభించానని అంతా అనుకున్నారు. కానీ విజయం తర్వాత అంతా గర్వపడ్డారు. ఇప్పుడు స్టార్టప్ అంత రిస్కీ కాదు. అనుకున్న లక్ష్యాన్ని చేరకపోయినా.. గౌరవప్రదమైన జీతాన్ని పొందడానికి వీలుంది'' అని మరొకరు రాసుకొచ్చారు.

## ఇ-పాన్ కార్డ్ అంటూ మెయిల్.. క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ!

**ముంబయి:** సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఊసరవెల్లిలా రంగులు మార్చుకుంటూ అమాయక ప్రజలను మోసగిస్తున్నారు. తాజాగా ఇపాన్‌కార్డు డౌన్‌లోడ్ పేరిట కొత్త ఎరను సిద్ధం చేశారు. పాన్ కార్డును సులువుగా డౌన్‌లోడ్ చేసుకోండంటూ ఇమెయిల్స్ పంపిస్తున్నారు. ఒకవేళ పొరపాటున ఆ లింకులు క్లిక్ చేస్తే మీ ఖాతా ఖాయం కావడం ఖాళీ అంటోంది ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ విభాగం.




పాన్ 2.0 గురించి విస్తృతంగా చర్చ జరుగుతున్న వేళ సైబర్ నేరగాళ్లు ఈ కొత్త మోసానికి తెరతీయడం గమనార్హం. ఆన్‌లైన్‌లో సులువుగా పాన్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోండి.. అంటూ ఆదాయపు పన్ను శాఖ పేరిట ఈ ఇమెయిల్స్ పంపిస్తున్నారు. అదెలా చేసుకోవాలో స్టెప్‌బైస్టెప్ వివరిస్తామని అందులో ఉంటోంది. అలాంటి ఇమెయిల్స్ మీకూ వచ్చి ఉంటే లింక్స్ క్లిక్ చేయొద్దని పీఐబీ తెలిపింది. ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ పేరుతో మీ దగ్గర నుంచి యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్‌లు తస్కరించే అవకాశం ఉందని తెలిపింది. పిన్, పాస్‌వర్డ్‌లు కోరుతూ ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఎప్పుడూ వ్యక్తిగత ఇమెయిల్స్ పంపించబోదని గుర్తు చేసింది. ఇలాంటి ఇమెయిల్స్ వస్తే ఎలా వ్యవహరించాలో ఐటీ శాఖ కొన్ని సూచనలు చేసింది. ఫిషింగ్ ఇమెయిల్స్ వస్తే వాటికి సమాధానం ఇవ్వొద్దని సూచించింది. వారు పంపించే అటాచ్‌మెంట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవొద్దని పేర్కొంది. లింక్స్‌పై క్లిక్ చేయొద్దని, ఒకవేళ పొరపాటున చేసినా మీ వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎంటర్ చేయొద్దని తెలిపింది. ఈ మెయిల్స్, కాల్స్, ఎస్ఎంఎస్ ఇలా ఏ విషయానికి స్పందించొద్దని, ఆర్థిక, వ్యక్తిగత విషయాలు సంబంధించిన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించింది. ఆర్థిక విషయాలు, వ్యక్తిగత వివరాలు నమోదు చేయాల్సిన సందర్భాల్లో అధికారిక వెబ్‌సైట్లనే ఆశ్రయించాలని సూచించింది.

## డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో హోండా కొత్త యూనికార్న్

**ముంబయి:** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ఒక్కొక్కటిగా తన వాహన శ్రేణిని ఆధునికీకరిస్తోంది. ఇటీవల యాక్టివా 125, ఎస్ 125, ఎస్‌పీ 160 వాహన శ్రేణిని ఆధునికీకరించగా.. తాజాగా 2025 మోడల్ యూనికార్న్‌ను ఆవిష్కరించింది. ఓబీడీ2బీ ప్రమాణాలను అనుగుణంగా యూనికార్న్‌ను తీర్చిదిద్దింది. కొత్తగా ఏమార్పులు చేశారో చూద్దాం..

2025 హోండా యూనికార్న్‌లో ముందువైపు స్వల్ప మార్పులు చేశారు. క్రోమ్ అలంకారంతో కూడిన ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్‌ను ఇచ్చారు. ఇది మినహా పెద్దగా ఎలాంటి మార్పులూ చేయలేదు. రేడియంట్ రెడ్ మెటాలిక్, మ్యాటీ యాక్సిస్ గ్రే మెటాలిక్, పెరల్ ఇగ్నియస్ బ్లాక్ రంగుల్లో తీసుకొచ్చారు. పెరల్ సిరెన్ బ్లూ రంగును తొలగించారు. కొత్త యూనికార్న్‌లో ఫుల్లీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లసర్‌తో వస్తోంది. ఇందులో స్పీడ్, గేర్ పొజిషన్, ఎకోమోడ్ ఇండికేటర్, సర్వీస్ అలర్ట్ వంటి ఫీచర్లను జోడించారు. దీంతో పాటు యూఎస్‌బీ టైప్‌సి ఛార్జింగ్ పోర్ట్‌ను ఇచ్చారు. ఓబీడీ2బి ప్రమాణాలకు అనుగుణంగా ఇంజిన్‌లో స్వల్ప మార్పులు చేశారు. ఇది మినహా హార్డ్‌వేర్ పరంగా పెద్దగా మార్పుల్లేవు. 5స్పీడ్ గేర్‌బాక్స్ ఉంది. హోండా కొత్త యూనికార్న్ ధర రూ.1.19 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. ప్రస్తుత మోడల్‌తో పోలిస్తే దీని ధర రూ.8వేలు అధికం.








విశ్వంభర V3 NEWS

మన సినిమా - ఫస్ట్ రీల్

# నవల లాంటి సినీ చరిత్ర!




- త్రివిక్రమ్

'భక్త ప్రహ్లాద' సరైన విడుదల తేదీని తన పరిశోధనలో వెలికి తీసిన ప్రముఖ జర్నలిస్టు రచయిత, ఉత్తమ 'సినీ విమర్శకుని'గా నంది పురస్కార గ్రహీత డాక్టర్ రెంటాల జయదేవ పాతికేళ్ల సినీ పరిశోధనకు అక్షర రూపం 'మన సినిమా... ఫస్ట్ రీల్'. దక్షిణ భారత సినిమా చరిత్రను సమగ్రంగా పాఠకులకు అందిస్తున్న గ్రంథం ఇది. ఎమెస్కో పబ్లికేషన్స్ ప్రచురించిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని బోయి విజయ భారతి వేదికపై జరిగింది. ప్రముఖ దర్శకులు త్రివిక్రమ్ పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని ఐఆర్ఎస్ అధికారి కృష్ణ కౌండిన్యకు, మలి ప్రతిని సభాధ్యక్షత వహించిన 'ఎమెస్కో' విజయ్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జయదేవకు జర్నలిజంలో పాఠాలు చెప్పిన గురువు ఆచార్య డి. చంద్రశేఖర్ రెడ్డి, ప్రముఖ కవి విమర్శకులు అఫ్సర్, రచయిత్రి కల్పనా రెంటాల, దర్శకులు దశరథ్, సీనియర్ జర్నలిస్ట్ ఇందిరా పరిమి తదితరులు పాల్గొన్నారు. త్రివిక్రమ్ చేతుల మీదుగా 'మన సినిమా... ఫస్ట్ రీల్' పుస్తకం అందుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు రచయిత త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడారు. ''ఒక రచయిత పీహెడ్‌డీ గ్రంథం రాస్తే ఎలా ఉంటుందో... 'మన సినిమా ఫస్ట్ రీల్' పుస్తకం అలా ఉంది. నా దృష్టిలో జయదేవ కాలమిస్ట్, జర్నలిస్ట్ మాత్రం కాదు. అంతకు మించిన వాడు. కచ్చితంగా రచయితకు ఉండాల్సిన అన్ని లక్షణాలు ఉన్నవాడు. ఒక విషయాన్ని చాలా ఆథెంటిక్‌గా చెప్పగలడు. 'ఫస్ట్ రీల్'లో తెలుగు టాకీ తాలూకా కథ చెప్పాడు. ఇదొక నవల లాంటి పుస్తకం. సినిమా మీద ప్రేమ ఉన్న వ్యక్తి పుస్తకం రాస్తే ఎంత ప్రామాణికంగా ఉంటుందో ప్రూవ్ చేశాడు. జయదేవ సినిమా రచయిత అయ్యేలోపు మరిన్ని పుస్తకాలు రాయాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు.

## జనవరి 1న హిట్లర్ రీ రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'హిట్లర్' మూవీ 1997లో ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా చిరంజీవికి టర్నింగ్ పాయింట్ అని చెప్పొచ్చు. తన ఇమేజ్‌కు భిన్నంగా ఐదుగురు చెల్లెలకు అన్నగా మెగాస్టార్ నటించిన 'హిట్లర్' మూవీ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. మెగాస్టార్ స్ట్రాంగ్ కం బ్యాక్ ఇచ్చారు. ఇక ఈ మూవీని దాదాపు రిలీజ్ అయ్యి దాదాపు 27 ఏళ్లు పూర్తవుతుంది. 1997 జనవరి 4న 'హిట్లర్' మూవీ రిలీజ్ అయింది. ఆ ఏడాది బిగ్గెస్ట్ కమర్షియల్ హిట్ గా నిలిచిన ఈ మూవీని మళ్లీ జనవరిలోనే రీరిలీజ్ చేస్తున్నారు. 2025 జనవరి 1న న్యూ ఇయర్ సందర్భంగా 'హిట్లర్' మూవీని రీ రిలీజ్ చేయబోతున్నారు సాయి సినీ చిత్ర బ్యానర్ వారు. సూపర్ సాంగ్స్, ఎమోషన్స్ సీన్స్, కమర్సిల్ ఎలిమెంట్స్ ఇలా అన్ని కలిసిఉన్న ఈ సినిమా కోసం మెగాస్టార్ అభిమానులు థియేటర్స్ లో న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.





## అనగనగా ఒక రాజు ప్రీ వెడ్డింగ్ వీడియో టీజర్ విడుదల

యువ సంచలనం నవీన్ పొలిశెట్టి మూడు వరుస ఘన విజయాలతో తెలుగునాట ఎంతో పేరు సంపాదించుకున్నారు. అనతికాలంలోనే అన్ని వర్గాల ప్రేక్షకుల మనసు గెలిచిన కథానాయకుడిగా నిలిచారు. ప్రస్తుతం అత్యధిక డిమాండ్ ఉన్న యంగ్ స్టార్ లలో నవీన్ ఒకరు. అయితే తీవ్ర గాయాల కారణంగా ఆయన సంవత్సరం పాటు నటనకు దూరమయ్యారు. ఇప్పుడు పూర్తిగా కోలుకొని, తన నూతన చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. నవీన్ పొలిశెట్టి పుట్టినరోజు సందర్భంగా ప్రీ వెడ్డింగ్ వీడియో టీజర్‌ను నిర్మాతలు ఆవిష్కరించారు. నవీన్ పొలిశెట్టి మాదిరిగానే ఈ వీడియో ఎంతో ప్రత్యేకంగా పూర్తి వినోదాత్మకంగా ఉంది.

ప్రీ వెడ్డింగ్ వీడియోలో నవీన్ పొలిశెట్టి పోషించిన రాజు పాత్ర తన వివాహానికి సిద్ధమవుతున్నట్లు చూపించారు. రాజు గారి పెళ్ళి అంటే ఎలా ఉండాలి? అంటూ భోజనాల దగ్గర చమ్మక్ చంద్ర చేసిన హడావుడి నవ్వులు పూయించింది. ఇక అనంత్ అంబానీ వివాహానికి హాజరైన హాలీవుడ్ ప్రముఖుల ఫోన్ నెంబర్ల కోసం, నవీన్ ఏకంగా ముఖేష్ అంబానీకి ఫోన్ చేసి మాట్లాడినట్లు చూపించడం కడుపుబ్బా నవ్వించింది.

అలాగే ప్రీ వెడ్డింగ్ ఫోటోషూట్ సమయంలో వధువుగా మోస్ట్ హ్యాపెనింగ్ నటి మీనాక్షి చౌదరి కనిపించారు. ఈ ఫోటోషూట్ సమయంలో కూడా నవీన్ పోషించిన రాజు పాత్ర నవ్వులు పంచింది.

రాజుగా నవీన్ పొలిశెట్టి మార్క్ హాస్యం, అద్భుతమైన విజువల్స్, సంగీతం ఈ ప్రీ వెడ్డింగ్ వీడియో టీజర్ ని బ్లాక్ బస్టర్ గా మలిచాయి. ముఖ్యంగా నవీన్ కామెడీ టైమింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే, ఫోటోషూట్ సమయంలో మీనాక్షి చౌదరితో నవీన్ కెమిస్ట్రీ చక్కగా కుదిరింది. వెండితెరపై ఈ అందమైన జోడి, ప్రేక్షకులను మాయ చేయడం ఖాయమనిపిస్తోంది.

అనగనగా ఒక రాజు చిత్రానికి నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. 2025లో ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది. తాజాగా విడుదలైన ప్రీ వెడ్డింగ్ వీడియో టీజర్, ఈ చిత్రంతో నవీన్ పొలిశెట్టి మరో ఘన విజయాన్ని ఖాతాలో వేసుకోవడం ఖాయమని హామీ ఇస్తుంది.

## దూరదర్శిని

### చూసిన అందరూ ఇది నా కథ అనుకుంటారు: హీరో సువిక్షిత్

సినిమా అందరిని మళ్లీ మీ చిన్ననాటి గోల్డెన్‌డేస్‌కు తీసుకవెళుతుంది. చాలా రోజుల తరువాత నాకు ఈ చిత్రంలో మంచి పాత్ర దొరికింది. దూరదర్శిని సినిమా నటుడిగా నాకు ఓ ప్రత్యేక సినిమాగా ఉంటుంది' అన్నారు.

సువిక్షిత్ బొజ్జ, గీతిక రతన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దూరదర్శిని'. 'కలిపింది ఇద్దరిని' అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకుడు. వారాహ మూవీ మేకర్స్ పతాకంపై బి.సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. 1990వ నేపథ్యంలో అందరి హృదయాలను హత్తుకునే ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను గురువారం ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ విడుదల చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆర్‌పీ పట్నాయక్ మాట్లాడుతూ '' ఈ చిత్ర కథానాయకుడు చాలా కాలంగా తెలుసు. జెమిని సురేష్ ఈ సినిమా గురించి చాలా చెప్పాడు. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని చెప్పే వాడు. ఈ సినిమాకు చాలా పాజిటివ్ వైబ్స్ ఉన్నాయి. ఈ సినిమా అందరిని 90వ దశకంలోకి తీసుకెళ్లి మీ జ్ఞాపకాల్ని గుర్తుకు తెస్తుంది. అందరికి వాళ్ల వాళ్ల ప్రేమకథలు కూడా గుర్తుకు వస్తాయి. ఈ సినిమా విజయం సాధించి టీమ్ అందరికి మంచి గుర్తింపు తీసుకరావాలి' అన్నారు.

జెమిని సురేష్ మాట్లాడుతూ '' సినిమా పరిశ్రమలో స్థిరపడాలనే సంకల్పంతో సువిక్షిత్ ఈ సినిమా తీశాడు. ఈ చిత్రం కోసం ఎంతో కష్టపడ్డాడు. 90వ దశకంలోని పూర్తి డిటైల్‌డ్‌గా దర్శకుడు సినిమాను తెరకెక్కించాడు. ఈ సినిమా అందరిని మళ్లీ మీ చిన్ననాటి గోల్డెన్‌డేస్‌కు తీసుకవెళుతుంది...

గీతిక మాట్లాడుతూ '' దూరదర్శిని సినిమా చాలా మంచి చిత్రం. తప్పకుండా అందరికి తమ మరపురాని రోజులను గుర్తుకు తెస్తుంది. నాకు ఈ చిత్రంలో అవకాశం వచ్చినందుకు ఎంతో సంతోషపడుతున్నాను. ఈ సినిమాలో దూరదర్శిని వాణి, హరిల ప్రేమను ఎలా కలిపింది అనేది ఆసక్తికరంగా ఉంటుంది' అన్నారు.

సువిక్షిత్ మాట్లాడుతూ '' 1990వ నేపథ్యంలో నడిచే కథ. అందరికి కనెక్ట్ అయ్యే కథ ఇది. బ్యాక్‌డ్రాప్‌కు తగ్గ నటీనటులతో, లోకేషన్స్‌తో ఎంతో సహజంగా తెరకెక్కించిన సినిమా ఇది. ఈ సినిమా కోసం అందరం ఎంతో రీసెర్చ్ చేసి ఎంతో డిటైల్‌డ్‌గా దర్శకుడు చిత్రాన్ని రూపొందించాడు. ఈ సినిమాలో ఉన్న ఎమోషనే ఈ చిత్రంలోని ప్లస్ పాయింట్. సినిమా చూసిన ప్రతి ఒక్కరు ఇది నా కథ అనుకుంటారు. అందరూ ఎంతోగా కనెక్ట్ అవుతారు. తప్పకుండా చిత్రాన్ని అందరూ ఎంతో బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ఈ సమావేశంలో దర్శకుడు కార్తియక కొమ్మి, తిరుపతి రెడ్డి, నారాయణ, కొరియోగ్రాఫర్ సునీల్ పొన్నం, బాలారాజు, తేజ, పాండు, జెమిని సురేష్, గీతిక, డీఓపీ సతీష్, తదితరులు పాల్గొన్నారు. నటీనటులు: సువిక్షిత్ బొజ్జ, గీతిక రతన్, జెమిని సురేష్, లావణ్య రెడ్డి, కిట్టయ్య తదితరులు.



## ఫిబ్రవరి 28న 'శబ్దం' విడుదల



ఆది పినిశెట్టి, అరివళగన్, 7G ఫిల్మ్స్, ఆల్ఫా ఫ్రేమ్స్ తెలుగుతమిళ బైలింగ్వల్ మూవీ 'శబ్దం' ఫిబ్రవరి 28, 2025న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ 'వైశాలి'తో సూపర్‌హిట్‌ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌లు రెండోసారి మరో ఇంట్రస్టింగ్ సూపర్‌నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ 'శబ్దం' కోసం చేతులు కలిపారు. 7G ఫిల్మ్స్ శివ, ఆల్ఫా ఫ్రేమ్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఎస్ భానుప్రియ శివ సహనిర్మాత. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజా మేకర్స్ 'శబ్దం' రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ఫిబ్రవరి 28, 2025న ఈ చిత్రం వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ హీరో ఆది పినిశెట్టి ఇంటెన్స్ లుక్ అదిరిపోయింది.

ఈ చిత్రాన్ని ముంబయి, మున్నార్, చెన్నైలోని అనేక ప్రదేశాలలో చిత్రీకరించారు. కేవలం ఇంటర్వెల్ సీక్వెన్స్ కోసమే 2 కోట్ల రూపాయల బడ్జెట్‌తో 120 ఏళ్ల నాటి లైబ్రరీ సెట్‌ను నిర్మించారు.

సంగీత దర్శకుడు థమన్ సినిమా కోసం ప్రత్యేకమైన సౌండ్ ఎఫెక్ట్స్ ,ఆర్ఆర్ చేయడానికి హంగేరీకి వెళ్లాలని ప్లాన్ చేస్తున్నారు. సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లీ, ఎం.ఎస్. భాస్కర్, రాజీవ్ మీనన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి అరుణ్ పద్మనాబన్ డీవోపీగా పని చేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత సాబు జోసెఫ్ ఎడిటింగ్ చేస్తున్నారు. మనోజ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్.

తారాగణం: ఆది పినిశెట్టి, సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లీ, ఎం.ఎస్. భాస్కర్, రాజీవ్ మీనన్

సాంకేతిక విభాగం:

రచన, దర్శకత్వం, లైన్ ప్రొడ్యూసర్: అరివళగన్

నిర్మాత: 7G శివ

బ్యానర్లు: 7G ఫిల్మ్స్, ఆల్ఫా ఫ్రేమ్స్

సహ నిర్మాత: భానుప్రియ శివ

సంగీతం: థమన్ ఎస్

డీవోపీ అరుణ్ బత్మనాభన్

ఎడిటర్: సాబు జోసెఫ్

ఆర్ట్ డైరెక్టర్: మనోజ్ కుమార్

స్టంట్స్ : స్టన్నర్ సామ్

ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్ బాల కుమార్

పీఆర్వో: వంశీశేఖర్

## నన్ను నిలబెట్టినవి ఆ రెండు సినిమాలే: తనికెళ్ల భరణి!

రచయితగా... నటుడిగా తనికెళ్ల భరణికి మంచిపేరు ఉంది. నాటక రంగం నుంచి సినిమా ఇండస్ట్రీకి వచ్చిన వారిలో ఆయన ఒకరు. తాజాగా 'ఐ డ్రీమ్' వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో భరణి మాట్లాడుతూ... "నాటకాలు రాస్తూ వెళుతున్న నాకు 'కంచు కవచం' సినిమాతో రచయితగా ఛాన్స్ వచ్చింది. కానీ ఆ సినిమాకి పనిచేయడం నాకు ఇష్టం లేక చెన్నై నుంచి వచ్చేశాను. ఆ తరువాత 'పట్నం పిల్ల పల్లెటూరి చిన్నోడు' సినిమా కోసం వెళ్లాను... వచ్చేశాను" అని అన్నారు.

"ఆ తరువాత చెన్నై వెళ్లినప్పుడు దర్శకుడు వంశీ గారికి నన్ను రాళ్లపల్లిగారు పరిచయం చేశారు. కామెడీ రాయాలని చెబుతూ, వంశీగారు నాకు ఏడు సీన్లు ఇచ్చారు. ఆ సాయంత్రానికే రాసుకుని తీసుకుని వెళితే వంశీ ఆశ్చర్యపోయాడు. నేను రాసిన సీన్లు చదివిన తరువాత, ఆయన అదే పనిగా నవ్వాడు. 'నాకు కావలసిన రైటర్ దొరికేశాడు... నెక్స్ట్ సినిమా మీరే రాస్తున్నారు' అని అన్నాడు. ఆ సినిమానే 'లేడీస్ టైలర్'.

"ఆ సినిమా తరువాత ఒక రచయితగా నేను వెనుదిరిగి చూసుకోలేదు. 'కనకమహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్... చెట్టుకింద ప్లీడర్... ఇలా ఓ అరడజను సినిమాల వరకూ నేనే రాశాను. 'లేడీస్ టైలర్' నా కెరియర్ కి ఎంతో ఉపయోగపడిన సినిమా. రచయితగా నాకు ఒక స్థాయిని తెచ్చిపెట్టిన సినిమాw అది. ఆ తరువాత నటుడిగా కూడా వేషాలు వేస్తూ వెళ్లాను. నటుడిగా 'శివ' సినిమా మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. 'యమలీల'తో నటుడిగా బిజీ అయ్యాను. ఆ సినిమా తరువాత నటుడిగా 26 సినిమాలకి సైన్ చేశాను" అని చెప్పారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com